UNIVERSAL LIBRARY
OU_204435
UNIVERSAL LIBRARY

Osmania University Library

Call No T82
S49P

Accession No. T1173

Author

Title

This book should be returned on or before the date last marked below.

శ్రీరస్తు.

పాండవాజ్ఞాతవాసము.

బ్రహ్మశ్రీ, జనమంచి శేషాద్రిశర్మకృతము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1921.

Printed by
V RAMASWAMY SASTRULU & SONS
at the "VAVILLA" PRESS,
MADRAS.—1921.

విజ్ఞప్తి.

రసికశిఖామణులారా!

నాటకలక్షణముల నెల్ల నెఱింగిన మీకు నేను విన్నవించుకొనఁదలఁచిన విషయములు క్రొత్తవిగావు. అయినను చాపల్యమున విన్నవించుకొనుచున్నాఁడను. "నాటకాంతంహి సాహిత్యమ్" అనుట సుప్రసిద్ధము. ఈసూక్తివలన నాటకములయం దేదో యొకయద్భుత ముండి తీఱవలయు నని తేలక మానదు. కావ్యములకంటె నాటకమువ్రాయించుటలోఁ గష్టము దోఁపదు. మఱెందు కీసూక్తి? అన నిందుపమానరహిత రసప్రవాహము గలదని చెప్పక తప్పదు. ఒక్కొక్కమాటయుఁ దూఁచినట్లుండవలయు. అనఁగా రసమయముగ నుండవలయును. శృంగారవర్ణనమున శ్రుతికటువులగు పదములకూర్పు, యుద్ధవర్ణనమున సులలితపదములకూర్పు మొదలగునవి వర్జింపఁదగినవి.

పాత్రప్రవేశమున కొకహేతువుండవలయును. అసందర్భముగఁ బాత్రము రంగస్థలమునఁ బ్రవేశింపరాదు. అట్లు ప్రవేశింపఁజేసినచో నది కవిశక్తిన్యూనతను వెల్లడించును. పాఠకులు బుద్ధిమంతులగుచో పెదవివిఱుతురు. పూర్వోత్తరసందర్భానుసారముగఁ బాత్రప్రవేశమును గల్పించుటయు, రసముచెడుపని వాక్యములు పద్యములుపయోగించుటయుఁ గవికిఁ బ్రధానకార్యములు. కవిదృష్టి యీరెండుకార్యములపైఁ బ్రసరింపదేని ఆతఁ డంధుఁడనియే చెప్పఁదగు.

ఇఁకఁ బ్రకృతపునాటకవిషయమై నాల్గుమాటలు మనవి చేయం దలంచితిని.

పాండవులు పండ్రెండుసంవత్సరము లరణ్యవాస మొనరించిరి. పదుమూఁడవయేఁట నజ్ఞాతవాసవ్రతమూనవలసినవారైరి. ఆసంవత్సరమే వారికి దారుణతమమైనదనుటకు సందేహము లేదు. ఏమాత్రము భంగముకల్గినను మరలఁ బండ్రెండేఁడులువనవాసము. ఒక్కసంవత్సర మజ్ఞాతవాసము

జరపఁదగినవారగుదురు. ఇట్టియుక్తియుత నాసంవత్సరము నాఁడు మొదలుగఁ దగిన దెట్లో, వారియం దాదృతిగల బంధుమిత్రు లెట్టుల త్రిప్పఁదగునో ఆలోచింపుఁడు.

కౌమార్యాదులగు నాశ్రితులు, వారినివదలిరి. వారిజాతకముఁ దెలి యనట్లే ప్రవర్తించిరి. శ్రీకృష్ణాదిబంధువులు అట్లే ప్రవర్తించిరి. ఇంతయేల పాండవులు ధర్మతత్పరులని మెచ్చిఁగినవారెల్ల వారికాసంవత్సరవ్రత మెట్లు గడచునా, ఎట్లు కృతకృత్యులయి శత్రుధ్వంసము గావించి విజయశ్రీ విరాజమానులగుదురా యని విచారించుచునేయుండిరని చెప్పకతీఱునా !

ఇట్టి కష్టతరకాలము నెట్లోగడపి భగవదనుగ్రహపాత్రులుగాన గట్టెక్కిరి. గాఢాంధకారమును వెలికిఁ ద్రోచి పొడసూపిన చండమార్తాండు నివిధంబునఁ బ్రకాశించిరి.

ఇట్టికథ నాటకముగా వ్రాయునపుడు వారిగౌరవమునకు భంగము రానీయక వారిభృత్యభావమును సమర్థింపవలసియుండునుగదా !!

విరాటుఁ డుత్తమనాయకుఁడు. ఆతని యుత్తరపురము పరమపవిత్రమైనది. తత్పుత్రయగు నుత్తర యుత్తమశీల. ఇట్టి వారియందు గళంకముగలదని తోఁచునట్లు కవి కథలను గల్పింపరాదు. కల్పించినచో దోషి యనం బడు. నాటకముం జూచువారలకుఁ బూర్వపు రాజకుటుంబముల చర్యలు తమకు దృష్టాంతభూతములుగా నున్నవని తోఁచునట్లు వ్రాయవలయునే గాని దురాచారములు వారియందున్నట్లు తోఁపఁజేయు కల్పనలఁ గల్పింపరాదు.

అభిమన్యుఁడు మహావీరుఁడు. శ్రీకృష్ణుని మేనల్లుఁడు. అర్జునునకుఁ బరాక్రమమునఁ దీసిపోవువాఁడు కాఁడు. అట్టి మహావీరుఁడు తండ్రుల యిక్కట్టులనెఱిఁగియుఁ దనతండ్రుల వెనుక నెలకుముందుగా విరాటునిపురికి బ్రాహ్మణవేషమున నరుగుటయు, అందు కంకభట్టు మొదలగువారు తనతండ్రులని తెలిసికొని వీధిలో వారిని బలాత్కరించుటయు, వారు ఛీపొమ్మనుటయు వినఁ జనువఁదగని కల్పనలుగాక మఱెట్టివి ? అభిమన్యుఁడు నిద్రపోవుచుండ నుత్తరవనవిహారమునకుంబోయి యూతనింగాంచి మోహించుటయు, అంతలో నొకపాముపచ్చుటయు, క్షత్రియవరేణ్యపుత్రికయుఁ బ్రౌఢయునగు

నుత్తర దానింజూచినంతనే 'కుయ్యో మొర్రో' యని యార్చి యార్భిల్లుచును సర్వప్రకారముల రసభగ్నము గదా. మానవస్త్రీలయందు క్షత్త్రియవరపుత్త్రి యట్లు భయంపడెనని కల్పించుట యొకగొప్పలోపము! అసంగతము!! రసభంగము!!!

ఇట్టి యసంగతపుఁగల్పనల కవకాశ మీయక వ్రాసినచో నీపరమ పవిత్ర చరిత్రము చదువువారలకును, నాటకమును ప్రదర్శించుచుండ జూచువారలకును సంతోషదాయకముగా నుండును.

ఇంక రంగములనుగూర్చి నాలుగుమాటలు వ్రాసెదను. నాటకస్థలమునకే రంగమని పేరు అందుచే నొక్కొక్క యంకమున నియమమే పాటింపక తోఁచినన్ని రంగములను గల్పించుట యొక క్రొత్తరసహీనపుఁ బద్ధతి. అట్లు కల్పించుటచేఁ గథ తాఱుమాఱగుచుండుటయుఁ గలదు. యవనికమార్పఁబడుచున్నప్పుడెల్లను నిది యున్నచరంగమండీయని చూచువారలకుపదేశించుటయే యీమహాకల్పనకు ఫలమేమో, ఆహా! ఏమి రసము? ఏమికల్పనము? ఏమిపాండిత్యము ?

ఆర్యులారా! నాటకము దృశ్యప్రబంధముగాన నట్టిదానిని రచించునపుడు కవిజాగరూకుఁడై లోకులకు నీతిబోధించుటయేఫల మీనాటకమునకని తెలిసికొని వ్రాయవలసియుండునేగాని దుర్నీతిని బోధించుటకుఁ గాదని మీనుండి నేర్చుకొన్న యీయొక్కమాటనే మరల మిమ్ముగూర్చి మనవిచేయుచున్నాఁడను. వాక్చాపల్యమును సహింతురుగాక.

ఈ నాటకమున మహాత్ముఁడగు తిక్కనసోమయాజిగారి పద్యముల యర్థమునే చాలభాగము గ్రహించితిని. రసమున్నచో వారిదని,విరసముగనున్నచో నాదియని గ్రహింపఁజను.

ఇది వ్రాసిన కొలఁదిదినములకే నాయందత్యంతాదృతిగల్గియున్న మ॥ రా॥ శ్రీ వావిళ్ల. రామస్వామిశాస్త్రులుగారిపుత్త్రులు, నానాదేశసంవ్యాప్తకీర్తిమల్లికామతల్లికావతంసులు, పరోపకారపారీణులు, విద్యార్థిజనకల్పకప్రతిములునగు శ్రీ వేంకటేశ్వరశాస్త్రులుగారు ముద్రించి నన్ను సఫలమనోరథుంగావించిరి.

మఱొక్కమనవి: —

నాకు సంగీతజ్ఞానము౦బరకుసుమము నామిత్రులు పాటలు కొన్ని యైన నిందుఁ జేర్పఁదగునని హెచ్చరించినందున విధిలేక యంగీకరించి నాకుం దోఁచినట్లు వ్రాసియీయఁగా వానికిందగిన రాగతాళముల నమర్చి నాకష్టమును దీర్చినవారు కడపపుర వాస్తవ్యులు బ్ర॥శ్రీ మేడవరపు జన్నయ్యగారే యని విన్నవించి యీనాటకమునందుఁ దెలిసియో తెలియకయో నాచేసిన తప్పులను దెల్పి నాచేతనే దిద్దింపుఁడని మిమ్ములఁ గోరుచున్నవాఁడ.

“కింవాప్రార్థనయా పరోపకృతిషు స్వాభావిక స్సద్గుణః” అనుసూక్తి నామది గట్టిగా నాటియున్న దనియు విన్నవించుచున్నవాఁడ.

ఇట్లు పండితపాదసేవకుఁడు,

జనమంచి శేషాద్రిశర్మ.

ఇందువచ్చు పాత్ర నామములు.

పురుషులు.

ధౌమ్యుఁడు	కీచకుఁడు
పంచపాండవులు	బృహన్నల
దుర్యోధనుఁడు	ఉత్తరుఁడు
దుశ్శాసనుఁడు	భీష్ముఁడు
కర్ణుఁడు	ద్రోణుఁడు
శకుని	కృపుఁడు
విరాటుఁడు	అశ్వత్థామ
కంకభట్టు	శ్రీకృష్ణుఁడు
మంత్రులు	అభిమన్యుఁడు

స్త్రీలు.

ద్రౌపది	కీరవాణి
సైరంధ్రి	సుదేష్ణ
చండిక	ఉత్తర

వీరుగాక సందర్భానుసారముగ నింకను గొంతమంది వత్తురు.

పద్యములయందుఁబడిన యచ్చుతప్పులకు
సవరణలు.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
30	19	యాఁజగ	యాఁజిగ
45	5	కాఁదురుక్తుల	కాఁమదురుక్తుల
,,	23	నఖంలుఁలం	నఖంబులం
,,	26	తాఁంతపురి	తాఁంతుపురి

శ్రీరస్తు.

పాండవాజ్ఞాతవాసము.

ప్రస్తావన.

నాంది.

శా. శ్రీకల్యాణగుణాభిరాముఁడగుచున్ శృంగారనారాశియై
వీఁకన్ శాత్రవకోటి పెంపడఁచి యుర్వీభారముం దీర్చు న
[1]స్తోక ప్రాభవమొప్పు ధాత్రిపతి యుం సంతోషభిల్లు శ్రీరామునిన్
శాకారిప్రముఖార్చితాంఘ్రికమలుం బ్రార్థింతు భద్రాప్తికై. 1

౧ పాట.

సూత్రధారుఁడు:—(నాంద్యంతమున మహానందముతో దిక్కులుపరికించి) ఔరా! రసికశిఖామణులచే రంగస్థలమంతయు నింతలోనే నిండియున్నదే.

ఉ. చారుమృదంగనాదములు సర్వబుధస్తుతిసేయుమాడ్కిఁ జె
న్నారెడుఁ బ్రస్తరప్రతతి నన్నుచు వే నిరగించు నప్పిపం
[2]నీరవ మెల్లసభ్యులు సుచిత్రములౌ ప్రమదాబ్ధిముంచుచున్
హారిశరంబుగా నెలసె నౌర! యిదే సభ చూడ నొప్పెడున్. 2

(ఆకాశమునకుఁ జూడ్కి నిగుడించి) ఇంతకాలమునకు గురంభదుర్దినములు తొలఁగి దిక్కాంతాముఖంబులు తెల్వినొందినవి.

చ. సరసులు సద్విజాభిరతిఁ జక్కనికాంతి వహింపఁగా మనో
హరగతి మిత్రమండలము హర్షముమీఱఁ జరింపఁగా ద్విజే
[3]శ్వరరుచు లంతకంతకును నంతస మూనఁగ శారదాగమం
బరుగుగ మించె సత్కథము లద్భుతరంబుగఁ జూడ నొప్పఁగన్. 3

---

1. ఇది పదునెనిమిది పదములుగల నాంది. ఇందు శత్రునిగ్రహ మను ప్రధానకృత్యమూనఁ గలిగి సకలకల్యాణగుణధాముఁడగు రాముని వర్ణించుటచే సద్గుణాలంకారుఁడై శత్రువుల నిర్మూలించు నర్జునుఁడు సూచింపఁబడుచున్నాఁడు.

2. ఇది రంగస్థల ప్రసాధనమను ప్రస్తావాంగము.

8. ఋతువు నాశ్రయించుటచే నిది భారతీవృత్తి.

(దృష్టిమరలించి సభనుగలయం జూచి వినయమున(జేతులొగ్గి) రసికజనశేఖరులారా! నేను నాట్యవేదకళాపరిపూర్ణుఁడగు భరతాచార్యుని పుత్త్రుఁడను. నన్ను అభినవభరతోపాధ్యాయుఁడని పిలుతురు. మీరెల్ల నేఁడేదేనొక క్రొత్తనాటక మాడి నాపాండిత్యమును జూపుటకు సెలవిండు. (ఆకాశమునంతకుఁ జెవినిడి) పాండవాజ్ఞాతవాసమను తెనుఁగునాటక మీతరుణమునకుఁ దగియున్నది కాన దాని నభినయింపు మని సెలవిచ్చుచున్నారా? (మహానందముతో) ఔరా! నాయదృష్ట మెంత యుత్కృష్టమైనది! నేననుకొన్న యట్లే నవరససారజ్ఞులగు నీసభ్యు లానతిచ్చిరి.

తే. నాటకం బిద్ది నవరస ♦ పాటనంబు
[1]సభ్యులో సర్వవిద్యావి♦శారదు లిఁక
నాట్యమున సద్యశంబుగ♦న్నారు నాదు
పరిజనులు సుంతయేని లో♦పమెటు గలుగు. 4

(ఇంచుక యాలోచించి) ఇంకను మానటి రాకయున్నది? ఏలొకో. పిలిచి చూచెద. ఆలస్యము చేయుట లోపమే యగును. (కొంచెము నడచి) ఆర్యా రమ్ము రమ్ము.

నటి:—(ప్రవేశించి) ఆర్యపుత్త్రా ఇదిగో వచ్చితిని. కర్తవ్యమును జెప్పి నావలనఁ బనిగొనుఁడు.

సూత్ర:—ఆర్యా! నీశక్తిచే నీసభ్యుల నానందపయోరాశి మునుంగఁ జేసి నీపాండిత్యమును వెల్లడింపుము.

నటి:—(సంతోషముతో) నాట్యసామగ్రి చక్కఁగా సమకూర్పఁబడినది కాని యిపుడు ప్రదర్శింప నగునగు నాటక మేదిఁ?

సూత్ర:—ఈనాటకమును బ్రదర్శింపవలయును. (అని పత్త్రిక యిచ్చును).

నటి:—(పత్త్రికను గ్రహించి).

తే. రూపనామధేయంబుల ♦ నేపగిదిని
దెలియరాకుండ నింతితోఁ♦గలిసి వ్రతముఁ
జక్కనెఱవేర్చి వైరుల ♦ సమితిఁ జెండి
యలఘువారల కథ గాంచ♦నౌను నేఁడు. 5

(అనిపఠించి) ఆర్యపుత్త్రా! ఇందలికథ యొద్దియో తోఁచకయున్నది. చక్కఁగాఁ దెలియఁ జెప్పుఁడు

---

1 ప్రస్తుతవిషయప్రశంసచే సభ నభిముఖముగాఁ జేసికొనుటచే నిది ప్రరోచన.

సూత్ర:—బేలా! ఇందలికథయే తెలియకపోయినదా. పాండవు లరణ్యమునఁ బండ్రెండుసంవత్సరములు గడపి యజ్ఞాతవ్రతచర్య నొక్కవత్సరము విరాటు పురంబున నడపి కృతకృత్యులైరని కదా దానియర్థము. ఈపాటి గ్రహింప లేక పోతివికదా!

నటి—ఆహా! చక్కఁగాఁ దెలిపితిరి. కాని యీనాటకము నొనరించిన కవి యెవ్వఁడు?

సూత్ర:—ప్రేయసీ! చక్కఁగాఁ బ్రశ్నించితివి. వినుము.

సీ. ఆంధ్రభూసురకుల♦మం దుద్భవంబంది
యాదిని స్కాందంబు♦ నవల లలిత
సత్కథలను దెల్పుఁ♦జాలు నుపాఖ్యాన
మంత బ్రహ్మాండాహ్వ♦యమున నలరు
ఘనపురాణము నాది♦కావ్యమౌ రామాయ
ణము నాంధ్రభాష యం♦దర్చి వెలయు
జనమంచి శేషాద్రి♦శర్మ యీపాండవా
జ్ఞాతవాసం బను♦సరసనాట
తే. కమును రచియించె వావిళ్ల♦విమలవంశ
మౌక్తికమునాఁగ జగమున♦ మహిమఁ గీర్తిఁ
గాంచి సాధుమనీషుఁడై ♦ మించుచున్న
వేంకటేశ్వరశాస్త్రి య♦భిమతరీతి. 6

ఈనాటకమునభినయించి యీ సభ్యుల నానందరసాంబుధి నోలలాడింపవలయుఁ జుమీ.

నటి:—ఆర్యపుత్రా! విచిత్రపాదుకాపట్టాభిషేకము రచియించినది యితఁడే కాదా?

సూత్ర:—అవునౌను! ఏచమత్కృతి' నంతయుం జూపి యిఁక నీ సభాస్తారులఁ జిత్రప్రతిమలవలెఁ జేయవలయుఁ జుమీ.

నటి:—మీయనుగ్రహమున్న నదెంతటిపని! కాని యీనాటకకథ స్పష్టముగా నాకుం దెలియఁజెప్పి యనుగ్రహింపుఁడు.

సూత్ర:—ముద్దరాలా! మరల నానోటఁ జెప్పింప నిట్లడుగుచున్నట్లున్నది. విను

సీ. ప్రతిన చేసినరీతిఁ♦ బాండవు లజ్ఞాత
వాసము నెఱవేర్పఁ♦బయనమగుట
ధర్మదేవతవర♦దానసమాగత
తనువుల వేర్వేఱ♦ దాము గొనుట

విరటునిపురిఁ జేరి ♦ మరియాద దప్పని
యుద్యోగముల నీయ ♦ నొప్పుకొనుట
దుర్యోధనుఁడు వీరి ♦ ద్రోవ నారయఁ గోరి
విరటుగోవుల నొక్క ♦ విధిని గొనుట

తే. దక్షిణమునకు విజయుండు ♦ తప్ప నితరు
లుత్తరమునకుఁ బార్థుండు ♦ నొలిఁ జనుట
కౌరవుల నాజి నోడించి ♦ ప్రఖ్యాతియు
నాదిగాఁ గల కథలిందు ♦ సమరియుండు. 7

నటి:— చక్కని నాటక మిది కథయుఁ బాండవాజ్ఞాతవాసము రమ్యతరమై యలరారుచున్నది. ఇఁక నాలస్యమున కీసభ్యు లోర్వరని తోఁచుచున్నది. కావున నింకఁ జేయఁదగిన కార్యమునకుం బ్రయత్నించుట మంచిది.

సూత్ర:— ప్రియురాలా! సరసముగా జ్ఞాపకము చేసితివి? ఇదిగో సకలశ్రేయఃప్రాప్తికై గురుస్తుతిం జేసెద.

ఉ. ఆపదలొందకుండఁ దగి ♦ నట్టుపాయము లెన్నొ నేర్పుచుం
[1]దాపముఁ బాపునట్టి ఘన ♦ ధర్మము లాదృతిమీఱఁ దెల్పుచుం
బాపవినాశకంబులగు ♦ పద్ధతు లారసి బోధచేయుచుం
శ్రీపతిరీతి నొప్పు గురు ♦ శేఖర! మమ్ముటఁ బ్రీతిఁ బ్రోవుమా. 8

(నేపథ్యమున) ఇదిగో వచ్చుచున్నవాఁడ మీకు నిఖిలశ్రేయస్సు లొసఁగూడు ధర్మపద్ధతులను దెల్పెద భయపడకుఁడు. విచారము మనస్సులఁ జొప్పింపకుఁడు. సంశయింపకుఁడు. ధర్మదేవత మీపక్షమున నున్నది భవిష్యచ్ఛుభప్రాప్తికై కొన్ని యుపాయములఁ దెల్పెద.

సూత్ర:— ప్రియురాలా! నేఁ గావించిన గురుస్తుతిని దనదిగా నెంచి పాండవులగురు వగు ధౌమ్యుని వచ్చుచున్నాఁడని యూహింపవలసి యున్నది. (అని పురో[2]భాగమునఁ జూడ్కి సారించి (అదిగో ధౌమ్యమహర్షి పాండవులఁ జూచుట కత్యంతవేగమున వచ్చుచున్నాఁడు మన మింకఁ జేయఁదగినపనికై పోదమురమ్ము.

(అని నటీసూత్రధారులు నిష్క్రమించుచున్నారు)

(ఇది ప్రస్తావన)

---

1. ప్రవృత్తికాలగుణవర్ణనముచే నిది ప్రవృత్తకము. ఇదియే కథోద్ఘాతము.
2. "అదిగో" అని నిర్దేశించుటచే నిది ప్రయోగాతిశయము.

ప్రథమాంకము.

(గురువగు ధౌమ్యుండును పాండవులును ద్రౌపదియు నరణ్యభాగమునఁ బ్రవేశించుచున్నారు.)

ధౌమ్యు:—ధర్మనందనా! మనస్సున నించుకంతయు విచారము వలదు. నిరుపమ కరుణానిధి పరమపురుషుఁడు శ్రీకృష్ణుఁడు మీపాలఁ గలఁడు. ఎట్టి యిక్కట్టులును మీకు సంభవింపవు. నిర్వ్యాజమనస్సుతో నియమానుచర్య జరపుము. అవల దిగ్విజయము, రాజ్యప్రాప్తియు నగును.

ధర్మ:—(డగ్గుత్తికతో) మహాత్మా! తమ యాశీర్వచన ప్రభావంబున నెట్టులో పండ్రెండుసంవత్సరంబు లరణ్యంబున గడపితిమి. ఇఁక నొకసంవత్సర మెవ్వరెఱుంగకయుండ నొకచో నుండవలయు. ఇందుఁ బ్రమాద మించుకంతయుఁ బొందితిమా మరల నరణ్యంబునఁ బండ్రెండు సంవత్సరము లుండి యొకయేఁ డజ్ఞాతచర్యఁ గాలము గడుపవలయు ననియమము కదా. (ఆకసమ్ముం గాంచి కన్నీరు నించి) అయ్యో!

చ. నిరుపమతేజముల్ వెలయ ♦ నిర్జరులౌదురు వీరె యంచు న
వ్వరికిని దోఁపఁ జేయు రుచి ♦ భాసురదేహము లొప్పు సద్యశం
బరుదుగ దిక్కులం బొదల ♦ నాయత బాహుబలంబు పొంగఁగా
ధరణిని మించు సోదరులు ♦ దైన్యము నొందిరి నాకతంబునన్. 1

ధౌమ్యు:—మహారాజా! ఇట్లు విచారమున నీవే మునిఁగిన నీతమ్ముల ధీరత్వ మేమగునో తలంపుము. ఇదియంతయు విధివశమున జరిగినపని. దానికి వగచిన లాభమేమి? నేఁటితో నరణ్యవాసపరిమితి గడచును. రేపటినుండి మీ రితరుల కెఱుకపడక యుండ నుండవలయును. ధైర్యమూని యీకార్య మెట్లు కొనసాగునో చింతింపుము. కాలహరణము చేయరాదు. శత్రువులు చారులం బంపి మీ తెఱంగరయుచుందురు. రేపనునది యిప్పుడే యని యూహించి కార్య మెట్లు సరిపడునో యనువిషయమును నిశ్చయింపుము, మధ్యాహ్నము దాఁటినది. జాము ప్రొద్దున్నట్లున్నది.

ధర్మ:—గురువర్యా! నాకేమియుఁ దోఁపకున్నది. అజ్ఞాతచర్య యనుమాట మనోవీథి యందుఁ దోఁచిన నాదేహము కంపమొందుచుండును. రేపటినుండిది యనినంత నే కన్నులు కానరాకున్నవి. ఏమి నాగతి? ఎట్లుగాఁ గాలము గడపుదుమో, ఈ దుర్దినము లెట్లు గడచునో ఆపత్సముద్రమును దీని నెట్లు తరింపఁ గలమో నాకేమియు నూహింప శక్యముగాక యున్నది. ఏమి యుపదేశించినను, ఏదారి చూపినను మీరే గాని నాబుద్ధి నాస్వాధీనమున లేదు (అని దుఃఖించును.)

ధౌమ్య:—మహాత్మా! ధర్మరాజా! నీవే యిట్లన్న నేనేమనఁ గలను? దేవతలకైన నొక్కొక్క సమయమున నిక్కట్లు వాటిల్లు. దానిందాఁటి వారానందము నొందలేదా. వినుము వివరించెద.

సీ. నిషధాచలంబున ♦ నిర్జర నాథుండు
ప్రచ్ఛన్న రూపవ♦ర్తనము గనుట
యదితిగర్భంబున ♦ నంభోజనాభుఁ డా
యమరకార్యమునకై ♦ యడఁగి యుంట
ధేను దేహంబున ♦ దినకరుం డజ్ఞాత
వర్తనంబున నొక్క♦భంగి నుంట
ఋతుపర్ణు నింటిలో ♦ నతి దీనవృత్తిమై
నలమహీశుఁడు చర్య ♦ సలిపి యుంట
వినవు వినవె వీర♦లును దమకార్యముల్
దుదకు సిద్ధినొంద ♦ ముదము గనరొ
యట్లె నీవు గూడ ♦ నాపదలకు నోర్చి
కోర్కెనెల్లఁ దీర్చు♦కొనుము భూప. 2

ధర్మ:—మహానుభావా! మీయుపదేశ మమోఘము. అజ్ఞానమును పోఁగొట్టునది. దానం గొంత తెల్వి నొందితిం గాని యిట్లీసంవత్సరము గడపి కృతకృత్యుఁడ నగుదునా యను శంక బాధించుచున్నదే ఏమిగతి?

ధౌమ్య:—ధర్మనందనా. రాజసూయాధ్వరంబు సేయునప్పుడును, లక్కయింటి యాపద తప్పినప్పుడును సాయపడిన భగవంతుఁడు మీకెల్లవేళలఁ దోడునీడ గనుండ నీస్వల్పకార్యమును దీర్చుకొని కృతకృత్యు లగుట యొక యబ్బుర మా, నామాట వినుము.

చ. అనిశము దేవకీతనయుఁ ♦ డాపదమెల్లఁ బ్రీతిమీఱఁగాఁ
[1]గనుఁగొనుచుండ, ధర్మముని ♦ కామదయుర్వి నిమ్ముఁ గాచుచుండఁగా
జనవర! సత్యమిల్లపుడు ♦ సాయముగా నలరాయుచుండ నీ
పని యొకయద్భుతంబె యొక ♦ భంగము గల్గక సాగెదుం జుమీ. 3

ధర్మ:—(నిట్టూర్పు పుచ్చి) గురువర్యా? ఆకరుణాకరరాశి శ్రీకృష్ణుఁడు కంటిని రెప్పవలెఁ గాపాడకయే పోయిన మే మేలోకమున నుందుమో. తండ్రి లేని కొఱంత మాకు లేదు గా.

ధౌమ్యు:—ధర్మరాజా! చక్కని యభిప్రాయ మిది. ఆమహామహుని కరుణయే లేకున్న[2] మీకు వచ్చిన యాపత్కల్లోలమాలికలలో నెప్పుడో యడంగి యుండరా. అట్టి శ్రీకృష్ణుని కరుణకుం బాత్రులుగా నుండుటం బట్టియే మీ కీయాపద తొలఁగి నిష్కంటక రాజ్యము లభింపఁ గలదు.

ధర్మ:—మహాత్మా తమయమోఘాశీర్వచన ప్రభావము వలనను, శ్రీకృష్ణ భగవానుల కరుణవలనను దుర్భరాజ్ఞాత చర్యసుఖముగాఁ గడచి మంచికాలము వచ్చెఁగాక. (కొంచెమాలోచించి) సాయంకాలము వచ్చుచున్నది. రేపటినుండియే గదా. అజ్ఞాతచర్య ప్రారంభము కావలయు (గుండెలు గ్రుద్దుకొని) అబ్బా! పండ్రెండుసంవత్సరములు గడచినవికదా. 'అందఱొకయెత్తు అగస్త్యుఁ డొక్కఁడె' యన్నట్లు ఒక్క సంవత్సరమే యీ మనకు దుస్సహముగఁ దోఁచుచున్నదే. ఇంకేమి గతి?

ధౌమ్యు:—వత్సా! అట్లు దిగులొందినఁ గార్య మెట్లు జరపఁబడును. ధైర్యమూని భగవంతుని నమ్మి త్వరపడి కార్యారంభమున కుపాయ మాలోచింపుము.

ధర్మ:—చిత్తము (తమ్ములవంకఁ జూచి కన్నీరు విడుచుచు డగ్గుత్తికతో) నాప్రియ సోదరులారా!

చ. వనముల ద్వాదశాబ్దములు ♦ నైకులమాయలఁ జిక్కుకుండఁగా
వనజదళాక్షు సత్కరుణ ♦ వర్ధిలుటన్ గురువర్యు నాశిషం
బున జరపంగ నయ్యె నొక ♦ పోలిక రాఁగల వత్సరంబు నె
ట్లునయము కాంత్రిఁ గూర్చెడిని ♦ మాటలు వేయును బల్క నేటికిన్. 4

అర్జు:—అన్నగారూ! ఇంతకు ముందే కదా గురువర్యు లాశీర్వదించిరి.

---

1 ఇష్టదైవతాదిప్రసాదరూపమగు కథాబీజముపన్యసింపఁబడుటచే నిది యుపక్షేపము.

2 ప్రాగుక్తబీజ సమర్థనముచే నిది పరికరము.

ధర్మ:—నాయనా! సత్యమే కాని మనమేవురము పాంచాలిం గూడి యిచ్చటికిఁ బోయినను గుఱుతింపక పోరురా. కాననెట్లు గడపఁ జనుననియే నా యుమ్మలికము.

అర్జు:—మహారాజా! ఆనాఁడు ధర్మదేవత మీనియుక్తికి మెచ్చి వరములిచ్చెఁ గదా. అవ్వానిసహాయంబున సుకరంబుగా నీవత్సరంబును గడపఁ గలము. మనపగవారేమిచేయఁ గలరు! ఇచ్చటికి సమీపముననే పాంచాలచేది మత్స్య సాళ్వ విదేహ బాహ్లీక దశార్ణ సూరసేన కళింగాది దేశంబులు గలవు. అయ్యవి సకలసస్య సంపూర్ణంబులై, జనాకీర్ణంబులై, వాసయోగ్యంబులై యున్నయవియని వింటిముకదా. అందు మీకుం బోలిన జనపదంబున నుందము.

ధర్మ:—వత్సా! చక్కఁగా స్మృతికిం దెచ్చితివి ధర్మదేవతావర ప్రభావమున మనము కాలమును బుచ్చఁ గలము నాకుం జూడ మత్స్యదేశము మన కనుకూలమని తోఁచెడిని. ఆదేశాధిపతిని ధర్మమతియు, బాహుబలోదగ్రుఁడును బ్రజారంజన తత్పరుండునని విన్నాఁడను. కాఁబట్టి యట మనము నిలుచుట యుక్తమని నా తాత్పర్యము. కాని. నెవ్వరెవ్వరేయే విధంబున విరటుని చిత్తవృత్తి ననుసరించి యుండఁ గలరో ముందుఁ దెలిసికొనవలయుఁగదా ఆవిధము చెప్పుఁడు.

అర్జు:—(కొంచె మూరకుండి కన్నీరునించుచు) మహాత్మా! రాజచంద్రమా

ఉ. ధర్మపథంబున న్నిలిచి ♦ తత్త్వవిదుల్ వెఱగంది చూడఁగ న్నా
నిర్మలచిత్తుఁడే సుకృతి ♦ చేర్పుతి యంచు నుతింప వైరిరా
డ్భర్మకిరీటరత్నరుచి ♦ భాసురపాదనఖుండ వైన నీ
వర్మిలి మీఱ నవ్విరటు ♦ నాదృతి గాంచి చరింతు వెవ్విధిన్. 5

ధర్మ:—(తమ్ముని మనోదుఃఖము దలపోసి దాసందీర్ఘ నెంచి) వత్సా! ఏలయిట్టి విచారము మనస్సునఁ బాదుకొల్పెదవు నా వర్తించురీతి వినుము

మ. కొంకొక్కింతయు లేకయే చని ♦ క్షోణీపాలకుఁ గాంచి నేఁ
గంకనాముఁడ ధర్మనందను ♦ గారవంబునఁ బొందితిన్
బొంక మింకసి సమస్తవిద్యల ♦ భూరిపాండితిఁ గాంచితిన్
శంక యేమియుఁ గ సన్నుఁ గొల్చెద ♦ సాధువృత్తిని భక్తుఁడన్. 6

అనిపల్కి— విరాటుని మెప్పువడసెద. వినోదభాగోష్ఠి నారాజన్యుని సంతోషపరవశుం జేసెద. ద్యూతంబున నాతని వశపఱచుకొనియెద. ధర్మసందేహములు గలిగినతఱి వానిందీర్చి నాపాండితిం జూపెద. కనకరజత మణి నిర్మిత

ములగు నడ్డసాలులు నాయొద్దఁ గలవు. వానిఁ జూపి నాద్యూత చమత్కృతి నెఱపెద. వత్సా! అర్జునా! నావిషయమై సందియ మొందకుము. (అని భీముని వంకఁ జూచి కన్నీరునించు డగ్గుత్తికతో)

తే. మనల నాపదలం జిక్కి ♦ మ్రందకుండఁ
గాచినాఁడు భుజాబల ♦ కలితుఁ డెంగు
దైన్యముం బొందఁ డీ మరు ♦ త్తనయుఁ డెట్టు
లోకరివంచల మెలఁగునో ♦ కో యెఱుంగ. 7

భీము:—గంభీర స్వరముతో

మ త్త. ఏను వంటలవాఁడనై మను ♦ జేంద్రుఁ గొల్చెద నేర్పునన్
మానసంబున కింపుఁ బెంచెద ♦ మాడ్కి వంటలఁ జేసి నే
నానరేంద్రుని మెప్పుఁ బొందెద ♦ నప్పురంబున నేపనిం
గాని నన్నిగులంగ లేనటు ♦ గాఁ జెలంగెద భూవరా. 8

మఱియు మల్లయుద్ధంబున మల్లురనెల్లఁ జెండి గట్టిజెట్ట యనిపించుకొనియెద. ఇంతయేల వంటయందును, భుజాబలకృత్యంబులం దీతఁడె జగంబున మేటియని రాజునకుఁ దోఁచునట్లు ప్రవర్తించెద. విరటుని మన స్సువిధంబునఁ గరగునో యట్లే వర్తించెద. వలలుండను పేరు ధరించి యుందు. నీ వెవ్వరివాఁడవని యడిగిన నాలవజాతివాఁడనని చెప్పి మున్ను పాండవాగ్రజునకు బానసంబు సేయుచుం డుదు. విధివశంబున నామహనీయుఁడు రాజ్యభ్రష్టుఁడై యెటకో పోయిన నిటు వచ్చితి. నన్నుం బరీక్షింపుఁడని పలికి గౌరవంబునకు హానిలేకుండ నుండెద. మహీపాలకా! నావిషయమై యుమ్మలికంబు నొందవలదు.

ధర్మ—(విషాదముతో నర్జునునివంకఁ జూచి) అయ్యో!

ఉ. ముప్పదిమూఁడుకోట్లు సుర ♦ ముఖ్యులు తోడ్పడ నిర్జరేశ్వరుం
డుప్పరవీథి నిల్చి నిశి ♦ తోగ్రశరంబుల నొవ్వఁ జేయఁగా
డెప్పరమైన యయ్యగ్నిఁ గ ♦ డిందిమ గంటిమి మీఱి నింద్రు పెం
పొప్ప నడంచి ఖాండవము ♦ నుద్ధతి భస్మము చేసినట్టి నే
ర్పొప్పెడు నర్జునుం డెటుల ♦ నొందుఁ గొల్చెడు నోర్కు దైవమా.

అర్జు—(వినయముతోఁ జేతులొగ్గి) మహాప్రభూ!

చ. సురపురి నన్ను నూర్వశియుఁ ♦ జూచి వరింపఁగ నొప్పకున్న నా
తరుణి నపుంసకుండవయి ♦ దైన్యము నొందు మటంచుఁ దిట్టె నీ

ర్జరవిభుఁ డొక్కవత్సరమె ♦ శాపఫలంబును బొందు మంచు నా
దరమున శాపమోక్షమును ♦ దాని వచించెను గాన నేనికన్. 10

పేడిరూపంబును ధరించి బృహన్నల యను పేరుపెట్టుకొని యంతఃపురమునఁ గలకన్నియలకు నృత్తముగఱపుచు విరటున కానందమును గల్గించెద. నీ వెక్కడ మున్నుంటి వని యడిగిన ద్రౌపది కడనుండి యామె యాదృతికిం బాత్రభూతనై యుంటివని పల్కెద. కనుక ధర్మనందనా నావిషయంబున వగవఁ బని లేదు.

ధర్మ—(నకులునిం గాంచి కన్నీరునించి మాటతొట్రుపడుచుండ) హా విధీ!

చ. తనులత సౌకుమార్యము ను♦దాత్తతయున్ ముఖచంద్రు సోయగం
బును దమయంతనే యితఁడు ♦ పూర్ణశరీరముగల్గు మన్మథుం
డని తెలుపంగఁ బొల్చు ఘనుఁ ♦ డంచు నెఱుంగక యుండ నెట్టివ
ర్తనమున సంచరించునొ వి♦రాటుపురంబున నేమి పల్కుదున్. 11

నకు.—

క. నే నశ్వశిక్షకుఁడనై
భూనాథునిఁ గొల్తు గుఱ్ఱ♦ముల జాతులనే
ర్పూనినవాఁడనె గావున
నానరపతిచిత్తవృత్తి ♦ నరయఁగ నేర్తున్. 12

అశ్వంబులకు వలయు మందుల నెఱుఁగుదు. వాని నడిపించు పద్ధతియుం దాతి తెలిసినవాఁడఁ గదా. దామగ్రంథియను పేరం బ్రవర్తిల్లెద నెందుండి వచ్చితి వనిన ధర్మరాజునొద్ద నశ్వపాలకుఁడనై యుండినవాఁడనని చెప్పెద. విరటున కమితానందంబుఁ గల్గింపఁ జాలుదు. కావున మహాత్మా విషాదంబు విడచి సమాహితచిత్తుఁడవు కమ్ము.

ధర్మ—(సహదేవునిపైఁ జూడ్కి నిలిపి కన్నీరుఁ దుడుచుకొని రొలుంగురాల్పడ) అక్కటా!

తే. కుటిల మెఱుఁగ డహంకృతిఁ ♦ గూడఁ డార్య
సమ్మతుఁడు ధర్మపథమునఁ ♦ జనెడు ప్రోఢ
యల్పవయసున నలరారు♦నట్టి యితఁ
డొరుల నెవ్విధి గొలువంగ♦నోపు నొక్కొ! 13

సహ:—(చిఱునవ్వుతో)

క. ధేను వ్రాతమునకుఁ బతి
నై నరపతి మెప్పుఁ గాంతు ♦ నాలఁ బిదుకఁగా
వానిని గదుపుగఁ జేర్పం
గా నేరుతు బెదరు వాపఁ♦గాఁ గల నధిపా. 14

తే. ఎందు నుంటివో తెల్పుమా ♦ యీ వటన్న
నీదు కడనుంటఁ దెలిపెద♦మోదమలర
నాహ్వయంబు తంత్రీపాలుఁ ♦ డనుచుఁ బిల్వ
నగుచు వర్తింతు విరటుని♦యంతికమున. 15

ధర్మ:—(తనలో) సరే వీరి యుద్యమము బాగున్నది. ఈపద్ధతి సరిగా సాగునని యే
తోఁచుచున్నది. ధర్మదేవత మనపక్షమున నున్నది గదా. (అని పాంచాలిం
జక్కఁగాఁ గాంచి కన్నీరు నించి) అక్కటా!

౨ పాట.

ఉ. అన్నులమిన్న యిద్ది సుగుణాఢ్య మనోహరరూపశీలసం
పన్న యుదాత్తచిత్త యొక♦భంగిని గష్టము నోర్వలేదు తా
మన్ననఁ గాంచుచుండు నొక♦మాటు నదేపని గాని చేయలే
దన్నిట గౌరవంబు సెడ ♦ నన్యుల నెవ్విధిఁ గొల్వఁ జాలునో. 16

ద్రౌపది:—(వినయంబున ధర్మరాజు దిక్కు మొగంబై) మహానుభావా! సత్యనిరతా!

కం. సైరంధ్రీవేషంబున
భూరమణాంతఃపురంబు ♦ పొంతకు నరుగన్
నేరుతు నాతని దేవియు
గారవమునఁ బిల్వనంపఁ♦గాఁ జని యచటన్. 17

క. మాలిని యను పేరున భూ
పాలునిసతి యాత్మకిద్ది ♦ భవ్యమతియును
చ్ఛీలయు నని తోఁచెడు గతి
నోలిన్ వర్తించు దాన♦నో రిపుహరణా. 18

నీచకృత్యంబులకు నన్నుఁ బంపవలదని ముందే యొప్పించుకొనియెద. సురుచిర
గంధమును బూయుట, కస్తూరికాతిలకంబు దిద్దుట, పలుభంగుల వింతలు గులు
కునట్లు పుష్పహారంబుల సవరించుట, మణిహారంబులఁ జక్కఁగా నలంకరించుట
నాపనులని యామెకు ముందే తెల్పి, పాంచాలి కడనుంటి నని చెప్పి యామె

మెచ్చుకొనునట్లు వర్తించి సత్ప్రవర్తనము నన్నుం జూచియే నేర్చుకొనవలయు ననునూహం బుట్టించి యేవిషయములందుంగాని ప్రమాదంపడక ప్రవర్తించెద. మనకులవృత్తంబుల కేశాంతయు రాకుండునట్లు మెలంగెద. తలువలు నన్నుం గాంచి మాతృభావంబును బొందునట్లు సంచరించెద. ఏవిషయమునను బరాకు నొందుదునేమో యని యనుమానింపవలదు. సైరంధ్రీజాతివారందఱ వలెఁ ప్రవర్తింతురని నమ్ముఁడు

ధర్మ:—పాంచాలీ దైవంబు నీకుఁ దోడై యుండును. క్రొత్తచోటు గాన నీవత్సరంబు గడచునందాఁక నెన్నికష్టములైనఁ బొంది మానగౌరవంబు నిలుపుము.

ద్రౌప:—నానేర్చు విధంబున భగవంతుని శ్రీకృష్ణుని ధ్యానించి మెలంగుచుండెద. మీరు నన్నే మరక కాచుచుండవలయు.

ధర్మ:—మేమందఱ మేవిషయమునఁ గాని పక్షపాతము గనంబఱుపఁ గూడదు. మీ మేర్పరచుకొనంబోవు సంకేతము ప్రకారము నికులల మరయుచుండుము. (అని తమ్ములకు రహస్యముగ నేమో చెప్పును.)

భీమాదులు:—అన్నగారూ! తమయానతి మఱవక ప్రవర్తిల్లెదము. ఎట్టి యిక్కట్టు లందుఁగాని [1]రహస్యమును బయలు పఱుపము. అగ్రహమూని దేహము తెలి యక యేపనినైనను జేయము. సంకేతస్థలముల మీరానతిచ్చిన మాటలతో మనోభావములఁ దెలుపుచుండుము. ఈరీతి నెట్టులో పుచ్చితిమా యావల మనమనోరథము నెఱవేఱును. తమరేవిషయమునఁ గాని సంశయము మాపై నునుమకొనక నెమ్మదిఁ బ్రవర్తింపుఁడు. మాయోపినంతవట్టు మిమ్మనుసరించి సమయభంగము గాకయుండఁ బ్రవర్తించుచుందుము. అర్థాంతరోక్తులనే మీభావమును గనుఁగొనుచుందుము.

ధర్మ:—ప్రియసోదరులారా! మీరు నాయానతిని దాఁటుమురని నాకెప్పుడు ననుమానము గల్గదు. పెద్దవాఁడను గాన నేఁజెప్పవలసిన మాటలఁ జెప్పితి. గురుభక్తి పరాయణులరగు మీకు నేర్పవలసిన దేమియున్నది.

భీమాదులు:—[2]కువలయానందకరుండై సత్కారవర్తియై సుమనస్సముదయసంతృప్తి కరుండవై యలరారు రాజచంద్రుఁ నిన్ను సహజవాత్సల్యమున లక్షివీక్షింపఁ గోరుచున్నది.

ధర్మ:—[3]వత్సలారా! గురుస్థిరమైన యీసంవత్సర మెట్లో గడచినతర్వాత మనకష్టములు తొలఁగి సుఖసంపదలు చేకూరుఁ గాక.

---

1. బీజనివృత్తిచే నిది పరిన్యాసము అర్థసంప్రధారణముచే నిది యుక్తి.
2. బీజానుకూల గుణవర్ణనముచే నిది విలోభనము
3. సుఖాగమమును దెల్పుటచే నిది ప్రాప్తి.

భీమాదులు:—ఇఁక మనము చేయవలయుపనికిఁ గడంగుదము.

ధర్మ:—ఈరాత్రి యిందే గడపి తొలిజామున మేల్కొని కాల్యంబులం దీర్చి ధర్మదేవతాపరబలంబున నన్యవేషంబు లలవడుం గాన నొక్కరొక్కరొక్క తరుణంబున వేఱుమార్గంబులఁ జని విరటుని కొలువునం గుదురవలయు.

భీమ:—ఇది చక్కని యుపదేశము. ముందు ధర్మదేవతం బ్రార్థింపుఁడు. తదనుజ్ఞఁ బడసి కార్యమునకుఁ గడంగుదము.

ధర్మ:—(ఆచమనంబుచేసి తూర్పుమొగంబై) మహాత్మా తండ్రీ.

3 పాట.

చ. మునుపు సరోవరంబుకడ ♦ మూర్ఛఁ గనంబడనియు కంబరం
బునఁ దగు నీప్రసాదమును ♦ బొందియె నల్వురుఁ బ్రాణవంతులం
గనుఁగొనఁ జాలినాఁడ నిదె ♦ కాలము క్రమ్మఱ వచ్చె నప్పుడి
చ్చిన వరముం దలంచి దరిఁ ♦ జేర్పుము దీనజనావనాదరా. 19

(కొంచెమూరకుండి కన్నులువిప్పి) సోదరులారా! ధర్మదేవత నామనంబునం దోఁచి రేపు మీయిష్టంబులం దీర్చువాఁడ. కష్టములు తొలఁగునట్లు చేసెద. సుఖసంపదలు మిమ్ముఁ బొందఁ గలవని పల్కెను.

భీమ:—తరువాత, తరువాత?

ధర్మ:—[1]మాయెల్లరసుఖము మీయధీనమే యని మనవిచేసితి.

భీమ:—ధర్మదేవత యనుగ్రహము మనపైఁ గలదనుట స్పష్టమాయెను. ఇఁక భయమేమి?

ధర్మ:—[2]ధర్మదేవత యనుగ్రహమునఁ గృతకృత్యుల మగుదుమని సంతోషంబును, దుస్తరవ్రతారంభము రేపుపూనవలయునను దుఃఖమును మనస్సున నొకదాని మించి యొకటి తోఁచుచున్నవి.

భీమాదులు:—[3]ఈవిషయమును ధౌమ్యమునికిని దక్కుంగల విప్రప్రవరులకుఁ దెలిపి వారియనుజ్ఞఁ బొందుట యిప్పటిపని కదా. వారి యుపదేశములఁ గైకొనుట కూడ ముఖ్యము కదా.

---

1. దేవతాజ్ఞాంగీకారకథనముచే నిది సమాధానము.
2. సుఖదుఃఖహేతోక్తిచే నిది విధానము.
3. రహస్యమును బలుపురకుఁ దెలుపుటచే నిది యుద్భేదము.

ధర్మ:—[1]ఇదియిక్కాలి చక్కని పద్ధతి. అట్లు చేయవలసినదే. ధౌమ్యాదులం బిల్చి యీవిషయమును దెల్పి వారిదీవనలఁ బొందుఁడు.

భీమ:—మీచిత్తమునకు వచ్చినట్లు బదులు పల్కక చేయుచుందుము. అదియ మా యభివృద్ధికి హేతువు. మేము తెలుపుటకంటె మీరు వారితో ముచ్చటించిన మేలేకా.

ధర్మ:—[2]వత్సలారా! అట్లే చేసెదను. బ్రాహ్మణాశీర్వాదములఁ బొందుట పురోవృద్ధికి హేతువు గాన నప్పనికిం బూనెద. సాయంసమయ మగుచున్నది. ఇందీరాత్రి గడపుదము. విరటునగరంబు కొంతదూరముననే కలదని తెలియవచ్చెఁ గదా. ఈస్థలము వాసయోగ్యముగ నున్నది. శీతలజలము లిందుఁ బ్రవహించుచున్నవి. గ్రామము లిచెంత లేనందునఁ గొన్నిచిక్కులు మనకు రాఁజాలవు. మీరును గడు బడలియున్నవారు. పాంచాలి యందఱకంటె శ్రమ చెందినది. ఇంకను ముందు నడచుట కర్జంబు గాదు. నేనిప్పుడ మునీంద్రులకుం దెలిపి వారియుపదేశములం బొందఁబోయెదను.

(ఇదిముఖసంధి)

ఒకవిప్రుఁడు.—

శా. దుష్టాత్ముల్ కపటక్రియాభిరతులై • శోఢ్రోన కల్పించు నా
కష్టంబుల్ మదినోర్చి రింతదనుకం • గాలం బిదట్లే శ్రమా
క్లిష్టంబై తగుఁ జూడఁ జాల ననుచున్ • దీప్తుల్ తొలంగంగ న
స్పష్టాకారముఁ దాల్చి పొందె రవియుం • స్తక్షోణిభృత్పార్శ్వమున్. 20

భీమ:—అగ్రజా! ప్రతిక్షణము మీయాజ్ఞనే తలంచుచు నట్లే మెలంగెదము.

ధర్మ:—ధర్మదేవతం బ్రార్థించుచు నేమఱక మెలంగుచుండవలయు. నేను నింక నభిమతకార్యము నొనరింపఁ బోయెద.

(అని యందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము,

---

1. బీజమునకుఁ దగురీతిఁ బ్రోత్సహించుటచే నిది భేదము.

2. బీజానుకూలప్రకృతకార్యము నారంభించుటచే నిది కరణము.

బీజారంభసంబంధ రూపముఖ సంధి ముఖ్యాంగసహితంబుగఁ జెప్పఁబడినది,

ద్వితీయాంకము.

(వృద్ధబ్రాహ్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు)

వృద్ధ:—[1](తెరలో విచారముతో) చాలకాలమునుండి సంతోషముగఁ గాలము గడపుచుండిన నేను ముదుసలితనమున, పాండవుల కష్టములఁ జూచుటకే జీవించియున్నాను. అక్కటా! కాలమహిమము! సకలయాచకకల్పతరువులయి ధర్మతత్పరులై, నిర్మలమనీషులగు పాండుపుత్త్రులకే సకలకష్టములు సంభవించినవి.

గీ. ధర్మరక్షకు లెవరో యుదారచిత్తు
[2]లెవరో యుపకారతత్పరు లెవరో యట్టి
సాధుకౌంతేయులకుఁ జాల సమ్మదంబుఁ
జివరకుం గూర్పఁ గానెంచెఁడు విధి యొకోర । 1

(ప్రవేశించి చూడ్కి నిగుడించి) అవచ్చువాఁడు ధర్మనందనుకడ నుండు వర్ధమానుఁడని తోఁచుచున్నది.

వర్ధ:—(ప్రవేశించి) ఆర్యోత్తమా నమస్కారము.

వృద్ధ:—వర్ధమానా! వర్ధిల్లుము. వర్ధిల్లుము. ధర్మనందనుం డనుజన్ములతోడ నెటకో పోవుటకుం బయనమై యీయరణ్యమునకు వచ్చియున్నాఁడట. నిజమేనా?

వర్ధ:—నిశ్చయమే కాని సకలపరివారపరివృతుండై మెలఁగుచుండిన కౌంతేయాగ్రజుండు దుస్తరమగు నీవత్సర మజ్ఞాతచర్య నెట్లు గాలము గడపునో.

వృద్ధ:—[3] బుద్ధిమదగ్రగణ్యా! అట్లు సంశయింపఁ బనిలేదు. కౌంతేయులచరిత్ర మసమానము. సామాన్యదృష్టికిం గోచరించునది కాదు. వారికి దుష్కరమైన దేదియు నుండనే యుండదు. వారు లోకరక్షణార్థ మవతరించిన మహాపురుషులు.

---

1. సాయంకాలవర్ణనముచేఁ బ్రతిహతమగు కథాభాగమును మరలఁ జెప్పుటచే నిది బిందువు.

2. విధికిఁ గౌంతేయులయందలి ప్రీతిని సూచించుటచే నిది విలాసము.

3. దృష్టనష్టబీజానుసర్పణరూపమగుట నిది పరిసర్పము. లక్ష్యమగు యాత్రయు, నలక్ష్యమగు కథాబీజమును మరలఁ బ్రకటించుటచే నిటఁ బ్రతిముఖసంధి వర్ణిత మయ్యె.

భగవంతుఁడు వారికిం దోడునీడగ నుండును. వారి నెదిరింప వంచింప దేవదాన వులకైన శక్యముకాదన నింక మానవులమాట చెప్పనేల ?

వర్ధ:— స్వామీ మీరన్న మాట బాగున్నది. కాని కాఁగలకార్య మెట్లు పరిణమింపఁ గలదో యెవరెఱుఁగుదురు.

వృద్ధ:— అసంశయమే వలదు. వారి కనుకూలశుభము లభించును. భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు వారికిఁ దోడునీడవలె నున్నాఁడు కదా.

వర్ధ:— నిశ్చయమే. శ్రీకృష్ణసహాయము కలదనియే మనమూహింపవచ్చును.

వృద్ధ:— ఇపుడు కౌంతేయు లెచ్చటనున్నారు. నేనచటికిం బోవఁ దలఁచియున్నాఁడను.

వర్ధ:— ఈ ప్రాంత్యములనే మహారణ్యమధ్య మగరోవరముకడ మఱ్ఱిచెట్టు నీడన నిన్న యుండిరఁట. నేనును వారిని దర్శింపఁబోవవలయు. స్థలము తెలియదుగాన వెదకుచుఁ బోవఁజను. ఇంక నాకనుమతి నిండు.

వృద్ధ:— నేనుగూడ నింకొకత్రోవ వెదకుచుఁ బోయెద.

(ఇరువురు నిష్క్రమింతురు)

(ఇది చూళిక)

(తరువాత సోదరులతో గురువృద్ధులతో ధర్మరాజు ప్రవేశించుచున్నాఁడు.)

ధర్మ:— సోదరులారా! ఇంతదనుక మనమందఱ మొకచోటనుండి కష్టముల ననుభ[1]వించినను సుఖముగ నున్నట్లే కాలముగడపితిమి. ఇఁక నొక్కొక్కరే కాలముపుచ్చుట ప్రతిభంగము గాకుండ వర్తింపవలయు, ఇన్నిటికిఁ గారణము రాజ్యకాంక్షయే కదా. కాఁబట్టి నాకిన్నియుఁ దలంపునకు వచ్చుటచే రాజ్యకాంక్షయే తొలఁగుచున్నది.

౪ పాటు.

భీమాదులు:— కౌంతేయాగ్రజా! ఇట్లు మీరు నిరుత్సాహ మూనుట ధర్మంబుగాదు. పండ్రెండుసంవత్సరములు సకలకష్టములకు లోనై గడపితిమి. ఇఁకఁ బండ్రెండు నెలలు శ్రమించిన నవ్వల వైరిమారణరూపమగు విజయలక్ష్మిని బొందఁగలము. అదియే రాజకృత్యము, కావున మొదట మనమనుకొనిన మాటను దాఁటరాదు.

ధర్మ:— [2](కొంచెము యోజించి) నిశ్చయమే. మీకది యిష్టముగ నున్నది కాన నేనును దప్పక యట్లే ప్రవర్తింప సిద్ధముగా నున్నాను.

---

1 విషయములయం దిచ్ఛలేమిని దెల్పుటచే నిది విధూతము.

2 వివరేచ్ఛా నివృత్తిని వదలుటను దెల్పుట నిది శమము.

భీమా:—ప్రతిజ్ఞాచరణప్రమోదము మీకు స్వభావమే కాని క్రొత్తదికాదు.

ధౌమ్య:—[1]కష్టముల ననుభవించిన పిదప ముదుపలికెనమునకైనను రాజ్యలక్ష్మిని మీరు పొందియుండఁ జూచెదమని మాకెల్లర కోరిక.

ధర్మ:—[2](చిఱునవ్వు మోమునఁ దోఁప నందఱినిఁ జూచుచున్నాఁడు)

ధౌమ్య:—మీరు భగవదంశసంభూతులగుటయును. భగవంతుఁడగు శ్రీకృష్ణమూర్తి మీయెడఁ బ్రసన్నుఁడై యుండుటయును జయసూచకములు గదా. ఏకాంతము లేక కార్యము కొనసాగఁ గలదు

ధర్మ:—తమయాశీర్వచనమే సకలసంపత్సమృద్ధికి మూలము.

ధౌమ్య:—ఇఁకఁ దడవు సేయరాదు. వ్రతాచరణమునకుఁ గడంగవలయును. శత్రువులు మాయోపాయములు పన్నుదురు వేఁగులవారు తిరుగుచుందురేమో. నేఁటి నుండియే మీయజ్ఞాతచర్య ప్రారంభము కదా.

ధర్మ:—నిశ్చయము. నేఁటినుండియే పగవారు మమ్ము వెదకఁ బ్రయత్నింతురు.

ధౌమ్య:—లోకమున నెందఱికో విరోధులుగలరు గాని మీవిరోధులంత దుష్ప్రవర్తకులు గనఁబడరు. దైవమెప్పుడు వారి నడంపఁ దలంచి యున్నాఁడో.

ధర్మ:—మహాత్మా! వారి నననేల? మా గ్రహచారమే యీయిడుములకు మూలము.

గ పాటు.

ద్రౌపది:—ఈశాంతమే యిడుములకు మూలము. లేకున్న నాఁడు నన్నవమానించినప్పుడే కాలదండోద్దండ భీమగదాదండము చేతను, కిరీటి గాండీవనిర్ముక్త శాతశర ప్రతతులచేతను వారు పడకయుందురా.

ధర్మ:—[3](చిఱునవ్వుతో) సాధ్వీమణీ! నీయన్నమాట యసంగతమనఁ జాలను. కాని కాలము ననుసరించి ప్రవర్తింపవలయుఁ గదా. అది బలవత్తరము. దానికి సకలబ్రహ్మాండములు లోఁబడి యుండును మన మెంతవారము. నీకోరిక వైరిమారణనిబద్ధమైనది. అట్లగుటయు యుక్తమే. శత్రువులకు లోఁబడి యీసంవత్సర మెట్లో గడపినఁ దర్వాత నీవాంఛితము నెఱవేఱును. సంశయింపకుము. అప్పుడే చేయుటకన్న నాపని నీకనుకూలముగఁ జేయఁ బూనుటచే నీకనంతానందము గలుగఁగలదు. దానిని తృప్తిమీఱ ననుభవింతువుగాక. త్వరపడక యీదుష్కరవ్రతము నేర్పున నెఱవేర్పవలయు.

---

1 పరిహాసవచనరూపమగుట నిది నర్మము.

2 నర్మలబ్ధధృతిరూపమగుట నిది నర్మద్యుతి.

3 ప్రత్యక్షనిష్ఠురవచనరూపమగుట నిది వజ్రము. [ఉపన్యాసము.

4 అనురాగహేతూపాయములఁ గూడిన వాక్యరచన యగుట నిది యు

ద్రౌప:—[1]ఇట్టి శపథములు మీకు నైజగుణములగుటచేత నీ యజాతశత్రు వను నామధేయము జగద్విఖ్యాతమై నెగడినది. మీయనుగ్రహముచే నాకట్టి యపరిమితానందము మున్ను కలుగునుగాక. ఈదుస్తరవత్సర వ్రతము సులభముగఁ దీర్పఁగలము. ఏలన మీమనస్సున నిట్టి యుత్సాహము కలుగుటయే మనభవిష్యచ్ఛుభములకు హేతువని నమ్ముచున్నాను.

ధర్మ:—సాధ్వీమణీ ప్రతివిషయమున జ్ఞాపకముంచుకొనఁదగిన విషయముల నిన్ననే మందలించితిని. జాగ్రత్తగఁ బ్రవర్తిల్లుము.

ధౌమ్య:—రాజపుత్రా! ఇఁక మీరు చేయఁబూనుపనిని నెఱవేర్పవలయును. చుట్టుపట్ల నెందఱో మనుష్యులు కనఁబడుచున్నారు. వారెవ్వరో యను సందియము నాకుఁ గలదు. మనమందఱ మొకచో నుండరాదు. నేఁజెప్పఁదగినవాక్యముల వినుండు.

సీ. రాజుచిత్తము భీక♦రంబు వ్యాఘ్రిం బట్లు
గావున మెలఁకువ ♦ గనఁగ వలయు
నర్హస్థలంబున ♦ యుండుఁ గూర్చుండఁగాఁ
జను న్యాయమే యైన♦మనుజపతికి
సహితంబుగా నున్న♦నద్దానిఁ బల్కక
యుండనే నొద్దిగికూ♦ర్చుండవలయు
నుద్యోగులకు హిత♦మెప్పుడుఁగాఁ బలుకంగ
వలయు రాజోక్తుల ♦ వెలికిఁ దెలుప
తే. గాదు, సకలములందు ♦ నాణుల మాటలు
తెలిసి యున్న నపియుఁ ♦ దెలియనట్టు
లుండవలయు సింహ ♦ కొప్పని పల్కును
బలుకకుండవలయుఁ ♦ బార్థివేంద్ర. 2

(అని మఱియు నేవో కొన్నిమాటలు చెప్పును)

ధర్మరాజాదులు:—మహాత్మా మీయుపదేశమును జక్కఁగా గ్రహించితిమి. కృతమెఱిఁగితిమి తమయుపదేశానుసారము ప్రవర్తిల్లెదము. ఇఁక నొక సంవత్సరమునకు మిమ్ము దర్శించుభాగ్యము కలుగఁగలదు.

ధౌమ్య:—మీ కఖిలశుభములు గలుగునట్లు జపియించుచు నుండెద. మీరిఁకఁ ద్వరపడి పయనము సేయవలయును.

ధర్మ:—తమయానతి నాచరించెదము. ఇదిగో ధర్మదేవతను మరలఁ బ్రార్థించెదను. పరప్రభావమున మావాంఛకుఁ దగిన రూపము లొందుదుము. తమరెచ్చటనో యీసంవత్సరము గడుపవలయును.

---

1. అనురాగప్రదర్శక ప్రియవాక్యరూప మగుట నిది పుష్పము

ధౌమ్య:—ధర్మనందనా, తమరాకఁ గోరుచు నిరంతరము మీకు మేలుచేకూరుటకై భగవంతుం బ్రార్థించుచు, మీయగ్నిహోత్రముల నేమఱక కాచుచుండెదను.

విప్రులు.—రాజచంద్రమా! పండ్రెండుసంవత్సరములు మీతో నడవులలో మెలఁగుచుండిన మాకు నగరవాసమునకంటె వనవాసమే మేలని తోఁచెను. ఇఁక మీ సంగతి వదలి యొందో నగరమందే సంవత్సరముండుము. కాన మాకిది వనవాసముగనే తోఁపక మానదు.

ధర్మ.—మహాత్ములారా! తమయాశీర్వచన ప్రభావమున నీసంవత్సర మెట్లో గడపి వత్తుము. పిమ్మట మీపాదసేవ చేయుభాగ్యము మాకుఁ గలుగున ట్లాశీర్వదింపుఁడు.

విప్రులు:—రాజ్యలక్ష్మి కాటపట్టు కాఁదగిన మీ కీవినయము సహజాలంకారమే కాఁబట్టి,

తే. శత్రువులకుట్ర లెవియు మీసన్నిధికిని
జేరకుండెడుఁ గాత, సంశ్రితకులాబ్ధి
హితమహాత్తర ధర్మమే యెల్లవేళ
లందు మిముఁ గాచుఁ గావుత మాదరమున. ౧

ధర్మ:—తమయాశీర్వాదములే మాకు సహాయములు. ఏకొంతయు లేక యీయజ్ఞాత[1] వ్రతమును జరపి వత్తుము. మరల మిమ్ముదర్శించి సేవించుభాగ్యము మాకుఁ గలుగు ననియే నమ్మెదము.

విప్రులు:—నిస్సంశయముగ మీవ్రతము నిర్విఘ్నముగ సాగును. మీకు విజయలక్ష్మి ప్రాప్తించును.

ధర్మ:—(అందఱిని గలయఁజూచి) మహాత్ములారా! సూర్యోదయమైనది. ఇఁక మే మిందుండ రాదు. ఎచటికో వెళ్లెదము. రహస్యరక్షణము చేయవలయు. మిమ్ముం దఱి వేఁడుకొనియెదను. మీయనుమతి నొంది పయనము చేసెదము. ప్రచ్ఛన్నరూపమున మాకుశలముల నరయుదురుఁ గాక. (అని చెవిలో నేమో చెప్పును.)

ధౌమ్యాదులు.—మీకు సకలశుభములు గలుగుఁగాక. మేమిదె పనివినియెదము.

(అనియందఱు నిష్క్రమింతురు.)

2 (ఇది ప్రతిముఖసంధి)

ఇది ద్వితీయాంకము.

---

1 అజ్ఞాతవాసానుగుణ ప్రయత్నము నచిఁ చుటచె నిది ప్రయత్నము. [సరి.

2 ప్రయత్నబిందుసంబంధముచే సముఖ్యాంగముగాఁ బ్రతిముఖసంధి చెప్పఁబడి

తృతీయాంకము.

[1](పిదప మాఱువేషములధరించిన ప్రభాకర విభాకరులను నిద్దఱు బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు.)

ప్రభా.—ఓరా! చూచితివా విభాకరా! దైవచేష్టితము లెంతబలవత్తరములు. సకల సామంతరాజ పరివృతుఁడగు ధర్మనందనుం డిపుడు వేషాంతరమూని యెందో యున్నాఁడఁట. మనమామహనీయ మూర్తిని గనుంగొని సంభాషించు టెట్లుఁ వారెట్టి కష్టములఁ బొందుచున్నారో.

విభా.—2 భగవదనుగ్రహము వారికి ధైర్యకవచమై యుండఁగా నేవిషయమున లోపముండును.

ప్రభా.—మిత్రమా! నీవన్నమాట నిశ్చయమే. కాని శత్రువులవేఁగులవా రందఱు వెదకుచున్న జాడ లగపడుచున్నవి. ఆవిషయమున నించుక యనుమానము నాకుఁ గలుగుచున్నది.

విభా.—సంశయింపఁ బనిలేదు. కంటికి ఱెప్పచందమున శ్రీకృష్ణమూర్తి వారికిఁ బ్రాపైయుండ దుర్యోధను దుర్మంత్రము వారి నేమిచేయఁ గలదు!

ప్రభా.—నీవచనభంగి మిక్కిలి యుక్తియుక్తముగ నున్నదనుటకు సంశయమే లేదు. అయినను భవిష్యత్ఫలము లిట్టివని మనము నిశ్చయింపఁ గాని యూహింపఁ గాని చాలము.

విభా.—నాకీవిషయమున నిసుమంతయు సందియము తోఁపకున్నది. మనము పాండవ పక్షపాతులమని యెవ్వరెఱుంగఁ జాలరు. ఈవేషములు మనగుట్టును బయలు పఱచునవి కావు. వలసిన తావులఁ దిరుగవచ్చును. విషయములఁ గనుఁగొన వచ్చును. ధర్మనందనుఁ డాజ్ఞాపించినట్లు శత్రుదుస్తంత్రములఁ బరీక్షింప వచ్చును.

---

1 పూర్వాంకమందు నిర్దేశింపఁ బడిన పాత్రముల కిందుఁ బ్రవేశము కల్గించుటచే నిది యంకాస్యము.

2 దైవానుగ్రహరూపబీజమున్నువరల సాక్షించుటచే గర్భసంధి యారంభింపఁ బడియె.

ప్రభా.—[1]వయస్యా! అసమానబుద్ధిప్రభావమున బృహస్పతిని మించితివి. నీవచన భంగి నాకే యెంతో యద్భుతమును గల్గించుచున్నదే. మనమిప్పుడు చేయఁదగిన దేది? శత్రుదూతల పన్నగములఁ బరీక్షించుటయే కదా.

విభా:—అంతమాత్రమే కాదు. హస్తినాపురంబున కరిగి యచటి ప్రయత్నములఁ గూడఁ గనుఁగొని ధౌమ్యమునీశ్వరులకు విన్నవింతము.

ప్రభా.—[2]నిశ్చయముగా దుర్యోధనుఁ డిప్పుడు కౌంతేయుల జాడలరయ ప్రయత్నములను జేయుచుండును గదా.

విభా.—[3]అందులకు సంశయమా, అదురాత్ముఁడు కొంతకాలమునకు ముందే అయా దేశములలోని నీతిగతుల నారయుచుండఁ గొందఱ నియోగించియే యున్నాఁ డని మనము వినియుంటిమి. కొత్తవారి జాడలు కనిపెట్టుట దానసుకరము కదా. కాఁబట్టి యెన్నియో ప్రయత్నములు జరపఁబడుచుండును. జరపఁబడియే యుండును. జరపఁ బడఁగలవు.

ప్రభా—ఇన్ని ప్రయత్నములలో నేదైన నొకటి ఫలించినా కౌంతేయుల గతి యేమగునో.

విభా—ఫలించినచో నేమైన నగును. ఫలించుట గగనకుసుమము కదా.

ప్రభా.—ఫలింపదనియే నా నమ్మకము.

విభా.—సత్యముగా నాకట్టి నమ్మకము గలదు. దైవబలసంపన్నులగు మాన్యులకు వైరిదుస్తంత్రములు ఫలము నీయఁజాలవు.

ప్రభా.—[4]సంతోషము సంతోషము. మిత్రమా! నీవాక్యము ఫలించుఁగాక. ఎట్టి సంతోషము నీఁజాలు వచనము విననోచితిని నాసంశయములు తొలఁగినవి. మన మిపు డేమిచేయు టవశ్యము?

విభా.—త్వరగాఁ బయనమై హస్తినాపురిఁ జేరి యచ్చట వారు చేసియున్నట్టియుఁ, జేయుచున్నట్టియుఁ, జేయఁబోవఁ బూనినట్టియుఁ బ్రయత్నముల నరయుట మనకుఁ గర్తవ్యము. కాఁబట్టి త్వరగా వెళ్లుదము రా.

(అని నిష్క్రమింతురు)

---

1. ప్రకృతోపయోగియగు కార్యాచరణముచె నిది యభూతాహరణము.
2. వితర్కవద్వాక్యమగుట నిది రూపము.
3. తత్త్వార్థకీర్తనమగుట నిది మార్గము.
4. ఉత్కర్షవాక్యరూపమగుట నిది యుదాహరణము.

(పిదప హస్తినాపురమునఁ గొలువుకూటమున యథోద్దిష్టముగా సపరివారుఁడై దుర్యోధనుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

౬ పాట.

దుర్యో.—(శకుని దుశ్శాసనకర్ణులం జూచి) మనమీనడుమ దేశాంతరములకుఁ బంపి యున్న వేఁగులవాండ్రు వచ్చినారా. మీరావిషయమై యేమి పరిశ్రమము సలిపితిరి?

శకుని.—రాజా! ఎన్నియో విధములఁ బ్రయత్నములు సల్పితిని. వేఁగులవారి కెన్నెన్నియో యుక్తులను దెల్పి పంపితిని. వారిజాడ లింకను గానరాలేదు. ఇంకఁ గ్రొత్తగాఁ జేయఁదగిన ప్రయత్న మేదియు నాకుఁ దోఁపలేదు.

కర్ణుఁడు.—చేసినప్రయత్నము లేరీతి ఫలించునో ముందు తెలిసికొని యవ్వల నేమి ప్రయత్నము చేయఁదగునో పరికింతము.

దుశ్శాసనుఁడు.—వ్యవధిచాలినంత యిఁక ముందున్నట్లులేదు. కావున నతిత్వరితముగఁ జేయఁబూనిన ప్రయత్నములఁ జేయుదము. అమీఁద దైవము పంచినట్లయ్యెడు.

శకుని:—పాండవులు ప్రాణములతో నుందురా యని సంశయించుచున్నాఁడను. ఈపాటి వారియెమ్ముకలు గూడ నరిగిపోయి యుండునేమో. ఎందుండినను బరికించి తేఁగల చారులు పోయియున్నారు 'రేపో మాపో రావచ్చును. వారు వచ్చిన పిదపఁ జేయఁగల పనిని జేయుదము.

(ద్వారపాలకుఁడు ప్రవేశించుచున్నాఁడు).

ద్వార:—జయము జయము మహాప్రభువు వారికి.

దుశ్శాస:—ఏమివార్తలు.

ద్వార:—వేఁగులవారందఱు సుమతి పురస్సరులై ద్వారమునఁ గాచియున్నారు. ఏమిసెలవు?

దుశ్శా:—(రాజానుమతినొంది) త్వరగా వారిని బంపుము.

ద్వార:—చిత్తము (అనినిష్క్రమించును).

(సుమతిమొదలగు వేఁగులవారు ప్రవేశింతురు).

వేఁగులు:—జయము జయము మహారాజుగారికి.

దుర్యో:—(త్వరతో) మీరరిగినపని యేమైనది? పండించుకొని వచ్చితిరా.

సుమతి:—(వేఁగులవారి యనుమతినొంది) మహాత్మా! ఆనాఁడు తిమయానతి తలఁ దాల్చి విచ్చలవిడి మాయావేషములం దాల్చి సంకేతపురీతి నందందుఁ బోతిమి. మహీధరములు, కాననములు, నదులు, భూవివరములు, గుల్మములు, బావులు, చెఱువులు, గరుసులు ఇంక నవియివియని చెప్పనేల గొప్పచెట్లతొఱ్ఱలు గూడఁ

బరిశీలించితిమి ప్రతియింగళీవారము సంకేతస్థలమునం గూడ మంటిమి. ఎందుం గాని వారిమాటలుగాని వారిజాడలుగాని కానరావు. పల్లియలలోం గూడ వారినిం జెప్పుకొనువారు కానరారు

దుర్యో:—ఇపుడు నీ తాత్పర్య మేమి?

సుమతి:—నామిత్రుల తాత్పర్యము మాత్రము పాండవు లీలోకము నవదలిరనియే.

దుర్యో:—నీ తాత్పర్యమో.

సుమతి:—మహాప్రభూ ! రాష్ట్రములెల్లం గ్రుమ్మరితిమి కాని మత్స్య, సాల్వ, విదేహ, బాహ్లీక, దశార్ణ, శూరసేన, కళింగ, మగధ, దేశంబులు మాత్రము పరిశీలింప మైతిమి. రోగబాధలం గనక సకలసస్యసమృద్ధి నొంది యీదేశము లనవరతసంతోషాంబుధి నోలలాడు ప్రజలచే నిండియుండునవి యని విన్నవాండ. కాంబట్టి యీదేశముల వెదకిన దొరకకుండురా యని నమ్మియున్నవాండ. ఒకటి రెండు నెలలు గడువొసంగి మతికొందఱం దోడిచ్చినం గార్యము పండించుకొని రాంజాలుదు. ఆపై దేవర చిత్తము

దుర్యో:—మతికొందఱ ననంగా నెవ్వరెవ్వరిని దోడీవలయు ?

సుమతి:—కపటనాటకసూత్రధారుండని వన్నెకెంగియే యుందురు. ఐనను దేశాంతరములం బోయి చోరకానితావులం జొచ్చునేర్పు నాకుం జాలినంత లేదు. కాంబట్టి మనయులంబసుని కుమారుండు వజ్రరోముండు వానిపరిజనులు నాకు బాసటయై యున్నచో నాశక్తిం జూపి దేవర మెప్పు వడయుదును.

దుర్యో:—దుశ్శాసనా త్వరగా వజ్రరోముని బిలపించి సుమతిని పంపుము. సుమతీ ! ఎంతవేగముగా ఈశుభవార్త మాకు విన్నవింతువో చూచెదం గాక.

సుమతి:—చిత్తము చిత్తము రాజేంద్రా ! నాకడిమి మెఱసి ముజ్జగంబుల గడగడ వడంకింపం జాలుదు. ఇపుడేల నాపంతములు, వెనుక యేలినవారే చూచి యానందింపం గలరు

శకుని:—రాజచూడామణీ ! మనము రహస్యమంటపమున నిశ్చయింపవలసిన విషయములు పెక్కులున్నవి. ఇప్పుడే వానిని నెఱవేర్పవలయు. కావున మన మచ్చటికిం బోవలయు.

(అందఱు నిష్క్రమింతురు.)

(విరాటమహీపతి సకలపరివారముతోం గొలువుకూటము ప్రవేశించుచున్నాండు.)

విరా:—ఉత్తరకుమారా ! కొలందిదినముల క్రిందట బృహన్నలయను పేడి మనయొద్దం గొలువునకు వచ్చెంగదా. నర్తనశాలయం దతనికి నుద్యోగ మిప్పించితిమి.

కుమారీమణికిఁ జక్కఁగాఁ బాఠము జరగుచున్నదా. ఎప్పుడైన నీవచటికిఁ బోవుచుందువా.

ఉత్త:—చిత్రము తండ్రిగారూ! పెక్కుపర్యాయములు అక్కడకుం బోయియుంటిని. చక్కఁగాఁ బాఠములు జరగుచున్నవి. బృహన్నలయక్కఱతోఁ జదివించుచు నాటియందు మిగుల చమత్కృతి గల్గునట్లు నేర్పుచున్నాఁడు.

విరా:—వత్సా! ఆనాఁడు తొలుదొలుత నేనాతని జూచినప్పుడే యెవ్వాఁడో మహాపురుషుఁడుగా నుండనోపునని నాకు స్ఫురించినది. చూడ రెండుకన్నులుం జాలకపోయినవి. ఆభుజముల విశాలత్వము. ఆవక్షస్స్థల ఔన్నత్యము, ఆ నేత్రముల సొంపు, ఆమోము కాంతి. ఆమాటల పరిపాటి యివియన్నియు మహాపురుషలక్షణము లాతనికలవడి పరాక్రమము పోతపోసిన ట్లాతఁడు కనఁబడియె. ఇన్నియుండియు నొక్క పేడిరూప మాతని కింతగొఱంత గల్గించినది కదా. విధిచేష్టితమని తలంచితిని.

ఉత్త:—జనకా, మీరూహించిన ట్లాతఁడు మహావీరుఁడే అలోకసామాన్య సుగుణశాలి, ధనుష్టంకారమున కలవాటుపడిన చేతులాయని సంశయింపఁ దగిన గుఱుతు లాయనకున్నవి. శాపమున దేవేంద్రుఁడే యిట్లవతరించెనా యని తోఁచెడి.

కంకుభట్టు:—(చిఱునవ్వు నవ్వును).

విరా:—కంకుభట్టూ! మీరేల నవ్వితిరి మీకా బృహన్నలవిషయమేమేని దెలియునా.

కంకు:—మహీపాలకా! ధర్మజుని కొలువుకూటంబున నున్నవాఁడంగాన నిట్టివారిం జూచియున్నవాఁడ. అతని నింత పొగడనేల? నపుంసకు లందఱు నిట్లేయుందురు. మగవాఁడుగ నున్న బాగుండునే యని తోఁపింపఁ జేయుదురు. ఇట్లనుటచే మన బృహన్నల సామాన్యుఁడని నాభావము గాదు. అతనిపాండిత్య మపారమని యానాఁడే నాకుం దోఁచినది. దేవేంద్రుఁడే యిట్లవతరించెనో యని యువరాజన నవ్వితిని. దేవేంద్రుఁడైననేమి పూర్వదుష్కృతిఫల మనుభవింపక తప్పగు గదా.

విరా:—కంకుభట్టూ, నీవన్నమాట నిశ్చయమే కాని బృహన్నలను జూచినపుడీతఁడు దేవాంశసంభూతుఁడుగా నోపుననియే తోఁచినది.

కంకు:—మీయూహ నిశ్చయమనియే నాకును దోఁచుచున్నది కాని యదృష్టహీనుఁడని యతనిం జెప్పవలసి వచ్చినది దేవేంద్రుసింహాసనంబున నుండఁ దగినవాఁడే కాని పేడితనమాయదృష్టమును బోఁగొట్టినవి. ఏమిపాప మొనర్చెనో భగవంతుఁడే యెఱుంగు.

విర:—[1]సంయమీంద్రా! సంతోషము నీవన్నమాట నిశ్చయము. మెచ్చితిని. ఎవరట్టి పాప మొనర్చి రీఫలము ననుభవింతురో ఎవ రెఱుఁగుదురు? మహాత్ములగు మీవంటి సాధువు లెఱుఁగఁగలరు. తమకు బహుమాన మేమే నీయవచ్చును. నిస్పృహులు. ఇవె నావందనములను గానుకగా సమర్పించితిని.

కంకు:—(ఆశీర్వదించి) రాజశేఖరా! సాధుచిత్తముగల మీకిది సహజము. మీవంటి రసజ్ఞులు ప్రభువులందఱైన భూదేవత యెట్లలరారునో.

విరా:—మునీంద్రా! మనవలలుఁడు గూడ బలశాలియే సుమా.

కంకు:—సంశయమేమి? బలశాలియే కాని యుక్తాయుక్తపరిజ్ఞానము తక్కువయని తోఁచెడు. మొన్న మల్లునితోఁ బోరాడునపుడును, సింహమును బట్టి చంపినపుడును అతని మోటుతనము మనకుఁ దెలియలేదా. తన్నుఁ జూచి యితరు లేమనుకొందురో యను జంకాతనికి లేనేలేదు. పౌరుషము నెఱపుటయే యాతనికిం బ్రధానము.

విరా:—కంకుభట్టూ! ఏమైన నేమి. అతని మెచ్చుకొనుచుందును. బలవిషయమున నసమానుఁ డగుట స్పష్టమేకదా. వంటచేయుటయందో ఎంతచమత్కారము గలవాఁడు! ఏమిబహుమాన మిచ్చినను వలదనుచుండును. కారణ మేమో.

కంకు:—తిండిపోతుల కాభరణములేలఁ? కడుపునిండ తిండి దొరకినది. హాయిగ నిద్రపోవ స్థలము దొరకినది. దిగులా, విచారమా.

విరా:—ఇదేమి కంకుభట్టూ! ఇట్లనుచున్నావు. అతని వంటకము రుచింపలేదా ఏమి?

కంకు:—ఆవిషయమునఁ గాదు. నాగరకత తక్కువయని యంటినే గాని యింకొకదోష మాతనియం దారోపింపఁ బూనలేదు.

విరా:—అశ్వగోరక్షకులు గూడ మిగుల నేర్పరులు. వారు వచ్చినప్పటినుండి తురగములు సూర్యాశ్వరీతిఁ బ్రకాశించుచున్నవి. గోవులు కామధేనువులఁ దిరస్కరించుచున్నవి. ఈసంవత్సరమున మీవంటి మహనీయులు వచ్చుటచేఁ గాఁబోలు సకలవిధముల నారాజ్యము ప్రాజ్యమై సకలసస్యసంభరితమై, ఆధివ్యాధులు లేక యలరారుచున్నది.

కంకు:—సర్వథా సర్వదా యిట్లే యుండుఁగాక.

చ. అనిశము సర్వసస్యము హర్షము నొందుచు భూమి యొప్పఁగా
జనులు స్వకృత్యముల్ నెఱపి సంతస మందుచునుండఁ గామినీ
జనములు భర్తృసేవల నొసల్పుచు హాయిగ నుండ రాజ్యమో
జనవర యేలవయ్య సుఖసంపద లుట్టిపడంగ నెప్పుడున్. 1

---

1 శమదాన్తుఁ డగుట నిది సంగ్రహము.

మంత్రులు:—మేలు మేలు. యతిప్రవరుల వాక్యము లమోఘములు. ఫలించియే తీఱును.

విరా:—శంకుభట్టూ. ద్యూతము నింద్యమందురు. కారణ మేమో.

కంకు:—ద్యూతమునఁ గుశలత్వమును గాంచిన వారందఱో సకలకష్టముల ననుభవించిరి. నలుఁడు మొదలగువారు రాజ్యముం గోలుపోయి పడరాని యిడుమలం బడిరి. దానినుండి రానున్న కష్టములకు మితియే లేదు. సర్వానర్థములకు మూలము.

విరా:—[1]నిశ్చయమే. ధర్మనందనుఁడు స్వారాజ్యసామ్రాజ్యమును గోలుపోయి యడవులపాలైనది ద్యూతముననే. ఆవిషయము స్మృతికి వచ్చినా గుండియలు తల్లడిల్లుచున్నవి. వారు మాకుం బరమబంధువులు. వారిశత్రువులను దలంచిన నాకెంతో చింతజనించుచున్నది. ఇంకెన్నిపాట్లు వారికిం గల్పింతురో.

కంకు:—గతజలసేతుబంధ మావార్త. ఇప్పుడు వారిం దలంచి లాభమేమి?

విరా:—ఐనను శంకుభట్టూ వారెందుందురో. వారిజాడ లరసి తెల్పువారెవ్వరైన నుండిన నెంతయో ద్రవ్య మొసంగెద.

కంకు:—విధివశమునఁ జిక్కి వారెందో యజ్ఞాతచర్య మీవంటి ప్రభుశిరోమణుల పంచల నుందురు. సమయము వచ్చిన బయలుపడక మానరు. అవిచారము తమ కిప్పుడేల? మనము ద్యూతమున నించుక కాలక్షేపము సేయుదము.

విరా:—ఇపుడు పాండవస్మృతిచే నామనస్సు చింతాకులమై యున్నది. ఏమియుఁ దోఁచకున్నది మఱియొక సమయమునఁ బాచిక లాడుదము.

కంకు:—ప్రభువరేణ్యా తమకుఁగల బంధుప్రేమ తేటపడియె. మీమనస్సు నవనీతము వంటిది. కష్టములను సహింపఁజాలదు మీయిష్టానుసారము మఱొక్క సమయమునద్యూతమునఁ గాలక్షేపము సేయుదము.

మంత్రులు:—ప్రభుశిరోమణులతో మనవి చేయఁదగిన కార్యములెన్నియో గలవు. రహస్యమండపమున దర్శనమిప్పింపఁ బ్రార్థించువారము.

విరా:—అట్లే యగుఁ గాక. ఇప్పుడే పోవుదము.

మంత్రులు:—చిత్తము.

(అందఱు నిష్క్రమింతురు).

(పాకశాలలో సైరంధ్రి యొంటిగాఁ బ్రవేశించుచున్నది.)

సైరంధ్రి:—(తనలో) హా విధీ! ఎంత దయమాలితివి, నాకీయిడుమలా రావలయు, సకలభూపాలమౌళిమణిగణఖచితవిస్ఫురత్కిరీటాంకిత పాదారవిందుఁడు,

---

1 శత్రుకృతభీతిరూపమగుట నిది యుద్వేగము.

దుర్వారవైరిగర్వాపహారకుండగు ధర్మనందనుఁ డిట్టిగతిఁ బొందఁజేసితివి గదా. చండగదాదండమండితదోర్దండభీషణుండగు భీముఁ డిట్టివంతలఁ గుందఁజేసితివా, ఇంద్రు నర్ధాసనము నధిష్ఠించి నివాతకవచకాలకేయులం బటురణాంగణంబున నుక్కడించి శివుని మెప్పించి పాశుపతము గైకొని యలరారు నర్జునుని నక్కటా యీగతిఁ బట్టఁ జేసితివి కదా. కందర్పసుందరాకారులు, సుఖ మనుభవింపనే జనించిన నకులసహదేవులను బసులగాపరులనుగాఁ జేసితివి కాదే. ఇంకను నీకు మాపైఁ గరుణ లేదా. ముందేమి వంతలఁ గుడియింప నున్న వాఁడవో యూహింపశక్యము గాకున్నది. కాని నీవెన్ని యిడుములఁ గుడువఁ బంచినను సిద్ధముగ నున్నవారము కిరాతునకైన మాచింతలఁ దలంచిన గుండె కరుణార్ద్రము కాకమానునా. దైవమా! నీకింకను గరుణరాలేదా. (స్మృతి నభినయించి) ఏమిది? భర్తలను గూర్చి యిట్లు విచారించుచున్నాను. నాగతి యేమని విచారింపవలసి యున్నది. అంతఃపురమున నింతదనుక నిశ్చింతముగ నుంటి, నన్నెవరు గాని పల్లెత్తుమాట యన్నవారు కారు. సుధేష్ణయు సగౌరవముగాఁ జూచుచుండును [1]చెప్పఁదగని పనులేవియుఁ జెప్పదు. నన్నుఁ దన కన్నకూఁతువలెఁ గాపాడుచుండును. ఎవరెంత సన్మానించుచున్నను నాచిత్తము చింతలఁ జివికిపోవుచున్నది నాస్థితి యిట్లాయెఁ గదా యని యొక్కమాటు స్మృతికిఁ దోఁచెనా కన్నీరు మున్నీరుగాఁ గాఱుచుండును. అట్టిసమయమున నెవరేనిఁ జూచిరా గుట్టు బయల్పడును గదా. ఇట్లుండ గోరుచుట్టుపై రోఁకలిపోటన్నట్లు దుర్వారదుఃఖ మొకటి సంప్రాప్తము కానున్నది. కీచకుఁడు సుధేష్ణ యంతఃపురమునకు వచ్చినప్పుడెల్ల నన్నే చూచుచుండును. సేవకులకు నన్నుం జూపి యడుగుచున్నట్లు తోఁచుచున్నది. ఇఁక నాగతి యేమి? ఈవిషయమును భీమునకుఁ జెప్పక తప్పదు చెప్పితినా యూరకుఁ డాగ్రహవ్యగ్రుఁడు కాకపోఁడు. వానిం గాలుని వీటికిఁ బంపక మానఁడు. ఈ విషయమున సమయభంగ మగునేమో. ధర్మరాజు తొలుదొల్తనే నీశీలమును గాపాడుకొనుము నీవింక మాకేకష్టములుం గాకుండఁ జేయుమని హెచ్చరించెఁ గదా యిప్పుడెట్లు మెలఁగవలయునో? ఎట్లు మర్యాదను గాపాడుకొనవలయు. ఊరకుండుటెట్లు? భర్తలకుం జెప్పుటెట్లు. ముందు గోయి వెనుక నూయి యన్నట్లున్నదే. ఏమైనఁ గాని, భీమునకుం దెల్పి యాతని యభిమతమురీతి మెలఁగెద. అర్జునునితో నిపుడు చెప్పినను లాభమున్నట్లు నాకుం దోఁపకున్నది. (ఆగ్రహముతో) [2]ఈక్షణముపోయి భీమునకుం జెప్పెద. నామనస్సు

1. హేతువలన విషయము నూహించుట నిది యనుమానము.
2. రోషసంభ్రమవచనమగుట నిది తోటకము.

మండిపోవుచున్నది. చెప్పకయుండదమన్న మాం దెట్లు కీచకుఁడు ప్రవర్తించునో, ఉన్న దున్నట్లు భీమసేనునకుం జెప్పి యతనిభావమును గనుఁగొనియెద. (ముందునకు నాలుగడుగులు నడచి) ఎవరో లోపల మాటలాడినట్లున్నది? (తొంగిచూచి) ఓ అన్నగారు. భీమసేనుఁడే ఏమో తనలో గొణుగుకొనుచున్నాఁడు. భోజనము తృప్తిగా నేఁడు లేదేమో. మేము ముందు చేసికొన్న [1]సంజ్ఞప్రకారము చిటికెలు వేసెద. (అని చిటికెలు వేయుచు గోడచెంత దాఁగియుండును).

భీము:—(నలువైపులుచూచి తనలో) ఎవరీచిటికెలు వేసినది? ద్రౌపదియే కావలెను? లేక మఱియొకరీరీతిగ నెట్లు చేయనేర్తురు? మఱెవరైన మాసంకేత మెఱింగిరో? అటైన మాగుట్టు బయటఁ [2]బడునే, ఏమి గతి? (నాలుగడుగులు ముందు నడచి) ఎవరును గనఁబడరేదు? సైరంధ్రి నాచిత్తమును బరీక్షింపఁ గోరియే ఏదియో శుభవార్తఁ దెలిసియో వచ్చియుండును.

(ముందునకునడచి) ఎవరో యీమూల నున్నట్లున్నది (దగ్గఱకుఁ బోవును.)

సైరం:—(మాటలాడక యూరక నిలుచఁబడియుండును.)

భీము:—(నాలుగుదిక్కులు కలయఁజూచి) సైరంధ్రీ! ఏమి విచారముతో నున్నదానవు. ఇప్పుడు రానేల? ఇఁక నందఱు వచ్చుసమయము వచ్చును గదా. త్వరగా రాకకుం గారణమును జెప్పుమా.

సైరం:—పావనీ! ఏనిబాహుబలమును నమ్మి సోదరులు సుఖముగ నింతకాలము ధరణీతలంబున నుండఁగలిగిరో యట్టి నీవు దగ్గఱనుండియు నాకిట్టి యవమానము సంభవించుచున్నది.

౭ పాట.

భీము:—(మహాక్రోధముతో) పాంచాలీ! భీముని యొడలఁ బ్రాణములుండఁగ నే నీ యవమానమును బొందుటయా విలయకాలయముఁడైన నాముందు నిల్వఁగల్గునా? (కొంచె మూరకుండి) అన్నగారి యాజ్ఞయయ్యోనేని మున్నే నీవు దుఃఖించుచున్నను జూచుచున్నట్లుగును గాని లేకున్న.

సైరం:—(మాటకడ్డపడి) అన్నగారి యాజ్ఞ యేవిధమునను లేదు.

భీము:—(పండ్లు పటపట లాడించి) ఆయడ్డు లేకున్న నింక నిన్నవమానింపఁ జూచినవాఁ డెవ్వఁడో చెప్పుమా. తుద ముట్టించెద.

సైరం:—ఆవిషయము చెప్పక తప్పకున్నది. చెప్పుటకు వీలులేకున్నయది.

---

1. అభిసంధియగుట నిది యధిబలము.
2. శంకాత్రాణరూపమగు సంభ్రమము.

భీము:—ఏల యీలీల ననుమానించుచున్న దానవు?

సైరం:—నా యవమానకారణమును దెల్పితినా నీయుద్దండబాహుబలమును జూపక యూరకుండఁ జాలవు. ఏమైన నితరుల కెఱుకబడెనా ప్రతిభంగమగుటయు మరల బండ్రెండు వత్సరము లరణ్యావాసము మఱియు నజ్ఞాతవాసము చేయుటయుఁ గాఁగలవు. దానికే భయపడుచున్నాను.

భీము:—బేలా! అంతమాత్రము వివేకములేని వాఁడ ననుకొంటివా, కాలదేశముల నెఱుంగక యీభీముఁడు విక్రమించునా? అసంశయము వదలి వచింపుము.

సైరం:—వినఁ జెప్పెద.

చం. అనిలతనూజ సౌధమున • యుండు సుధేష్ణయు నన్ను గౌరవం
బునఁ గనుచుండ సేవనలు • పోఁడిమిఁ జేయఁగ వానిఁ జేయుచున్
మనమునఁ గల్గు భీతి యణు • మాత్రము పైఁ దెలియంగ నీక చ
క్కని వ్రతమూని యుండుదును • గాని కొంతయు లేదు నాయెడన్.

భీము:—ఇట్టి నీకేవిషయమున నవమానము సంభవించినది?

సైరం:—

చం. కలఁ డొకదుష్టమానవుఁ డ • ఖండభుజాబలశాలి తమ్ముఁడై
వెలయు సుధేష్ణ కాతఁ డతి • వీరుఁడు గావున నేరినైన ని
మ్ముల గణియింపకే తిరుగు • మూర్ఖుఁడు వాఁడట వచ్చుచుండు న
న్నలయఁగఁ జూచుచుండు దమ • కంబు గనంబడునట్టి చూపులన్. 3

భీము:—సైరంధ్రీ! త్వరగాఁ జెప్పఁదగిన విషయముం జెప్పుము, వాఁడేమైన నిన్న వమానింపఁ జూచెనా యేమి?

సైరం:—అవివేకి గావున నన్ను సామాన్యవనితామాత్రనుగాఁ దలంచి యితరులతో నన్నడుగుచు నాతో మాటలాడ నుద్దేశించినట్లు నటింప నేనితనితో నేటిమాటలని కార్యాంతరమిషం బూని యవలఁ బోవుచుఁ గాలము గడుపుచున్నదాన. అతని తలంపులఁ జూడఁగా నన్నుఁ బలుకరింపక మానఁడని తోఁచుచున్నది.

భీము:—సైరంధ్రీ! యింతమాత్రమునకే యులికి పడెదవేల? క్రొత్తగా నివగపడిన నాతఁ డెవ్వరోయని తెలియంగఁ గోరి యట్లడిగియుండుఁ గూడదా? సుధేష్ణ పవిత్రచిత్తయని విందుము కదా. ఆమె యింట ననుచితంబుగ మాటలాడుట కెవ్వనికి గుండెగలదు.

సైరం:—నామనస్సు కనుఁగొనుటకిట్లాడుచున్నావా యేమి? అతని పద్ధతిఁ జూడఁ

గా దుర్వృత్తితో మాటలాడ వచ్చునన్నట్లూహించితిని. లేకున్న నేనేల యావిషయము నుందలింతును?

భీము:—ఊహాలపై నూహాలే గాని యాతనినోటినుండియొక పల్లెత్తుమాటయైన రాలేదుగదా.

సైరం:—వాఁడేమేని మాటాడకున్నప్పుడే మెలంకువ పడవలయునని నాభావము.

భీము:—ఊహాలపై నూహాలే గాని యాతనినోటినుండి యొక పల్లెత్తుమాటయైన రాలేదుగదా.

సైరం:—వాఁడేమేని మాటాడకున్నప్పుడే మెలంకువ పడవలయునని నాభావము.

భీము:—ఇప్పటికీమాటలు చాలు రేపేమేని వాఁడు నిన్నుఁ బలుకరించెనా తగినట్లుత్తరమిమ్ము. దుర్వృత్తి గనఁబడు మాటలాడెనా తత్కాలోచితములగు మాటలాడి యప్పటికిని వానిచిత్తవృత్తి యథాపూర్వముగ నుండెనేని రహస్యముగ నాతో నుందలింపుము. విను మాపలిమాట.

మ. వనితారత్నమవై సతీతిలకమా ♦ ప్రఖ్యాతినిం గాంచి మిం
చిన కీర్తిం జెలువారు నిన్ను మదిలోఁ ♦ జింతింప కేతెంచి తు
చ్ఛుని తండంబునఁ గీచకుండు కుసుమా♦స్త్రం బుద్ధతిన్ గొంపనో
ప్పుచుఁ బల్కుల్ వచియించె నేని మృతిఁ గా♦ర్పంజాలుదుఁ నమ్ముమీ.
మఱొక్కమాట వినుము.

తే. సాధ్వి నీరూపమే ముందు ♦ జ్వలనుకుండ
ముగను; నే సోమయాజిగ ♦ మూర్ఖ కీచ,
కుండు మేషంబుగా సము♦ద్దండగదమె
యధ్వరుండుగ సాగును ♦ యజ్ఞ మొండు. 5

ఈపల్కు నిశ్చయమని నమ్ముము. పాంచాలీ! త్రిశుద్ధిగా నమ్ముము.

సైరం:—వాయుతనూజా! నీ వంతవాఁడవని యెఱింగియే నీకడకు వచ్చి చెప్పఁబోవుచున్నదానను. కాని రేపు వాఁడేమేని వచియింపరాని మాటలు పల్కెనా ఆవిషయ మంత్రయు నీకుం దెల్పి నీయనుమతి యట్లుచేసెద.

భీము:—ఇఁకఁ దడవు సేయరాదు. పరిచారకులు వత్తురు, మసలక పొమ్ము.

సైరం:—మహాబలనందనా! ఇకార్యంబును సాధించి నియ[1]మపరిసమాప్తి గాఁగా

1. గర్భబీజోద్భేదనరూపమగుట నిది యాక్షేపము. ఇందే ప్రాప్త్యాశయుఁ బతాకయుఁ జెప్పఁబడినవి.

శత్రువిధ్వంసమొనరించి యుధిష్ఠిరుఁ బట్టభద్రుఁ జేయుటకు నీభుజాబలమునకు భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు తోడగుఁ గాక.

భీమ:—పాంచాలీ! ఇఁక మసలవలదు. జాగరూకవై ప్రవర్తిల్లుము, అగ్రహాంబునఁ దోఁచినప్పుడు రావలదు. ఒంటిగా నేనుండుసమయ మారసిరమ్ము.

సైరం:—సకలవిధముల నాలోపము లేకుండఁ బ్రవర్తిల్లుదాన. ఇఁక నంతఃపురమునకుఁ బోయెద.

(అని యిరువురు నిష్క్రమింతురు.)

(ఇది గర్భసంధి)

ఇది తృతీయాంకము.

---

1. ఇదే ప్రాప్త్యాశాపతాకానుసారముగఁ బ్రధానాంగ సంయుతముగ గర్భసంధి వర్ణితము.

చతుర్థాంకము.

(చండికయను చేటి ప్రవేశించుచున్నది.)

చండిక:—(ఆత్మగతము) ఇంతకాలమునుండి యీయిల్లు కనిపెట్టుకొని యున్నాను. ఎన్నఁడుగాని యొక్కటైనను జేయరాని పని చేసిగాని, ఇతరులు చేయఁగాఁ జూచిగాని యెఱుఁగను. క్రొత్తవారెందఱో వచ్చుచుందురు. పోవుచుందురు. మరియాదగా నర్తించితి. నేఁటికీ క్రొత్తదాని వచ్చి యిల్లు చేరిన దాదిగా నెన్నియో కష్టములు కలుగుచున్నవి. అమ్మగారి కపకీర్తి కలుగునట్లున్నది ఈ దాని, నావలె నూరకుండునది కాదు. తన నేర్పంతయుఁ జూపుచుండును. అందులో అందగత్తియు. దీనిఁ జూచినప్పటినుండియుఁ గీచకుఁడు నన్నడుగుచుండును. ఏమో చెప్పుచుంటిని. మూఁడు దినములనుండి యదేమో కాని నన్నుఁ గ్రుచ్చి గ్రుచ్చి యీదాని విషయ మడుగుచున్నాఁడు. అమ్మగా రెఱింగిరా నామర్యాద దక్కునా ఏమిచేయుదు (ముంగుచూచి) అదిగో కీరవాణి వచ్చుచున్నది. (అని పడిపడి నరుగుచున్నది.)

కీరవాణి:—(ప్రవేశించి) ఓహో చండికయా, ఎండల కేమోవిచారించుదానివలె నిందు నిలువఁబడి యున్నావు.

చండి:—ఓసీకీరవాణి, నీకంటె నాకు ఎక్కువవారు లేరుకదా. ఒక్కమాట అడిగెద. చెప్పెదనని చేతిలోఁ జేయిపెట్టుము.

కీర:—ఒట్టు పెట్టుకొన వలయునా, నామనస్సు నీకుఁ దెలియదా అయిన నిదిగో చేతిలోఁ జేయియుంచెద. (అని ప్రమాణము చేయుచున్నది.)

చండి:—(చెవిలో నేమో చెప్పుచున్నది')

కీర:—చండికా, ఈభాగ్యమునకా యింతరహస్యము, నిశ్చయమే, కీచకున కాదా నీపై మోహము కల్గినది. చిత్రమేమి యున్నది?

చండి:—నన్ను దినదిన మడుగుచున్నాఁడు. ఆమెసంగతి నాకుఁ దెలియదని తప్పించుకొనుచున్నాను, ఇఁక దానిగతి యేమి?

కీర:—అక్కా! నీకేల చింత, మనలోఁ బాటు సైరంధ్రి దిక్కులేని దనుకొన్నావావేమి?

చండి:—ఏవ రామెకు దిక్కు?

కీర:—కీచకులు నూటుగురైనఁ జంపఁగల గంధర్వులైదుగురున్నారఁట. వారామెను గాపాడుచుందురఁట.

చండి:—గంధర్వు లేమి సైరంధ్రిని గాపాడు టేమి?

కీర:—అక్కా, విను. సైరంధ్రి సామాన్యురాలుగాఁ దలంపకు, దేవతాంశ సంభూతురాలని నాయభిప్రాయము. ఆమెయూహలు ఆమెమాటలు ఆమెప్రవృత్తి సామాన్యములని తలంచితివా, ఆమెకేమియు దిగులు లేదు. రాణిగారే యామెకు భయపడుచుందురు.

చండి:—ఆమాటల కేమిగాని కీచకుఁడు పట్టుపట్టిన యెడల ఎన్నియో దిక్కులు గలుగును. ఈమెకు గ్రహచారము చాలదు. చాలియున్న నిక్కడికేల వచ్చును? ఈమెను గీచకుఁ డేల మోహించును?

కీర:—పాండవు లంతటివారలకుఁ జిక్కులు గల్గినవని విన్నారము కదా. ఇఁక నీమె వంటి వారలకు మాత్రము గల్గుట యొక వింతయా.

చండి:—అక్కా! బాగుగా చెప్పితివి గాని పాండవు లేమైనారు?

కీర:—[1]వారి గడువు దాఁటగనే దుర్యోధనాదుల గర్వమడఁచి రాజ్యమును గ్రహించి పాలింతురు. మనము విందుములే. ఈమెను గీచకుఁ డేమేనిఁ బల్కెనా యతనికి మరణముతప్పదని నాకుఁ దోఁచుచున్నది ఇపుడు నీ విట్లేల చింతించుచున్నావు. ఇందేల మసలుచున్నావు అమ్మగారు పిలుతురేమో, కీచకుఁ డిపుడు రానున్నాఁడని తెలిసినది. రమ్ము, పోదము.

(అని యిరువురు నిష్క్రమింతురు.)

(ఇది ప్రవేశకము.)

(సుధేష్ణయుఁ గీచకుఁడును ప్రవేశించుచున్నారు.)

సుధే:—ప్రియసోదరా! కొలఁది దినములనుండి నీమోమున విన్నదనము తోఁచుచున్నది. ఏవిషయమునను గొంతి లేని నీకేల విచారము గలిగినదో తెలియఁజాలకున్నాను. తెలిసినచో నాకు నవకాశముండిన నంతలోఁ దీర్పుదును,

1. మైత్రివశమున నియతాప్తి ప్రదర్శనముఖముగా బీజమును మరల విమర్శించుటచే విమర్శసంధి యారంభింపఁబడినది. చేటీగతదోషప్రఖ్యాపనమువలన నిది యపవాద మనునంగము.

కీచ:—అక్కగారూ! మీరును బావగారును నన్ను సకలవిధములఁ బోషించుచుండ నేవిషయమునఁ గొఱంతయున్నదని చెప్పఁగలను?

సుధే:—నాయనా! ఏల నీమోము వాడియున్నట్లున్నదే. దీనింబట్టి యోజింప నీమనస్సున విడువని చింతయొకటి యున్నట్లు పొడకట్టుచున్నది. దాపనేల? చెప్పరాదా?

కీచ:—(మోమువంచి యూరకుండును.)

సుధే:—నాయనా! ఏమి యూరకున్నావు. క్రొత్తవా రిం దెవ్వరును లేరుగదా. నాతోఁ జెప్పఁదగని విచారము నీకుఁ గల్గునని కలలోనైనఁ దలంపకుంటిని. ఈనాఁటి కది సంభవించిన దేమో.

కీచ:—(గద్గదస్వరముతో) అక్కగారూ! చిన్నతనమునుండి నన్నుఁ బెంచి పెద్దచేసిన మీతోఁ జెప్పఁ గూడని మాట యొకటి యుండునా, విన.

సుధే:—(మాట కడ్డమువచ్చి) సోదరా. ఏల నీకింత వంత గల్గినదో చక్కఁగాఁ జెప్పుమా. ప్రాణములైన నిచ్చి తీర్చెద.

కీచ:—మీరంత ఘోరప్రమాణము చేయ నక్కఱలేదు. మీరు దయచూపించినచో నాకార్యము ప్రయాసము లేకయే నెఱవేఱును.

సుధే:—ఆట్లైన నింకెంతఁ గుందనేల? దుఃఖింపనేల? మోమున విన్నదనంబును దాపనేల? త్వరగాఁ జెప్పుము.

కీచ:—(మోమెత్తి కన్నీళ్లు గుడుచుకొని) నాప్రశ్నములకుఁ జక్కఁగా బదులు చెప్పవలయు.

సుధే:—మంచిది తమ్ముఁడా.

౭ పాట

కీచ:—మనయింటనున్న యీసైరంధ్రి యెవ్వతె? దీనిభర్త యెవ్వఁడు? ఎంతకాలము నుండి యిందున్నది? చక్కఁగా నాకుం దెలుపవలయు.

సుధే:—(తనలో) అయ్యో! ఈ దుష్టాత్ముఁడు సైరంధ్రిపైఁ జిత్తము నిలిపినట్లున్నది. ఇఁకేమిగతి? సైరంధ్రిని సామాన్యవనితగఁ దలంచిన వాఁడేమో. ఏవురు గంధర్వులు భర్తలు గలరని నాకుఁ జెప్పెనుగదా. దానిప్రవృత్తినిబట్టి చూడఁగాఁ బతివ్రతాతిలకమని చెప్పక తప్పదు. ఆమెను వీఁడు కోరుట వినాశము నొందుటకే గాని వేఱుగాదు. ఐనను మంచిమాటలతోఁ జెప్పి చూచెద. (ప్రకాశము) నాయనా. సైరంధ్రి యొక పనికత్తియ. దానిమాట నీకేల? నీవడుగఁదగినంత గౌరవము కలది కాదే.

కీచ:—సోదరీమణీ! మీరు చాల పొరపడితిరి. ఆమగువను జక్కఁగాఁ జూచినవా రామె యెవ్వరని యడుగక పోదురా.

సుధే:—నాయనా. పరస్త్రీలసంగతి నీవంటి బుద్ధిమంతు లడుగుట మంచిదికాదు. అందును బరిచారిక. దాని జోలి నీకేల? ముందు నీమనశ్చింతకుం గారణమును జెప్పుము.

కీచ:—(తనలో) ఈమె యెఱిఁగియు నెఱుఁగనట్లు నటించుచున్నది. ఐనను దెలుపక వీలులేకున్నది. తెలిపెదఁ గాక. (ప్రకాశము) నామనశ్చింత యాతరుణీమణి విషయముననే.

సుధే:—(విషాదమభినయించి) తమ్ముఁడూ. ప్రొద్దుపోవని యీమాట లేల? విచార కారణమును జెప్పుము.

కీచ:—సోదరీమణీ! ప్రొద్దుపోవని మాటలని నన్నువంత గుందించితివా నీకు నీసోదరుఁడు లేఁ డనుకొనవలసివచ్చును. ఇదియే కడపటి మాట.

సుధే:—(ఆత్మగతము) దైవమా. ఇంకేమి చేయుదు. వీఁడు మత్తుఁడు మంచిమాటలకు లొంగకున్నఁ గోపమున నితని లోఁబఱచు కొనఁజాలను బలవంతుఁ డగుట నెవరిని లెక్కపెట్టఁడు. ఇఁక నే నేమి పన్నుగడఁ బన్ని వీనిని మరలింతును. ఐన నిట్లుచెప్పెద (ప్రకాశము) సోదరా. సైరంధ్రిని సామాన్యవనితగఁ దలపోయకుము.

కీచ:—అది సామాన్య స్త్రీగాదనియే నాభావము. కాననే ప్రశ్నించితి.

సుధే:—ఆమె దేవతాస్త్రీ యనియే చెప్పవచ్చును.

కీచ—దేవతాంగనవంటిది కావుననే యడిగితి.

సుధే:—ఆమె చరిత్రము శ్లాఘ్యము.

కీచ:—శ్లాఘ్య మగుటనే యదెవ్వరని యడిగితి.

సుధే:—అది యని పలుకుట యుచితము గాదు.

కీచ:—కులగోత్రములు తెలిసినంత దనుక దాని నేమనవలయు?

సుధే:—ఆమెను దాసి యనఁ దగదు.

కీచ:—పరిచారిక యనవలయునా.

సుధే:—కాదు, సైరంధ్రి యనవలయు.

కీచ:—ఏమన్నను సేవకురాండ్రలో నొకతె యగునా కాదా?

సుధే:—ఇతరుల కట్లే తోఁచును గాని నాకామె గౌరవార్హురాలు.

కీచ:—నేనును గౌరవ మునిచ్చియే యాయింతివిషయము నరయఁ గోరితి.

సుధే:—నాయనా విను.

కం. చనుదెంచెఁ గొన్ని నెలలకు
మును పిచటికి దైవయోగ ♦ మున నీతరుణిం
గని పిల్వఁ బంచి నాచెం
తనె యుండు మటంచుఁ గోరఁ ♦ దానిల్చె నిటన్. 1

కీచ:—మీ రట్లు కోరుటకుఁ గారణ మేమో నేను దానిఁ గోరుటకుఁ గూడఁ గారణ మదియే.

సుధే:—ఆమెమోముఁ జూడఁగనే నాకత్యంతప్రేమ ముదయించెను గాన నేనే కోరి యుండుమంటిని.

కీచ:—నాకుం గూడ దానిమోము నిండుచందురునిం దిరస్కరించునట్లు కనఁబడినది. కావుననే మహానురాగమునఁ గోరి యడుగుచున్నాను.

సుధే:—అనురాగమున్న నన్నియనఁగూడదు

కీచ:—పురుషుఁడనైన నేనట్లే యనవలయు.

౬ పాట.

సుధే:—నాయనా! ఇంకఁ గాలహరణమును జేయు మాట లేల గాని యొక్క మాట చెప్పెద. విను, సైరంధ్రికిఁ బతు లేవురు కలరఁట. వారు గంధర్వులఁట. ఆమె కెవరైన నపకారము సేయఁదలంచిరా వారు ప్రాణములతో నుండరఁట.

కీచ:—ఆమాట లాయింతియే కదా చెప్పెను. పతు! లైదుగురా. ఇఁక నాకుఁ బాపమే లేదు. బహుపతులని యూహింపవలయుఁ గదా.

సుధే:—వత్సా! నీవేమో యనుకొనుచున్నావు. ఆమె భర్తలవిషయమును దలంచుకొంటినా నాగుండెలు తటతట కొట్టుకొనుచుండును.

కీచ:—(మహాక్రోధముతో) అక్కగారూ! నామాట వినుఁడు.

సీ. శత్రువులం గూల్పఁ ♦ జాలు చక్రంబును
హస్తంబునం దాల్చు ♦ హరియెయైన
[1]దుష్టశిక్ష నొనర్చు ♦ తోరపు రౌద్రాస్త్ర
మమరు హస్తము గల ♦ హరుఁడె యైన
నప్రతిహతశక్తి ♦ నలరు బ్రహ్మాస్త్రంబు
ధరియించియున్న వి♦ధాత యైనఁ

---

1. కోపసంభాషణ మగుట నిది సంక్షేపము.

బర్వతపక్షముల్ ♦ వ్రక్కలించెడు వజ్ర
మేచి తాల్చిన యమ ♦ రేశుఁడైన

తే. నేను భీతిని గందునే ♦ మాన కష్టు
వారిఁ గరముల బిగఁబట్టి ♦ భూరిశక్తి
గిరగిరం ద్రిప్పి వైచెద ♦ ధరణిఁ బడఁగ
నితరు లేరైన నిఁక లెక్క ♦ యే తలంప. 2

సుధే:—వత్సా! ఇట్లనుటయే యొకకీడు. మానవులం బోలె దేవతలను దలంచుట న్యాయమా.

కీచ:—దేవీ!

చం. [1]విను మొకమాట యింకఁ బది ♦ వేలమహేంద్రులు నన్ను మార్కొనన్
మనమున నెంచి యాత్మబల ♦ మండితులై చనుదెంచి రేని నొ
క్క నిముసమాత్రఁ జంపుదును ♦ గాఢపరాక్రమ మొప్ప నెల్లరుం
గనుఁగొన నిట్టి నన్నుఁ గనఁ ♦ గాఁ గలరే యొరులైనఁ జెప్పుమా. 3

సుధే:—నాయనా. నీవంతటివాఁడవే. కాని దైవబల మప్రతిహతము. వారెన్ని విధములైనఁ గీడుచేయఁ గల్గుదురు. కావున వారి జోలి మానుము. నిన్ను నమ్మి మీ బావగారు రాజ్యము నిష్కంటకంబుగా నేలుచున్నారు. ఇంతవఱకు నే చింతలు లేని నామనస్సునకు వితాకు గల్గింపకుమా. నామాట విను నాయనా, (అని గడ్డముపట్టి వేఁడును).

కీచ:—(అక్కకు నమస్కరించి) మీ రీమాయలాడి మాటలకు భయపడవలదు. గంధర్వులు భర్తలై యుండుటేడ? ఇది సైరంధ్రిగా మీయొద్ద నుండుటేడ? ఇది నమ్మఁదగిన మాటయే నా?

సుధే:—సోదరా! ఒక్క సంవత్సరమే యుండునఁట. విధియోగంబున నిట్టియిక్కట్టు గల్గిన దఁట. అది కడచిన వెంటనే యథాపూర్వముగ భర్తలం గూడి యుండి మహోన్నత ప్రఖ్యాతినిం గాంచునఁట. కావున నామాటలఁ దూలనాడక యింటికిం బొమ్ము నాయనా.

కీచ:—

చ. వినవె నిఁక నీదుమాటఁ గడు ♦ వీరుఁడ నౌటను దాని భర్తలన్
[2]బనిపెద ధర్మరాజపుర ♦ వర్యవనంబులఁ గ్రీడసల్పఁడీ

---

1. స్వశక్తిప్రశంసన మగుట నిది వ్యవసాయము.
2. తర్జనోద్వేజనరూప మగుట నిది ద్యుతి.

యని; తనుఁ గోరు నన్నుఁ దృణ♦మట్లుగ నింతియె చూచినన్ బలం
బునఁ గొనిపోదు నింటికిని♦బోదునె యూరక రిత్తమాటలన్. 4

సుధే:—ప్రియసోదరా. విను.

ఉ. ఆయు వడంచు భాగ్యముల♦నంశము నొందఁగఁ జేయుఁ గీర్తులన్
మాయ మొనర్చు నంతటను♦మానక దుర్యశముల్ గణించు నెం
తో యవమాన ముప్పతిల♦నొంచుఁ బరాంగన తోడి కేళి యో
నాయన! దానిఁ గోరుదురె♦న్యాయవిదుల్ మతిమంతు లెచ్చటన్. 5

కీచ:—సోదరీమణీ!

ఉ. జ్ఞానము గల్గఁ జేసి సహ♦జన్ముని వృత్తిని మార్పఁ జూచెదో
మానిని చాలుఁ జాలు బహు♦మానము చేసిన యట్లె యెంతు నా
చానను బిల్వనంపి సుఖ♦సంపదఁ గూర్పుమి యట్లు లేక యున్నన్
గానఁగఁ జాల వీవు స్మర♦గాఢశరంబులఁ జత్తుఁ గావునన్. 6

సుధే:—వత్సా! పెద్దలమాటల నిరాకరించుట హానికరము సుమా.

కీచ:—1పెద్దలమాట యీవిషయమున లెక్కసేయను. మరల నామాటనే వర్ణింపకుము.

సుధే:— 2నాయనా! పెద్దలతో విరోధించుట మంచిది గాదు సుమా.

కీచ:—మంచిదిగాని కాకపోని ఈవిషయమున నే నంగీకరింపఁ జాలను.

సుధే:—(ఆత్మగతము) వీఁ డెంత చెప్పినను దనపట్టును విడువకున్నాఁడు. చాల మూర్ఖుఁడు. ఇంక మంచిమాటలతో లాభములేదు. ఏదో యొకమాటను జెప్పి యిప్పటికిం బంపెద. (ప్రకాశము) కీచకా. ఎన్ని రీతుల బోధించినను నీ పట్టుదలను మానకున్నావు గదా. కాని, చెంతకు రమ్ము (అని చెవిలో నేమో చెప్పును).

కీచ:— 3(మహానందముతో) సోదరీ! సకలవిధముల నన్నుఁ గాపాడుటకు నీవుండఁగా నా కేకొఱఁతయు రాదు.

సుధే:—నాయనా! ఇఁక నీవిట నుసలవలదు. ఇంటికిఁ బొమ్ము. దైవము పంచిన ట్లయ్యెడు.

---

1. గురుతిరస్కారరూప మగుట నిది ద్రవము.
2. విరోధశమన మగుట నిది శక్తి.
3. గురుకీర్తనరూపమగుట నిది ప్రసంగము.

కీచ:—నీవు తలంచినట్లే యగు. అన్యథా కార్యమెట్లు సాగును. ఇదెపని వినియెద.

(ఇరువురు నిష్క్రమించుచున్నారు)

[పిమ్మట సైరంధ్రియుఁ గీరవాణియుఁ బ్రవేశింతురు.]

సైరం:—కీరవాణీ! దేవిగారు చెప్పినట్లు పూలహారములు సిద్ధము చేసితివా. నేఁడు పండుగు గదా.

కీర:—నాపనిలోఁ గొఱఁత యుండునా. అన్నియు సిద్ధము చేసి యుంచితిని. చందనమునఁ బరిమళవస్తువులు కలుపునపుడు నిన్నుఁ జెంత నుంచుకొనుమని దేవేరి యానతి. నీవున్నపు డాపని చేయవలయునని నిల్చినాను. తక్కిన పనులన్నియు సిద్ధము చేసితి—(ముందు చూచి తనలో) కీచకుఁడు దేవిగారితో మాట్లాడి వచ్చుచున్నట్లున్నది. మెల్లగా నేను దప్పించుకొనిపోయెద. సైరంధ్రితో నతఁడే మాటలాడుఁ గాక. (ప్రకాశము.) అమ్మా! పూలహారము లందే యుంచివచ్చితి. తెచ్చి నీకుంగనఁబఱచెద.

సైరం—మంచిది. నాకుం గనఁబఱచిన నేమేని లోపములున్నఁ దెలిసినంతవఱకుఁ జెప్పెద.

కీర.—మంచిది— (నిష్క్రమించును.)

(కీచకుఁడు ప్రవేశించు చున్నాఁడు.)

కీచ:—(ఆత్మగతము) ఔరా! రొట్టె విఱిగి నేతిలోఁ బడినట్లాయెను. నాముద్దుమిటారి యొంటరిగా నిందుఁ గనఁబడినది. పరిచారిక లెవ్వరు నిపుడు దగ్గర లేరు. కీరవాణి నాయుద్యమ మెఱిఁగినది కాన నేమో పనిమీఁదఁ బోవునట్లు నటించి యెచటికో పోయినది నేనే మాటలాడెద. నామాటలకు లోఁబడక పోవునా. (నాలుగడుగులు ముడిపడిఁ బెట్టి) సైరంధ్రి యెటుపోవను వీలులేకున్నది. ఇదియే సమయము. (సమీపించి మహానందముతో) పూర్ణచంద్రనిభాననా, తరుణీమణీ!

ఉ. ఎవ్వని పుత్రివీవు కుల•మెయ్యది భర్త యెవండు చూడఁగాఁ
బువ్వులు కాని సాయకముఁ • బోలె చెలంగుచు నున్నదాన నీ
వెవ్వనిఁ జేరనట్టి జగముల్•లేఁడు పటెందు విజంబు పద్మజుం
డెవ్విధి నీసురూపము సృ•జించెనొ చెప్పుమెయిం దలోదరీ. 7

సైరం—మహాత్మా! నన్నెవ్వరిగాఁ దలంచి మాటలాడు చున్నావో తెలియఁ జాల కున్నదాన.

కీచ:—సైరంధ్రీవేష మూని వచ్చిన నా భాగ్యముల పంటగాఁ దెలిసియే మాటలాడు చున్నవాఁడ వినుము.

౧౧ పాట.

సీ. అకలంకపూర్ణశ♦శాంకుఁడే నీమోము సరిపోలనొకవేళఁ♦జాలునేమొ
మందాకినీహేమ♦మంజులాబ్జంబులే నీకనులను బోలఁ♦నేర్చునేమొ
కలశవార్ధి జనించి♦యుండెడు శంఖమే నీగళోపమఁ గన♦నేర్చునేమొ
స్వర్ణభూధరసంభ♦వముగన్నతీఁగలే నీబాహువులఁ బోల♦నేర్చునేమొ
శారదాదివ్యహస్తాంబు♦జాతధృతవి
పంచికయొ నీ లసద్గళ♦స్వనమునకును
సాటిగా నిల్వఁగలదేమొ♦చాన, చెప్పఁ
జాల వర్ణన మిది గాదు♦సత్యమెన్న. 8

కాంతామణీ! పెక్కుమాట లేల. గాని నీ సురూపసంపదయే నన్నాకర్షించినది. దాసుఁడ. మఱొక్కమాట వినుము.

ఉ. దానములందు శాస్త్రములు♦తథ్యము చెప్పును ప్రాణ మిచ్చుటే
దానము దానిఁ బోలు నవి♦దానము లెవ్వియు ధాత్రి లేవటం
చోనెలఁతా యిఁకం బలుక♦కూరక యుంచుక యుండువేని నన్
సూనశరుండు కీడ్పఱుపఁ♦జూడఁగ నచ్చునె యెన్ని భంగులన్. 9

కావునఁ గాంతారత్నమా! నన్నుఁ గౌఁగిటం జేర్చి నాకుఁ బ్రాణదానము చేయుమా.

సైరం.—(ఆత్మగతము) వీఁడు మదాంధుఁడు. కన్నుగానక మాటలాడుచున్నవాఁడు. సహాయము నాకిట నెవ్వరును లేరు. ఈయంతఃపురమున నితనికి బుద్ధిచెప్ప గలవారెవ్వరును నాకగపడలేదు. ఇఁక మంచిమాట లాడి తప్పించుకొని వీని యమపురికిం బంపునట్లుచేసెద. (ప్రకాశము) రాజతిలకమా! నాయున్న యునికినిం దలంపక ధర్మాధర్మమార్గంబుల నూహింపక నీవంశగౌరవంబు నాలోచింపక జనాపవాదము గల్గునేమో యని భయంపడక బంధువులు విన్న దలవంపు లగునని సంశయింపక యేమేమో మాటలాడుచున్నా వేల? నావంటి తోఁబుట్టువులు గల నీబోంట్లే యిట్లు మాటలాడిన ధర్మ మేయేటఁ బడును? జను లేమందురు? కొంచె మాలోచింపుము. మీవంటి గొప్పవారు నాబోటి దుర్జాతిని గోరఁదగునే, ధర్మంబుఁ గాపాడు క్షత్రియకుమారులే యిట్టి కుమార్గము నవలంబించిన నిఁక దానిని గాపాడు వారెవరు? నాకును నీవు తోఁబుట్టువవు.

ప్రమాదమునఁ బల్కిన పల్కులకు బశ్చాత్తాపప్రాయశ్చిత్తంబునఁ బరిశుద్ధిని కల్పించి సన్మార్గమునఁ బొమ్ము.

కీచ.—అన్నులమిన్నా?

క. తను విడి దుర్జాతియు గా
దని చెప్పక చెప్పుచున్న దన్యసతిం గూ
డిన వచ్చు పాపమునకుఁ
మనమున భీతిల్లఁ దాళఁ దస్మరశరహతికిన్ 10

సైరం:—(ఆత్మగతము) ఇఁక మంచిమాట లితని యందుఁ బనిసేయఁ జాలవు గట్టిగాఁ జెప్పి చూచెద (ప్రకాశము) కుమతీ!

శా. వైరిస్ఫారపరాక్రమప్రబలదుర్వారాబ్ధికుంభోద్భవుల్
సారోదారశరావళీదళితదుస్తంత్రప్రధానాహితుల్
ధీరుల్ భూరిభుజాబలార్జితయశోదీప్తుల్ మనోనాథు లె
వ్వారిన్ లెక్కిడ రుక్కడంతురు నినుం బాపాత్మునిం గ్రుద్ధులై. 11

కీచకా! గంధర్వాకృతులగు నాప్రాణేశ్వరు లైదుగురు సర్వదా సర్వథా నన్ను గాపాడుచుందురు. ప్రల్లదంబు లాడక యూరక పొమ్ము.

కీచ:—బాలా! ఈలీల నాబల మెఱుఁగక పల్కెదు. ఒక్క గంధర్వులే కాదు ముల్లోకంబు లెత్తి వచ్చినను నేభయుంపడను. ఆమాటలకు [1]వీఁడు భయపడఁడని నమ్మి నామనోరథ మీడేర్పుము. దాన నీకు సకలభోగములు సిద్ధించు. ముందు నీవే నాయింటి కధిపురాల వయ్యెదవు. నీకు లభింపని సుఖసంపద లిఁక నుండవు. కాన నామాఁట గైకొని నన్ను సఫలమనోరథుం జేయుము.

౧౧ పాట.

సైరం:—(సక్రోధము) దురాత్మా! పరసతీసంగమమున నెందఱెందఱు చెడిరో కొంచె మాలోచింపుము. రావణాదులవార్త లొక్కమాఱు తలంపుము. పరదారరతింగోరి బాగుపడిన వార లెవ్వరైనఁ గలరా యని వ్రేలుముడిచి యొక్కనిం జూపుము. ఇఁక నాతో మాటలాడక యూరక వచ్చినదారిఁ బొమ్ము.

కీచ:—ఇంతీ! నీవేమన్నను గోపమొందను. ఏమన్న ననుము. నామనో[2]రథము మాత్రము మీడేర్చినం జాలు. భుజాబలమున నన్ను మిగులువారు ముజ్జగముల లేరని

1. సిద్ధామంత్రణమువలని భవిష్యత్ప్రదర్శనరూపమగుట నిది ప్రరోచనము.
2. వికత్థనముఁ దెలుపుటచే నిది విచలనము.

మాత్రము తలంపుము. గంధర్వులే కాదు ముప్పదిమూఁడుకోట్ల దేవతలు నా పేరు విన్న వడవడ వడఁకుదురు. ఇతరుల మాట లెక్కయా. ఇట్టి నన్నుఁజేపట్టితివా కోరినంతమంది పరిచారికలు గొల్వ సకలభోగముల ననుభవింపఁ గలవు. నామాటఁ బాటింపుము. సకల¹మనోరథములు ఫలియించును. మనశ్చింతలు తొలఁగును. స్త్రీజాతిస్వభావములగు పల్కులం బల్కకుము. కడు వోపంగాద. మరల వచ్చి మాటలాడెద. చక్కఁగా నాలోచించుకొని యిదమిత్థమ్మని తీర్మానించుకొని యుండుము.

సైరం:—గురాత్మా! నీవే యాలోచించుకొనుము. అందని ద్రాక్షల పండ్లు గోయఁ దలంపకుము. అది మేలుగాదు (ముందునకుదృష్టిసారించి) కీరవాణి వచ్చుచున్నట్లున్నది. (సమీపించి) కీరవాణీ! ఇదిగో వచ్చుచున్న దాన.

(అని యందఱు నిష్క్రమింతురు)

2 (ఇది విమర్శసంధి)

(ఇది చతుర్థాంకము.)

---

1. కార్యసంగ్రహరూపమగుటనిది యాదానము.
2. విమర్శసంధి సాంతముగాఁ జెప్పఁబడినది.

పంచమాంకము.

(పిమ్మట నింద్రానుమతిచే నశ్వసేనప్రమతులను దేవమాతలిరువురు మనుష్యరూపములఁ బ్రవేశించుచున్నారు.)

అశ్వ:—మిత్రమా! మూఁడుదినములనుండియు మన మీపురమున వార్తల నరయుచున్నాము. నీ వేమి పరికించితివి?

ప్రమతి:—సఖా? నేనెన్నియో సంగతులను గనుఁగొంటిని. ఇంద్రుని యాజ్ఞ నెఱవేర్చినట్లే యనుకొనుచున్నాను.

అశ్వ:—ఏవియో నీవు కనుగొన్నవింతలు. పాండవుల కుశలమరసితివా.

ప్రమ:—చక్కఁగాఁ గనుఁగొంటిని. నీకుఁ జెప్పవలయునా.

అశ్వ:—వినఁ గోరుచున్నాను నేనును జక్కఁగాఁ బరీక్షించితి. ఆవిషయమును దరువాతఁ జెప్పెదను.

ప్రమ:—సఖా! విను పాండవులేవు రిందున్నవారు. వారి కేవిషయములయందును గష్టములు గలుఁగలేదు.

అశ్వ:—వారెందున్నారు. వారి పేరులెవ్వి?

ప్రమ:—మిత్రమా! చెంతకురమ్ము. (అని చెవిలో నేమొ చెప్పును).

అశ్వ:—(సంతోషముతో) చక్కఁగాఁ దెలిపితివి. సాధుసాధు శుభవృత్తాంతమును విననోచితిని. నేను నొక్కవిషయ మెఱింగియుంటిని. నీవలన నందువృత్తాంత మెఱుకపడియె.

ప్రమతి:—నీకుఁ దెలిసినవిషయ మెఱిఁగింపుము.

అశ్వ:—మిత్రమా విను. సైరంధ్రియే పాంచాలి, ఆమె సుధేష్ణయొద్ద గౌరవోద్యోగము సంపాదించి యుండెను. ఆ సాధ్విని సుధేష్ణసోదరుఁడు మదాంధుఁడు కీచకుఁడు కోరెను. తొలుతఁ దనయక్కతోఁ జెప్ప నామె నీతులఁ దెలిపి పంపెను సైరంధ్రితోఁ దులువతనమున మాటలాడఁగా నాసతీతిలకము మొదట నీతులఁ దెల్పియు నవ్వల నిష్ఠురోక్తులాడియు నాపిదప బెదరించియుఁ బంపెను. వాఁడా మెుపలుకుల లెక్కగొనక కొంతయవకాశ మిచ్చి మరలవచ్చెద నని వెళ్లెను.

ప్రమతి:—సఖా! ఈకార్య మెట్లుపరిణమించునో, ఆమె నెవరు గాపాడుదురో అక్కటా! సజ్జనులకే సకలకష్టములు సంభవించునుగదా.

ఆశ్వ:—ఆర్యా! అదెసైరంధ్రి యేకాంతమునను్న భీమున కీసంగతిని జెప్ప వెళ్లుచున్నది. మనమదృశ్యరూపములఁ బరిశీలింతము రమ్ము.

(అని యిరువురు నిష్క్రమింతురు)

(ఇది విష్కంభము.)

(సైరంధ్రి మహానసగృహమును బ్రవేశించుచున్నది.)

సైరం:—(ఆత్మగతము) నిన్న మొన్ననే భీమసేనుఁ గాఁడిలం జేసి పంపెను. పిట్టపిడు[1]గుగ నీవార్త యింతలోనే చెప్పిన నతఁ డాగ్రహావ్యగ్రుఁడై యొడలెఱుఁగక త్వరపడి యొక కార్యముచేసిన దాని నేమేని గీడుమూడినచో ధర్మనందనుం డేమనిచింతిల్లునో. ఊరకుందమన్నవీలులేదు. నేఁడు కీచకుఁ డాడినమాటలకు నాయొడలెల్ల మండుచున్నయది. ఈ పెనుమంట లానరాధమునిరక్తధారలలో స్నానముచేసినఁగాని చల్లారదు. ఏది యెట్టులున్నను భీమసేనున కెఱిఁగింపక తప్పదు. (ముందు నాలుగడుగులు పెట్టి) ఎవరును లేరు నిశ్శబ్దముగ నున్నది. ఇది మంచిసమయము. (అని నడినడిఁ బోయి) ఔరా! ఈతఁడు హాయిగ నిదురించుచున్నవాఁడు నిద్రాభంగము దోషమేయని యూరకుందమన్న మానభంగము కలుగును కానలేపెద (అని మీఁదహస్తముంచును.)

భీమ:—(మెల్లగా నిద్రలేచిన ట్లభినయించుచు) ఇదేమి పాంచాలి యిపుడు వచ్చితివి?

సైరం:—వాయునందనా! ఆనాఁడు మీరు చూచుచుండ దుశ్శాసనాదులచే నవమానింపఁ బడితిని. ఈనాఁడు దిక్కులేని దానివలె మీకుఁ దెలిపికూడఁ గీచకునిచే నవమానింపఁబడఁ బోవుచున్నదాన. ఇట్టి యిక్కట్టున నీవూరకున్న నేజీవింపఁజాల.

భీమ:—ద్రౌపదీ! ఇపుడేమి చెప్పఁదగిన వార్త. ఆపాపాత్ముఁడేమైనఁ బ్రల్లదంబు లాడెనా, త్వరగాఁ జెప్పుము. (అని కూరుచుండును.)

సైరం:—ఆదుర్మాత్ముఁ డీదినము నన్నుఁ జూచి పిలిచి యన్నమాటలు నేవచింప నీవాలకింపఁ దగినవి కావు రేపు గడువు దినము. అంగీకరింపకున్న రూపు మాపుదునని శపథములు పలికి పోయినాఁడే? నాగతి యేమి?

---

1. పూర్వాంకమునఁ జెప్పఁబడినవిషయము నుత్తరాంకములోని కవతరింపఁ జేయుట నిదియంకావతరణము.

భీము:—(పండ్లు పటపట లాడించుచు) యాజ్ఞసేనీ రేపు గడువు దినమా. ఆపాపాత్ముని కాయువు నశించు వినుము. శపథము నేను జేయుచున్నాను, విను.

౧౨ పాట.

చం. సురలు ముదంబునం బొదల ♦ శూరశిఖామణు లౌర కుంచనన్
గరము దురాత్ముఁడై నిను ని♦కారపరుషోక్తులఁ దూలనాడి ని
ర్భరబలశాలి నంచు గరు♦వంబున నొప్పెడు కీచకాధమున్
దవ్వగపడి చంపి నీదువగఁ ♦ బాపెద భీముఁడ నేనె యైనచోన్. 1

సైరం:—పవననందనా మీయన్నగారు నాఁ డుపదేశించిన యజ్ఞాతవాస నియమములు జ్ఞప్తియం దున్నవి కదా, వానికి విరోధము లేకుండఁ బ్రవర్తిల్లవలయు. ఏమాత్రము హద్దుమీఱి ప్రవర్తించితివా మన శ్రమముల కంతమే యుండదు.

భీము:—పాంచాలీ! ఒక తెలియఁగని శివ మెత్తునా. మన సెఱుఁగని కలవచ్చునా? ఈస్వల్పకార్యమున కింతో ప్రయత్నము వలయునా.

సైరం:—ఎట్టులకార్యమును సాధింప నూహించితివి.

2 పాంచాలీ నీమనఃఖేదమును బాపి ధర్మజునకుం దక్కిన తమ్ములకును మానస్సంతోషమును గల్గించెద.

భీము:—3 రేపు బుద్ధిలేక యాతఁడు వచ్చి మరల నెప్పటి యట్ల మాటాడఁ బూనెనేని హితవాక్యము లుపదేశించినట్లు నటించి యాతల నొకసంకేతస్థలము నిశ్చయించి యచటికి రాత్రి రెండవజామున రమ్మని చెప్పుము. నేను నీతోవచ్చి యతనికి శాశ్వతానంద మొసఁగూర్చెద:

సైరం:—మహాబలశాలి కీచకుఁడు. మదాంధుఁడు. నిరాయుధుఁడవగు నీవాతనితో నెట్లు పోరాడి జయింతువాయను శంక కలుగుచున్నది.

భీము:—(బొమముడిచి) అట్టి సంశయము నీకుఁ గల్గెనదా వినుము.

ఉ. శాతనఖాంకురంబుల బ్రబం♦ సత్త్వము పొంగఁగ సింహశాబకం
4బాహురతన్ మదావిలము ♦ హస్తినిసంభ్రమమింగ బట్టిన
ట్లో తరుణీమణీ! కుమతి ♦ నుగ్రతఁ గీచకు ముష్టిజానుసం
ఘాతములం గృతాంతపురిఁ ♦ గాపుర ముంచుపుంగఁ జేయఁ బంపెదన్. 2

1 ప్రసిద్ధబీజనిర్వహణమువలన నిది నిర్వహణసంధి ప్రారంభింపఁబడెను.
2. సుప్రసిద్ధబీజోపగమన మగుట నిది సంధి.
3. ప్రస్తుతకార్యమార్గణ మగుట నిది విబోధము.
4 కార్యాక్షేపణరూప మగుట నిది గ్రథనము.

సైరం:—(సంతోషముతో) మారుతనందనా! నీవంతటి వాఁడవే, ఐనను మీరుభయులు పెనఁగునపు డార్చిన నలుగురకుఁ దెలియక యుండునా అని సందియ మందెద.

భీమ:—పాంచాలరాజనందనా! నా బాహువులం జిక్కి వాఁడూరక చచ్చుటయే కాని నోరెత్తి యార్చుట సంభవించునా నా క్రోధాగ్నిజ్వాలల కాతఁడు తొలి యాహుతియే యగుఁగాని బ్రదికి పోవుటగాని, నాగతి యిట్లాయెనని యార్చుటగాని కలుగదు నమ్ముము. త్రిశుద్ధిగ నమ్ముము.

సైరం:—నాకట్టి నమ్మకము కలిగియుండుటంబట్టియే యీవేళ నీతావునకు రాఁజాలితి. నీసాయము కలుగదని తెలిసినయెడ నీపాంచాలి పంచత్వ మొందియే యుండదా.

భీమ:—ద్రౌపదీ! అట్టి యశుభోక్తుల రానీయకుము. ఎన్నఁడు గాని నీకవమానము రానీయను. ఆనాఁడు ధర్మనందను నాజ్ఞాదృఢపాశబద్ధుఁడనై శునకమువలె నూరకుంటిని గాని లేకున్న నెవ్వరైన నీ మెయి ముట్టుదురో, (అని భుజాస్ఫాలనము చేయఁబోవును)

సైరం:—(చేయిపట్టుకొని) భీమసేనా! ఈభుజాస్ఫాలనము నెవ్వరేని విన్నచో నిపుడే కార్యభంగమగునే, ముందేమి పని సాగును, నీకాగ్రహము కలిగినపు డొడలెఱుఁగక యేమి చేసెదవో యనుసందియము మాత్రము మానఁజాలకున్నదాన.

భీమ:—(చిఱునవ్వుతో) చెలా! కార్యమెట్లు నడుపఁదగునో తెలియని వాఁడనా? మహారణ్యమున హిడింబాసురునితోఁ బోరాడునపుడు సోదరులకును దల్లికిని నిద్రాభంగము కాకుండ నాతని వెనుకకు నెట్టి కొంతదవ్వు కొనిపోయి మర్దించి చంపిన యావాఁటి యనుభవము నాకున్నది సుమీ.

సైరం:—2 వాయుకుమారా! నీకంటెఁ దెలియని యెఱుఁగని సంగతులు నేఁ జెప్పరాలేదు. అబల నగుట సంశయించితి. ఆసందియములు మానినవి. ఇఁక నేపు దురాత్మునకు శతసంవత్సరములు నిండెనని నమ్మి హాయిగ నిద్రించెద. నీయానతిచొప్పున సంకేతస్థలము నిర్ణయించి కాలముం దెలిపి యీవిధమంతయు నీకెఱింగించెద. ఇఁక నేఁజేయఁదగిన పని నుపదేశించి పంపుము

భీమ:—3 పాండవభాగ్యదేవతా! ఇఁక నీవూఱడిల్లు మూఱడిల్లుము. శత్రుకులమును

---

1 అనుభూతాఖ్యాన మగుట నిది నిర్ణయము.

2 పరస్పరసమయానుగుణజల్పన మగుట నిది పరిభాషణము.

3 పర్యుపాసనరూప మగుట నిది ప్రసాదము.

నశింపఁజేసి నిన్ను సంతోషాంబుధినిమగ్నఁగావించెదను. నిర్భయముగ నిస్సంశయముగ నిరుపద్రవముగ నిర్భరానందముగ నిస్సపత్నముగ వర్ధిల్లుదువు గాక. నీకిట్టి యుత్సాహము నిచ్చె యీభీమసేనుఁడు కల్పింపఁగలఁడని మాటికి ముమ్మాటికి నమ్ముము. నమ్ముము

సైరం:—మరున్నందనా.

ఉ. [1]కోరిక లెల్లఁ బండె మదిఁ గొంకొక యింతయు నింక లేదు నీ
వారసి శాంతమూని సమయంబునకుం దగు శక్తిఁ జూపి దు
ర్వారమదప్రమోహగురుభారసదావిలచిత్తుఁ గీచకున్
నేరుపుమీఱఁ జంపి కులనీతిని గాచి యశంబు నిల్పుమా. 3

భీము:—పాంచాలీ! ఇఁకఁ దడవు సేయనేల, ఎన్నఁడే కలఁతింగిన నింతియు నేఁటిరేతిని మాఱ్పునొందును. నిశ్చింతస్వాంతవై యింటికరుగుము

సైరం:—వాయుకుమారా, నాసంశయములు దూరముగాఁదొలఁగినవి. ఇఁక నింటికిం బోయెద (అనియించుక సంశయించినట్లుండును.)

భీము:—పాంచాలీ! వినుము.

[2]క. సందియములఁ బొందకు మో
సుందరి నీశత్రు వెంతసొరిదిఁడె యైనన్
డెందమున శంక నొందక
ద్రుంగించెద రేపు చూడు మాట లిఁకేలా. 4

(చేరఁదీసికొని) తరుణీమణీ వట్టిసంశయములఁ బాఱఁదోలుము. ఇఁకహాయిగ నుండుము. రేపు కీచకుఁడీభూలోకమున నుండఁడనుటసత్యవాక్యమని విశ్వసింపుము. ఇదె ప్రమాణముచేసెద (అని కరమునఁ గరమిడుచున్నాఁడు.)

సైరం:—మరున్నందనా! నీవను దేవతాప్రత్యక్షము నిడనున్న నాకును సంశయమా. స్త్రీబుద్ధిగాన నించుక యనుమానించుచున్నది. రేపు వాఁడే వచ్చిన నీయానతిరీతిఁ జెప్పివచ్చి నీచెంత కారులెఱుఁగకుండ వచ్చి తెల్పెద. తరువాత కృత్యమొనర్చి శాశ్వతకీర్తినొందుము. ఇదె పోయివచ్చెద.

(అని యిరువురు నిష్క్రమింతురు.)

---

1 వాంఛితావాప్తి రూపమగుట నిది యానందము.

2 దుఃఖనిగ్రహనరూప మగుట నిది సమయము:

(సుమతిలోనగు దుర్యోధనచారులు ప్రవేశించుచున్నారు)

సుమతి:—చారులారా! మన మీనగరంబునం జక్కఁగాఁ దిరిగి పరీక్షింపవలయునని వచ్చితిమి. మనవేషభాష లొరు లెఱుంగకుండఁ జేయునవియే. కాని మూఁడు దినముల నుండి మీ రేవార్తలం గంటిరి.

చారు:—బ్రాహ్మణవేషము ధరించితిమి గాన నన్నితావులం దిరుగుచున్నారము. నిన్న రాజదర్శనము చేసితిమి. ఆయా స్థలములఁ దిరిగి విచారింపవలసిన రీతిఁ గనుగొంటిమి. క్రొత్తవార్త లేవియుఁ దెలియరాలేదు. ఇంకను బరీక్షింపవలయు నని యెంచి యున్నారము. మీ కేమేని వింతలు తెలియవచ్చినవియా.

సుమ:—నిన్న సాయంకాలము ద్వారకాపురవాసి బ్రాహ్మణునిం జూచితి. పాండవుల వెదకుటకుగా వచ్చిన ట్లాతని మాటల జాడంబట్టి తెలిసికొంటిని. కృష్ణుఁడు పంపియుండునేమో యని తలంచెదను. ఎవరెవరు వచ్చియున్నారని యడిగితి. ఆతఁ డేమో యసందర్భముగ మాటలాడెఁ గాని చక్కఁగా నుత్తర మీయలేదు.

చారు:—కృష్ణునకుం గూడఁ బాండవులజాడ తెలియదని యూహింప నవకాశ మేర్పడినది కదా. ఇఁకఁ బాండవులు ప్రాణములతో నున్నయట్లు మన మూహింపరాదు. కృష్ణుఁడు పాండవులకుం బరమబంధువు కదా. ఆయన కెఱుఁగ రాకున్నచో వారీలోకమును విడిచిరనియే యూహింపవచ్చును, మనకష్టము తప్పినట్లే.

సుమ:—అయ్యూహ సరికాదు. కృష్ణుఁడు తెలియనట్లు నటించుచున్నాఁడేమో. ఎవరికిఁ దెలిసినను వెల్లడి యగునని వారు తమవర్తనములఁ గలుపకుండవచ్చు. నిన్న నకులునివలె నున్నవాని నొకనిం జూచితి. తుద కాతఁ డశ్వసంఘాధిపతి యని తెలియవచ్చెను. మొదట చాల సంతోషించితిఁ గాని యవల నాసంతసము నిష్ఫలమాయె. ఇఁక నేమిచేయవలయునని మీరూహించుచున్నారు?

చారు:—రెండు మూఁడు స్థలములు పరిశీలింప వలసియున్నయవి. ఆమీఁదిసంగతి తరువాత నూహింపవచ్చునని మాతలంపు.

సుమ:—రేపు నిపుణముగాఁ బరీక్షింపుఁడు. ద్వారకాపురవాసు లెవరెవరు వచ్చియున్నవారో పరికింపుఁడు. వారి చర్యలంబట్టి వారి యింగితము లెఱుంగుఁడు. రేపు సాయంకాల మిందే మనమందఱము కూడవలయు.

(అందఱు నిష్క్రమింతురు.)

(సైరంధ్రి యింటి నుండునపుడు కీచకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

కీచ:—ప్రేయసీ! నిన్న నీకిచ్చిన యవకాశమును సఫలముచేసితివా. లేక యట్లే బేలవై పట్టుపట్టి యున్నదానవా.

సైరం:—(ఊరకుండును)

కీచ:—(తనలో) ఏమో మెత్తఁబడిన జాడ కనుపట్టుచున్నది. ఇఁకను ఆశగొలిపి నమ్మకము పుట్టించెద. (ప్రకాశము) అన్నులమిన్నా. నాపలుకొకటి యాలకింపుము.

సీ. చతురబ్ధివలయిత♦ధాత్రీచక్ర మెల్ల నీ
  వశ మొనర్చెద నేల♦వచ్చుఁ దరుణి
సురపురిఁ గల కల్ప♦తరువులఁ దెచ్చి నీ
  చెంత నిల్పెదఁ దృప్తిఁ♦జెందు మబల
సంద్రముల్ గలఁచి చం♦చద్రత్నములఁ దెచ్చి
  యర్పించెదం బ్రీతి♦నలరు మింతి
ధనదుని నిధులను♦దప్పక కొని వచ్చి
  యిచ్చెద ముదమందు♦మచ్చకంటి
నింక నేమేమి కోరెదో♦యేను నీకుఁ
గొఱఁత లేకుండ నిచ్చెదఁ♦గోర్కి మీఱ
నన్ను బిగికౌఁగిటం జేర్చు♦మన్న మున్న
త్రిజగముల నేలినట్లై సం♦తృప్తిఁ గనుదు. 5

సైరం:—పుణ్యాజనా! నా వ్రతమును గాపాడుట నీకుధర్మము. పరసతిని ప్రేయసీ, అన్నులమిన్నా యని పిలువఁ దగునే. మహాపాపము గదా.

కీచ:—పరసతియైనచో నట్లు పిలువఁగూడదు. అవార్థ నేనెఱుఁగనా. అభావమునఁ బిలువలేదు. నా ప్రాణేశ్వరి యనియే పిల్చుచున్నవాఁడ.

సైరం:—అభావము నీకుండఁగూడదు. అది మంచిమార్గము కాదు.

కీచ:—అభావము నాకు లేదు గనుకనే యట్లు పిలిచితిని. తప్పేమి యున్నది?

సైరం:—అయ్యో! పుణ్యజనాగ్రగణ్యా! కామాంధుఁడవై యేమేమో మాటలాడుచున్నవాఁడవు.

కీచ:—తరుణీతిలకమా! కామాంధత్వమును గరుణారసాంజనముచే బోఁగొట్టి నన్నుం గాపాడుము.

సైరం:—అది యీరూఢము న్నంతవఱకుఁ బోఁగొట్ట శక్యముగాదు.

కీచ:—రూపాంతరమును బూనెద. అఘాడైనం బోఁగొట్టి కృతకృత్యం జేయరాదా.

సైరం:—అప్పుడది తనంతనే పోవును. ఇప్పటిప్రయత్న మద్దానికిం జాలదు. గొప్ప ప్రయత్నము చేయవలయును. అంత యేల?

కీచ:—ఎంత ప్రయత్నమైనను జేసెద. ఎన్నిపాట్లు పడవలయు నన్నను బడియెద. ఆయుపాయమును జెప్పుమా.

సైరం:—నాభాగము నీవు చక్కఁగాఁ గలిసి కొన్న జాడ కానరాదు. దూర మాలోచింపుము. నలుగురు విన్నఁ దలవంపు లగును.

కీచ:—నీభాగ్యము చక్కఁగాఁ దెలియకయే యింతమారము పరితపించుచున్నవాఁడ. నీసాంగత్యము నభిలషించి యింతదూరము వేఁడుచున్నవాఁడ.

సైరం:—నాభాగ్యము నీయందున్నదో ముందు నీకే తెలియఁగలదు నాసాంగత్యము నీకు శాశ్వతానందపదము సేయఁగలదు.

౧౩ పా:

కీచ:—అబ్బా! నేఁటికి నాజన్మము కృతార్థమయ్యెను. నాకోరికలు ఫలించెను. తరుణీ! శాశ్వతానందము ననుభవింపఁ గోరియుండియే నీసాంగత్య మపేక్షించి యింతదూరము దీర్ఘప్రార్థనఁ జేయుచున్నవాఁడ. తడవుసేయక నాకాంక్ష దీర్పుము.

సైరం:—నాసాంగత్యమునే కోరితివా నేఁటితో నీజన్మము కృతార్థము కాఁగలదు. మరల నేకోరికలును బుట్టవు. మఱియు నీజన్మమున నితరతరుణీవాంఛ నీకుఁ గలుగదని గట్టిగాఁ జెప్పఁగలను.

కీచ:—నీసాంగత్యమునే కోరితిని నేఁటికి నాకోరికలు ఫలించుఁగాక. ఇతరతరుణీవాంఛ నొందను త్రికరణశుద్ధిగా నమ్ముమా. నీవాగ్దానమును జెల్లింపుము. (అని పట్టుకొనఁ బోవును)

సైరం:—సమయమెఱుఁగక యిట్లు కోరుట న్యాయమా. నాకోరికయు నీకోరికయు రహస్యమున ఫలించునవి గాని యిప్పుడు ఫలించునవి కావుకదా.

కీచ:—చానా! సమయ మెప్పుడో తెల్పుము, ప్రాణములు నంతదాక నెట్లో ధరించి యుండుకొనియెద. తడవు సేయకుము. మన్మథుఁడు కరుణావిహీనుఁడై నన్ను విరిశరముల నొంచుచున్నవాఁడు. తాళఁజాల.

సైరం:—చానా యనకుము. సాధ్వియనుము. ఇప్పటి కది తగినమాట. పుష్పశరముల తాకునకే యోర్వఁజాలకున్న నీవిఁక నిశాతనఖముఖవిదారణముల కెట్లోర్వఁగలవు.

కీచ:—సాధ్వీయనియే పిల్చెద, నీవేమనఁ గూడ యిట్లువో యట్లే ప్రవర్తించెద. నఖక్షతములు దేహమున సోఁకినప్పుడవి యింపుగానుండి మహానందమును గూర్చును జుమీ.

సైరం:—నీ కాసుఖమే కావలయుఁ గాఁబోలు. కొంతకాలము వేచియుండుము. నీవాంఛ ఫలింపఁజేసెద

కీచ:—ఇఁకఁ దడవుసేసిన సురల నన్నుం జూపెంగాలవు ఎప్పుడో యాసమయము చెప్పుము.

సైరం:—అంత త్వరపడఁ జనునే. కాలము చక్కఁగాఁ గూడినఁ గదా యీకోరిక మరల నీకుఁ బుట్టకుండఁ జేయఁజాలుదు.

కీచ:—ఎప్పు డట్టి శాశ్వతానందము నొసఁగూర్చు కాలము వచ్చును.

సైర:—అంతత్వరగానున్న నీకఁ జెప్పెదవినుము నేఁటిరాత్రి సంధ్యాకాలమున నాట్యశాలకు రావలయును. ఎవ్వరును తోడ రాఁగూడదు. నిర్భయుఁడవై యొంటరిగ రాఁజనును. వేళ తప్పఁగూడదు. నేనటనుందును. చీఁకటిగానున్నను నటఁ బరుండిన దేహమును స్పృశింపుము ఆలింగ్యము చక్కఁగా సాగఁగలదు. ఇదిదేవరహస్యము నామాటలలో నొక యక్షరమునంత దప్పకుండ నిర్వహింపుము నీదేహమున కింతకన్నఁ దుమ్ముబోవని నూతనసుఖము నీకట సంభవింపఁగలదు ఎవ్వరికి నీవిషయము తెలియనీయఁగూడదు. తెలిసినచో నీకా సుఖ మలవడదు నిక్కముగా నిమ్ము చేసెదనని చెప్పెదను. ఇఁక నింకరాదు రాను. ఎవరైన జూచిరా కార్యము సమకూరదు.

కీచ:—(ఆనందముతో) సైరంధ్రీ! నేఁటికిం గృతార్థుఁడనైతిని. ఇంతనాఁట నిన్న నే చెప్పికొన్నచో గాదన్నయేమో నాకోరిక. తీరకుండినను ఒక్కమాటయైనం దప్పక నిర్వహించెద. త్రిశృంగ సమ్మతము. పూవులు పండ్లు పరిమళగంధనము మేలైనయాంబరంబులు తేనుజయియుం.

సైరం:—అవ్వి లేకున్న నేమి? నాకోరిక యుం దిక్కోవయెద. నీకోరిక యు నెఱవేఱును. తరువాత నీయిష్టము ఇఁక నేను సేయునది యేమ్ము ఇట నుండరాదు. ఎవ్వరెవ్వరో వచ్చుచుం బోవుచుందురు. ఎవరు చూచినను విన్నను మనప్రయత్నమున కంతరాయము గల్గును కార్యమునాయము నెఱవేఱును గాని జంపుగాను అంతయేల? నీ సొంతురమున కన్న నాయీ ప్రయత్నము గొప్పది. నీకెంత కుతూహలమో నాకు దానికన్న వేయిరెట్లెక్కువ శ్రద్ధగలదు. మనలకు నెవరికిం దెలియనీక చక్కఁగాఁ గూడ్చు నీమోహమున నీకమరలోకభోగము లబ్బును జుమీ. నిక్కమీమాట ఇఁకఁ బోయిరమ్ము.

(అని యిరువురు నిష్క్రమింతురు).

(ఇది పంచమాంకము.)

షష్ఠాంకము.

[పిదప నింద్రుని పనుపునఁ బ్రహాసనవిహాసనులను నిరువురు దేవదూతలు మానుషరూపములఁ బ్రవేశింతురు.]

ప్రథముఁడు:—మిత్రమా! మన మీవిరాటపురమున మూఁడు దినము లుంటిమి. ఇంద్రునియానతి జనదాఁటక యొనరించితిమి. వచ్చినపని యైనట్లే తలంపవచ్చు.

ద్వితీ:—సఖా! కలిసి తిరిగియున్న బాగుండును. వేఱువేఱ మనము చరించితిమి. కావున నాకేసంగతి తెలియరాలేదు. నీకుఁ దెలిసిన విషయమును జెప్పుము.

ప్రథ:—విహాసనా! నీవు చూచిన దేమియు లేదా. పాండవుల వార్తల నెఱింగితిని జుమీ.

ద్వితీ:—ప్రహాసనా! ఆవార్తలం జెప్పుమా విన వేడుక యగుచున్నయది.

ప్రథ:—నిన్న రాత్రి జరగిన విషయ మత్యద్భుతము. వింటివా లేదా.

ద్వితీ:—నే నేమియు వినలేదు. ఆవార్తలఁ జెప్పుమా.

ప్రథ:—విరాటుని బావమఱంది కీచకుఁడని వినియున్నావా, అదియును లేదా.

ద్వితీ:—వినియున్నాను అయిన వాని విషయమేమి!

ప్రథ:—ఆకీచకుఁడు మనకంటె ముందు స్వర్గమునకుఁ బోయి యున్నాఁడు.

ద్వితీ:—(ఆశ్చర్యముతో) ఆ! వాఁడు సింహబలుఁడు కదా. వాని నెవరు చంపిరి. లేదా రోగమునఁ జచ్చెనా.

ప్రథ:—మనోరోగపీడితుఁడై యొకరి చేత దిక్కులేని చావునఁ జచ్చినాఁడు.

ద్వితీ:—అంతటి బలశాలి యెవఁడు?

ప్రథ:—అరాతిప్రమథనప్రచండదోర్దండుఁ డగు మరున్నందనుం డాతని రాత్రి నొక్కనిం జంపెను.

ద్వితీ:—(ముక్కుపై వ్రేలు నిడుకొని) ఆ! భీముఁడే యాతనిం జంపెనా? ఎట్లు?

ప్రథ:—వినుము. సైరంధ్రిని కీచకుఁడు కోరఁగా నామె యిది యుక్తము కాదని యెన్ని విధముల హిత ముపదేశించినను వినక పోవుటచే నామె యెట్లో తప్పించుకొని భీమున కావార్తం దెల్పెను భీముఁ డందుల కవార్యక్రోధోద్దీపితుఁడై సైరంధ్రి భీతిమాన్పి రేపు మరల వాఁడు నీచెంత కరుదెంచెనేని నర్తనశాలకు రాత్రి రెండవజామున రమ్మని చెప్పి పంపి యావార్తను దనకుం దెల్పుమని పంప

సైరంధ్రి యట్లే తెల్పెను. భీముఁడు తాను స్త్రీవేషమును ధరించినట్లు నర్తనశాలం ప్రవేశించి సైరంధ్రి నొకచో నునిచి వేచియుండు నంతలోఁ గీచకుఁడు కామోద్రేకమున సంకేతానుసార మొంటిగానచ్చి యందు శయనించినది సైరంధ్రిగా భావించి చెంతకేగి యేమో మాటలాడుచుండఁగా భీముఁడు వాని నశక్తుంగా భావించి ముష్టి జానుఘాతంబులం బిండిసేసెను. ఇదియు కీచకుని వృత్తాంతము.

ద్వితీ:—ప్రహసనా! కీచకునకు సోదరులు పెక్కుమంది గలరని వినియున్నవారము కదా. వారనంతర మేమిచేసిరి?

ప్రథ:—దొమ్మియుద్ధము సాగుచుండ నా దెబ్బ డొల్లోగ్రహించి వారు కీచకుని మోచికొని సైరంధ్రిని గూడ మోచికొని శ్మశానమునకుం బోవ భీమసేనుం డావిధ మెఱింగి యందుఁ జేరి యొక్కఁడైన జీవింపకుండ మృతిఁబొందించి వచ్చెను.

ద్వితీ:—అక్కటా! పాండవులకు మరల నరణ్యవాసము ప్రాప్తించినట్లే కదా.

ప్రథ:—అట్లుకాదు. కీచకుని జంపినది గంధర్వులనియే యందఱతాత్పర్యము. కాఁబట్టి పాండవుల కీకష్టములు రాఁజాలవు.

ద్వితీ:—మన మీవార్తల నింద్రునకుం దెల్పవలయుఁగదా. మాటల సందడిలో జాగు సేసితిమి? పోదము రా.

(అని యిరువురు నిష్క్రమింతురు.)

[సుమతి లోనగువారు దుర్యోధనుసభను ప్రవేశించుచున్నారు]

చారులు:—జయము జయము మహారాజుగారికి.

కర్ణుఁడు:—ఏమి శుభవార్తలు తెచ్చితిరి?

సుమతి:—మా ప్రభ్వాజ్ఞ నిర్వహింపవలెను పెక్కుపాట్లు పడితిమి. తిరుగ శక్యముగాని తావులను గూడ సంచరించి పరికించితిమి. అంతు నందున ననేక సకల స్థలములయందును వెదకితిమి. ఎందైనను వారిజాడ కొంచెమైనను గానరాలేదు. ద్వారకనుండి కృష్ణునిపంపున నొకవిప్రుఁడు వారిజాడ లరయ వచ్చియుండుట మత్స్యనగరంబునం జూచితిమి. అతఁడును మావలెనే మోము వ్రేలవైచుకొని పోయినాఁడు

కర్ణుఁడు:—ఇప్పుడు మీ తాత్పర్యము పాండవులీభూమియందే లేరనియే కదా.

సుమతి:—సత్యముగా నదియే. లేకున్న సకలమార్గములను బన్ని పరీక్షించినఁ గానరాకుందురా వారెన్నఁడో మృతినొంది యుందురు.

కర్ణుఁడు:—ఎందుఁగాని విచిత్రవృత్తాంతము మీకు వినఁబడలేదు కదా.

సుమతి:—(ఆలోచించి) అంగరాజా! విరటునగరంబున నొక్క విచిత్రవార్త వినవచ్చి

నది. సైరంధ్రి యను నొక తరుణిని కీచకుఁడు మోహింప నొకరాత్రి యాతని సోదరయుతముగ గంధర్వు లేవురు చంపినారఁట. కీచకుఁడు సోదరులతో మడియుట మాత్రము నిశ్చయము. పట్టణమంతయుఁ బురపుర పొక్కుచున్నయది.

శకు:—మహారాజా! గంధర్వు లేవురనఁగాఁ బాండవులే. సైరంధ్రి యనఁగా ద్రౌపదియే. ఒరులు కీచకునిం జంప నోపుదురే.

దుర్యో:—కీచకుఁ డుండుటంబట్టియే విరాటుఁ డొక ప్రభువుగా నిర్భయముగ నుండినాఁడు. కీచకుఁడే పోయిన నిఁక నతనికి రాజ్యము పోయినట్లే.

కర్ణు:—మహాప్రభూ! నిస్సంశయముగఁ బాండవు లం దుందురు. సకలసస్యపరిపూర్ణమై యారాజ్య మలరుచుండుట విన్నారము కదా. ధర్మజుఁ డున్నచోటఁ బాడిపంటలు చక్కఁగా నుండునని భీష్మద్రోణులు చెప్పియుండిరి. విశేషించి యీసంవత్సరమున విరాటునిపాలి గోధనము గలదని వినియున్నాము కదా. కాఁబట్టి యందే యుందురు.

సుశర్మ:—మహీపాలకా! నేఁటికి నా మనోరథము పండినది. కొంతకాలమునకు ముందుఁ గేకయసాళ్వరాజులతోఁ గీచకుండు నన్ను సంగరమున నోడించినాఁడు. వాఁడు ప్రాణములతో నుండుతఱి మరల యుద్ధము పొసఁగక పోయెను. ఇపుడు సమయము దొరకినది. నాకనుజ్ఞ యిచ్చిన నాబలంబులం గూడి పోయి యాతని గోధనంబుల ముట్టి తెచ్చెద.

శకు:—ఈమాట పొసఁగి యున్నది. సుశర్మ దక్షిణదిక్కున ముట్టడించినఁ బాండవు లప్పురి నున్నవారగుట నారాజునకుం దోడు వత్తురు.

దుర్యో:—సుశర్మ దక్షిణభాగము ముట్టడించును. ఆమఱునాఁడే మన ముత్తరమున వ్యాపించి యమూల్యగోధనము బట్టుదము. పాండవులుండిరా వత్తురు. లేకయుండిరా గోధనలాభము కలుగును. ఇఁక వేగమె సుశర్మ బలములతోఁ బోవలయును. మనము సైనికులఁ బిలిపించి కట్టాయిత్తంబై యుండవలయు నని తెల్పవలయు.

శకు:—చాల మంచి యూహ యిది. ప్రశస్తముగ నున్నది. పాండవులు జీవించియే యుండిరేని విరాటునకు సాయముగా వత్తురు భూలోకమును వదలి యున్నచో నమూల్య గోలాభము కలుగు. కీచకుఁడు లేఁడుగాన నాతనిని జయించుట సుకరమై యుండు.

దుశ్శా:—సేనాధిపతు లందఱును తమతమ సైన్యములఁ గట్టాయిత్తంబై యుండ నాజ్ఞాపింతురుగాక. రాజశాసనమని తెల్పుదురుగాక. రేపే సుశర్మ పయనమై విరాటుని

పురంబును దక్షిణభాగంబు నరికట్టి యుద్ధము చేయును గాక. అందుఁ బాండవుల చొప్పరయుచుండును గాక. ఎల్లుండియే మనము సకలవాహినీపరివృతులమై యుత్తరభాగంబున నిలిచి గోధనమును మరలింతుము. పాండవులజాడ తెలియక పోదు.

దుర్యో:—

తే. జాగరూకులుగా మీరు సకలకృత్య
ములను నడిపింపుఁ డీ పెద్ద కలహమైన
నెట్లు కురుస్థిరో సేనలు నట్లు గూర్చి
పయనమొప్పంగఁ జేయుఁ డీ పట్టనందె. 1

ఇంకఁ ద్వరపడుఁడు. సర్వసన్నాహంబు లొనరింపుఁడు. త్రోవలో నెట్టిసాకర్యము లుండవలయునో యేమఱక వానిఁ గనుఁగొనుటకు గొందఱ నియమింపుఁడు.

(అని యందఱు నిష్క్రమింతురు)

(పిదప సైరంధ్రియు బృహన్నలయు ప్రవేశించుచున్నారు)

బృహ— 1పాంచాలరాజనందనా! శత్రుమృతిచే నీమనశ్చింత పోయినదిక దా. నీకష్టములు గట్టెక్కినవి. ఇఁకఁ ద్వరలో శత్రువుల జయించి ధర్మజుఁడు పట్టాభిషిక్తుఁడు కాఁగలఁడు. అప్పుడు మిగిలిన నీకోరికలన్నియుఁ దీరును గాక.

సైరం— 2మీవంటి దేవాంశసంభూతులు గలుండఁగా నాకు నింకేమని కోర్కులుండును? శత్రుక్షయమాయె. సంతోషార్హము లభించెను. గౌరవము నిలుపుకొనఁ గలిగితి.

బృహ:—3దక్షిణదిక్కును సుశర్మ ముట్టడించెను. ధర్మజాదులు సహాయమేగిరి. జయము విరటునకు గల్గుట కేమి సంశయము? మన కష్టదినములు గడచినవి. మన మిట భయములేక మాటలాడుచుండుటయు మనశ్చింతలు తొలఁగుటకు దృష్టాంతము.

సైరం:—దుర్దినములు గడచినవి. దిక్కులు స్వచ్ఛము లగుచున్నట్లే మనమనస్సులు నిర్మలము లగుచున్నయవి. ఇఁక నీబాహుసారము త్రిజగద్విఖ్యాతము చేయుటకుఁ దగిన సమయము మరుచెంచుచున్నది.

బృహ:—(కుడిబుజ మెగురుటఁ బరికించి) పాంచాలీ కుడిబుజ మేలాకో యదరుచున్నది. యుద్ధమాసన్నమగునపుడు తోఁచులక్షణములు నాకుం బొడకట్టుచున్నయవి.

---

1 లబ్ధప్రశమన మగుట నిది కృతి.

2 మానాద్యాప్తిరూప మగుట నిది భాషణము.

3 కార్యదర్శన మగుట నిది పూర్వభావము.

(కేకలు వినఁబడఁగా నాలించి) వీథిలో నేమో కోలాహలశబ్దము కలుగుచున్నది. కారణమేమో (చక్కఁగా నాలకించి) ఉత్తరభాగమును గురురాజు సైన్యముతో ముట్టడించెనఁట. పాంచాలీ! యుద్ధ మాసన్నమైనది. పురమున వీరు లెవ్వరునులేరు.

సైరం:—ఇంద్రనందనా! ఉత్తరకుమారుఁ డున్నవాఁడు. ఈవార్త విని యతఁ డేమి చేయునో తెలిసికొని వచ్చెద. సారథ్యమునకు నీపేరు చెప్పెద. సంగరరంగము చూడఁగనే మీరిద్దఱు అధికారముల మార్చుకొనఁ గలరు. ఇదె పోయి వచ్చెద.

(అని నిష్క్రమించును)

[తరువాత నుత్తరుఁడు మిత్రులతోఁ బ్రవేశించుచున్నాఁడు.]

ఉత్త:—సఖా! మాతండ్రిగారు సుశర్మ నోడింపఁ బోవుట సంతోషమేగాని కంకుఁడు వలలుఁడు, దామగ్రంథియుఁ, దంత్రీపాలుఁడు యుద్ధమునకుఁ దోడుగాఁ బోవుటయు, వీరిరాకకుఁ దండ్రిగారు సమ్మతించుటయు నాకంతగా సరిపడ లేదు సుమా.

సురుచి:—రాజకుమారరత్నమా! ఏలినవారికి వీరిసహాయ మవసరమే లేదు. కాలక్షేపమున కెప్పుడు చెంతనుండుట ధర్మరాజును, బాహుయుద్ధమున మల్లర నోడించి యుండుట వలలుని, అశ్వహయాధ్యక్షులగు దామగ్రంథి తంత్రీపాలు రిద్దఱు మిగుల రూపవంతులై శౌర్యధుర్యులుగాఁ దోఁచుచుండుట వారలను బిలుచుకొని పోయి యుందురని తోఁచెడు.

ఉత్త:—నీవు చెప్పినమాట బాగున్నది. కాని వీరి సాయము లేకున్న జయము చేకూర దనియా.

సురుచి:—కాదు కాదు. ఆప్రయాణకాలమునను వారు మేము వత్తుమని ప్రార్థించి యుందురు గాన నంగీకరించి యుందురే కాని వేఱుగాదు.

ఉత్త:—(కొంచెము చెవి యొగ్గివిని) ఆ! ఏ కూకలకలము? ఏ మూమాటలు?

(దూతలు ప్రవేశించుచున్నారు)

దూత:—(వగర్చుచు) మహారాజకుమారకా! కౌరవసైన్యములు ధేనువుల నావరించి పాలకులం దోలి వానిని గొని పోవుచున్నారు. పరుగున వచ్చితిమి. తర్వాత దేవరచిత్తము.

ఉత్త:—(ముక్కు మీఁద వ్రేలుంచి) ఆ! కౌరవసేనలు మనధేనువుల ముట్టడించినారా.

దూత:—ముట్టడించుటే కాదు. తోలుకొని పోవుచున్నారు.

ఉత్త:—గోరక్షకు లేమైరి. వచ్చినారా.

దూత:—కౌరవసేనల ముందఱ మన ధేనుపాలకు లేపాటి వీరులు?

ఉత్త:—కౌరవులకు మనవారు చాలరా. వారేమి మహాశూరులని మీతాత్పర్యము.

దూత:—సకలాయుధ ధారులై వచ్చిన శూరులకు మనధేనుపాలకులకు నెంత యంతరంబు? వారిని దేరిచూడఁగనైన మనవారికి శక్యమా మహాప్రభూ!

ఉత్త:—ఇస్సీ! నీ! నాపేరు చెప్పిన వారు పాఱిపోదురే. అంత మాత్రము దోఁచక పోయినదా.

దూత:—యువరాజా! వారిరాక పెద్దయెత్తుగాఁ గనఁబడుచున్నది. సామాన్యప్రయత్నము గాదు. కావున గోపాలకుల కది శక్యము గాదు.

ఉత్త:—(కన్నులెఱ్ఱచేసి) ఏమీ! వారి బలమెంత? వారి పరాక్రమ మెంత? వారి ప్రయత్నమెంత? వారి నెదిరించుటకు గొప్ప ప్రయత్నము కావలయునా. ఏమి తెలివితక్కువగా మాట లాడుచున్నారు.

దూత:—నిశ్చయముగా మేమెల్ల భయార్తుల మైతిమి. ఇంకను గాళ్లు వడఁకు చున్నయవి. ఆచతురంగబలములఁ జూచిన మాబోంట్లు నిలువఁ గలరా. ఏలినవారి పాదముల చెంతకువచ్చిన తర్వాత నిపుడు భీతి కొంచెము తగ్గుచున్నది ఇపుడైనను ఆసేనలఁ దలంచుకొంటిమా, (అబ్బా యని మూర్ఛిల్లుదురు).

ఉత్త:—(చిఱునవ్వుతో) సఖా! నిశ్చయముగా మీరు భయపడినారు. పిత్తశీతము వీరి నింకను బాధించుచున్నది. నడుము కట్టవలసిన కాలమిది. ఇంకఁ దడవు సేయరాదు.

(ఇంతలో ఉత్తర ప్రవేశించుచున్నది.)

ఉత్తర:—అన్నగారూ! మనగోధనమును గౌరవులు అక్రమించిరని విన్నాను. నిశ్చయమేనా?

ఉత్త:—సోదరీమణీ! నిశ్చయమే నఁట. ఇపుడే దూత లీవార్తను దెల్పుచున్నారు:

ఉత్తర:—ముందు గతి యేమి?

ఉత్త:—ఏమి భయపడినట్లు మాటలాడెదవు? క్షణమాత్రమున వారల యమపురమునకుం బంపి గోవుల మరలింపనా.

ఉత్తర:—ఇఁక నాలస్యమేల?

ఉత్త:—సారథి కొఱకు నాలోచించు చున్నవాఁడ. తగిన సారథిలభించెనా (పండ్లు పటపటలాడించి) చిటికెలోఁ గౌరవుల నేమి చేసెదనో.

ఉత్తర:—పూర్వపుసారథి యేమాయెను?

ఉత్త:—పూర్వముండినఁ గదా రేపూరాయునని యడుగవలయు. యుద్ధమునకుఁ బోవ లసిన యవసరమే మనవగరమున నెవ్వరికిని కలుగ లేదే. మనము చచ్చుటయుఁ నిపుడు యుద్ధమను మాట వినుటయు సంభవించినవి.

ఉత్తర:—ఒక్క మాట చెప్పెద. ఆలకించిన మేలు.

ఉత్త:—ఏమామాట.

౧౪ పాట.

ఉత్తర:—బృహన్నల సారథ్యమున మిగుల నేర్పరియని సైరంధ్రి ప్రస్తావవశమునఁ దెలుపఁగా విన్నదాన. ఖాండవదహనము మొదలగు కార్యములయం దర్జునునకు బృహన్నల చాల సాయమొనరించి గెలిపించెననియు విన్నదాన. మీరంగీకరించిన జయము తప్పక గల్గును.

ఉత్త:—(సిగ్గుపాటును గడించి) అయ్యో! పేడిని జూడనని నిశ్చయించుకొని యుంటిని గదా. రథమున నాకు ముందుఁ గూరుచుండ నేనెట్లు చూతును?

చ. కురుబల మేఁగుదెంచి మన ♦ గోవుల నొల్చిని బట్టెనంట నే
నరిగి యరాతిసైన్యముల ♦ నార్చిని ముంపఁగఁ బోదునంట నా
యరదముఁ దోలు నాతఁడు బృ ♦ హన్నలయే యగు నేని నవ్వరే
పురజను లొక్క సారథియుఁ ♦ బుట్టఁడొకో మన పీట నక్కటా. 2

ఉత్త:—(వినయము తోఁప).

చ. జగముల మూఁడు నొక్క తటి ♦ సత్త్వముఁ జూపఁగ నెత్తి వచ్చినన్
జగడమునన్ బృహన్నలయె ♦ స్యందనమందుఁ జెలంగు నేని గె
ల్వఁగఁ దగు నంచు నింటి మును ♦ ప్రాకృత కర్మఫలాంగ సంయుతిం
డగినదియౌ వికారమును ♦ దాల్చిన మాత్రనె పెంపు దప్పునే. 3

ఉత్త:—(శిరఃకంపమొనర్చి) వరే. సారథి వేఱొకండు లేఁడు గాన నంగీకరించితి. నీకు విద్యాగురువు గాన బృహన్నలం బిల్వఁ బంపుము.

ఉత్త:—నేనే పిల్చుకొని వచ్చెద.

(అని నిష్క్రమించి బృహన్నలతో వచ్చును)

ఉత్తర:—అన్నా! బృహన్నల సారథ్యమును జేయ నంగీకరించెను. నీవిఁక సంగరరంగమున జయము గొందుట యబ్బురము కాదు.

బృహ:—(వినయమ్ముతో నిలుచుండియుండును)

ఉత్త:—బృహన్నలా! ఖాండవదహనంబు చేయుతఱి నర్జునునకు నీవు సారథివై జయము చేకూర్చినట్లు నాకు సారథివై గెల్పు నాకుం గల్గింపుము. వేఱొకమాట యనకుము.

బృహ:—యువరాజా! నాట్యవిద్య నేర్పుచుంటిని. పూర్వపుఁ జాతుర్య మిప్పు డుండునో లేదో అయినను నేర్పుకొలఁది మీకుఁ దోడుపడియెద. కౌరవసైన్యముల గెల్చుటొక గొప్పకార్యమా.

౧౫ పాట.

ఉత్త:—ఇప్పటి కదియే గొప్పకార్యమని భావింపవలయు. రథము సిద్ధపఱుపుము. ఆలస్యము చేసిన గోవులు దొరకు టరిది.

బృహ:—(చిటికెలో రథము సిద్ధముచేసి) యువరాజా తేరెక్కుము.

ఉత్త:—(అరదమునుం జూచి) ఆహా! సకలపరికరములు సిద్ధముచేయఁబడి యున్నవి. గెల్పుగల్గుట నిస్సంశయము. (రథ మెక్కఁబోవును)

ఉత్త:—అన్నా! కౌరవులను గెల్చి వారివస్త్రములలో వివిధవర్ణములు గలవి బొమ్మపొత్తికలకుం దేవలయు.

బృహ:—కన్యకామణీ! ఈకార్యము నాతోఁ జెప్పఁదగినది. జయమంది తప్పక నేఁ దెచ్చి నీకిచ్చెద. సంశయ మొందకు.

ఉత్త:—(రథ మెక్కి) సోదరీ! ఇదె విజయంబు పొంది వచ్చెద. నిశ్చింతవై యుండుము.

బృహ:—(రథము గడపుచు? పురముదాఁటి యరదము కొంతదవ్వు పోవును)

ఉత్త:—(రథవేగమును బరికించి ఆశ్చర్యముతోఁ దనలో) ఆహా! ఏమి సారథ్యము. మిక్కిలి యచ్చెరువుగా నున్నది. అర్జునునకు సారథి యీతఁడని సోదరీమణి చెప్పె. నిశ్చయమే. లేకున్న నిట్టి చమత్కృతి యెట్లు కల్గును. సెబాసు! జయము నాకింకఁ గరతలామలకమే. (ప్రకాశము) బృహన్నలా! రథవేగము సంతోషదాయకముగా నున్నది. గెలుపుకూడ సిద్ధమనియే తోఁచుచున్నది.

బృహ:— యువరాజా ధీరుండవు నీవు రథికుఁడవై నిలిచిన జయమున కొక సందియమా.

ఉత్త:—రథికుఁడవై నిల్చిన అంటివి. ఏమి దీనిభావము.

బృహ:—(సంతోషముతో) రాజకుమారా! మఱేమియుఁ గాదు. ప్రతాప మీవఱకెన్నఁడు చూపిన వాఁడఁ గానని యన్నట్లు వినియున్నవాఁడఁ గావున ఘోర సంగ్రామరంగంబున విసుగు చెందక నిల్చిన జయమున కేమి శంక యంటిని.

ఉత్త:—కౌరవులఁ జూచియే భయపడుదు ననుకొంటివా. దేవదానవు లొక్కటియై యెత్తివచ్చినను జంకను జుమీ. ముందు నీవే నాశక్తిని జూతువు గదా.

బృహ:—(చిఱునవ్వుతో) సంతోషము. సంతోషము. నేనే చూడఁ గలను. శరాసనమును సజ్యము గావించి శరంబులం గూర్చి యుంచుము. సంగర మాసన్నముగ నున్నదికదా.

ఉత్త:—సంగరమే కల్గునో నారాఁ గాంచి గోవుల విడిచి కౌరవులు పరుగెత్తిపోవుదురో మనమిప్పు డెట్లు నిశ్చయింపఁ గలము ?

బృహ:—సంగరము సంఘటిల్లునని యీ శకునములు చెప్పుచున్నవి.

ఉత్త:—బృహన్నలా ! అరదము త్వరగా నడపుము. ముందు గోధనమును మరలింప వలయును.

బృహ:—శూరాగ్రణీ ! యిదే రథము నడపుచున్నవాఁడ.

ఉత్త:—(దృష్టిసారించి) సారథీ ! మనము చాలదూరము వచ్చితిమి కదా.

బృహ:—చాలదూరమా. ఇది. అదిగో మనపురము చెంతనే యున్నదే.

ఉత్త:—బృహన్నలా ! భూమ్యాకాశములకు నిడుము లేకుండ గోడ పెట్టిన ట్లున్నదే. ఏమది ?

బృహ:—మహారాజకుమారా ! అది గోధనము ముందిడుకొని పోవుచున్న కౌరవబలము. గోవుల పాదధూళియు, సైనికుల పదధూళియు నట్లగపడుచున్నది.

ఉత్త:—(తడఁబడు మాటలతో) అదిధూళియా. ఏదో యొకయాకార మనుకొంటిని. సరే. దాని చెంతనే పర్వతములపిండువలె నగపడుచున్నవే. వాని వృత్తాంతమేమి ?

బృహ:—(ఆత్మగతము) అప్పుడే యీతఁడు దిగులు పడినట్లు తోఁచుచున్నది. ముందేమి చేయునో. (ప్రకాశము) శూరశిఖామణీ ! అవి మత్తమాతంగంబులు గాని కొండల పిండువులు కావు. వాని జోలి మనకేల ?

ఉత్త:—అవి యేల పోవుచున్నవి ?

బృహ:—చతురంగబలము అనఁగా కరిహయ రథపదాతులని గదా యర్థము. యుద్ధమునకు సిద్ధపడుము.

ఉత్త:—బృహన్నలా ! అవెవ్వని క్రొక్కారు మెఱుపులవలెఁ దళతళ లాడుచున్నవే. చూడుము. వాని విషయమేమి ?

బృహ:—అవియే దుర్వారగర్వాంధులగు కౌరవవీరభట సముద్భట శస్త్రాస్త్రముల నిగనిగలు వాని వర్ణన మిప్పుడేల ? ఏమి భయపడినట్లు మాటలాడెదవు !

ఉత్త:—భయమా ! ఎవరికి ? క్రొత్తగా నున్న నడిగితిని.

బృహ:—(రథము నడపుచుండును)

ఉత్త:—సారథీ ! అరదమును వేగముగా నడపకుమా మెల్లగా నడపుము

బృహ:—కాలక్షేపము చేసితిమేని గోధనము మనకు దక్కునా.

ఉత్త:—గోధనము పోదులే. ముందు వెనుక లాలోచింపుకొనవలదా.

బృహ:—ఆలోచించియే వచ్చితిమి. ఇపు డాలోచింపఁ దగిన దెవ్వరెవ్వరి నెట్లెట్లు జయింతమనియే కదా.

ఉత్త:—ఏమి బృహన్నలా! నామాట దాఁటి త్వరగా రథము తోలుచున్నావే? కొంచెము నిల్పుము.

బృహ:— యుద్ధము కాఁబోవు తఱి రథము నిలుపుట సారథికిఁ దగిన పని కాదు.

ఉత్త:—సారథీ! రథికుఁడు చెప్పినట్లు చేయుట కదా సారథిపని?

బృహ:—నిశ్చయమే కాని తడవు సేసిన వైరులు దూర మరుగుదురు. కార్యము చెడును.

ఉత్త:—అంత పోయిన పోనీ! పరుగెత్తు వారిని దఱుముకొని పోవుట వీరధర్మమా.

బృహ:—యుద్ధము చేసి గోవుల మరలించిన తర్వాత వారు సంగరము చేయఁజాలక పరుగిడు తఱి వెను దగులరాదు అమాట లిప్పుడేనా.

ఉత్త:—పరుగెత్తినట్లే యనుకొందము. ధీరులైన మనలఁ జూచి నిలువఁబడకుందురా.

బృహ:—అనుకొందమనుట పాడియా. గోధనము మరలించిన తర్వాతఁ జెప్పఁ దగు మాట లిప్పుడే ఏల?

ఉత్త:—(ముందు చూచి) బృహన్నలా! రథము నిల్పుము. పొడవుగా నెగురుచున్నట్లున్నవే వాని వార్తయేమి?

బృహ:—అవియే కేతనపటములు, అవి శూరులగు ధార్తరాష్ట్రుల బిరుదములు. వానిం బడఁ గొట్టి జయమందుము.

ఉత్త:—ధార్తరాష్ట్రులంటివే. అదేమి? వచ్చిన వారు సైనికులు కదా.

బృహ:—నిశ్చయమే. సైనికులును రథికులును వచ్చియుందురు.

ఉత్త:—సారథీ! మాటల సందడిలో రథము గడపుచున్నావేల? నిల్పుము.

బృహ:—ఎందులకు?

ఉత్త:—ఏతట్టు చూచినను నాకనేక దుశ్శకునము లగుచున్నవి. అంతియకాక వచ్చుతఱి మాతల్లిగారికి నమస్కరించి యాశీర్వాదము లంది రాలేదు. కాన మరల నింటి వఱకుఁ బోయివత్తము.

బృహ:—రథమును మరలించిన నవ్వరా. అది మగతనమా? ధీరులు మెత్తురా?

ఉత్త:—సారథీ! సేరు రాజునకు మఱుగుబం టన్నమాట నిశ్చయమైన ట్లున్నదే. నామాట కాదు రాఁడెదవేల! రథము నిల్పుము. అవసరపడక యాలోచింపుకొనవలదా.

బృహ.—సారథికృత్య మిట్టి మహాసాహసమయమునఁ గాలము వ్యర్థచేయక యరినికరములఁ గెల్చునట్లు రథము గడపుట. కాఁబట్టి నాకృత్యమును జక్కఁగాఁ జేయుచున్నాఁడను.

ఉత్త:—(పెదవులు తడపుచు) బృహన్నలా. చీమల పుట్టలు పగిలినట్లు, నేల యీనినట్లు సందు లేక గుఱుతింప నలవిగాక పోవుచున్నదే. అదేదో?

బృహ:—వారే దుర్యోధనుని సైనికవీరులు.

౧౬ పాట

ఉత్త:—(చక్కఁగాఁ జూచి వడఁకుచు) సారథీ' రథము క్షణము నిల్పుమా. మఱింత దగ్గరకు నడుపకుము. వారికిఁ జాలదూరముననే నిల్పుము

బృహ:—రాజకుమారా. ఈమాటలతోనే కాలము గడచుచున్నదే. ఎప్పుడు గోవుల మరలింత మనుకొనుచున్నావు.

ఉత్త:—(కంపముతో) గోవులమాట యెవరికిఁ గావలెనయ్యా'

బృహ:—మనము వచ్చిన దెందులకు?

ఉత్త:—వచ్చినదా. ఇచ్చటి విషయములు చూచి పోయి తగుసన్నాహముతో మరల వచ్చుటకు.

బృహ:—అంతదనుక గోవు లిందుండునా?

ఉత్త:—ఆవిషయము నీకెందుకయ్యా. ఉడుతకు ఊరిలోని పెత్తన మేల యన్నట్లు సారథి కేలయ్యా యీప్రసంగము.

బృహ:—సారథిని మాత్రమే గాక నిన్ను గెలిపింతు నంటినే. అందుల కీప్రసంగములఁ జేయుచున్నవాఁడ. నలుగురి ముందఱఁ బౌరుషములు పలికి కార్యముతటిమగటిమిఁ జూపకున్న క్షత్రియవీరులు నిందింతురు. నవ్వుదురు. ఏవగింతురు.

ఉత్త:—బృహన్నలా' ఇతరు లేమనుకొందురో యని యగ్గిలో దుముకుదురా. ఏటిలోఁ బడుదురా.

బృహ:—అంతటి పని యిపు డేమి వచ్చినది(అని నవ్వును)

ఉత్త:—నీనవ్వు నష్టమైపోని' మీఁది ప్రాణములు మీఁదికే పోవుచుండఁగా నన్నుఁ జూచి నవ్వుచున్నావేమి బృహన్నలా? కపటాత్మకా.

చ. అకటగు ధార్తరాష్ట్రులు మహాకపటాత్ముని నిన్నుఁ బంపి మా
పురమునఁ గల్గు వార్తలను బూసలఁ గూర్చిన రీతిఁ దెల్పి భూ
వరునిఁ దదీయపుత్త్రకు నెపంబున నూరు వెడల్చి తెమ్ము స
త్వరముగ నంచుఁ బంపిరొ కాక తత్త్వము తెల్పుమ నీకు మ్రొక్కెదన్.

బృహ:—రాజకుమారకా! ఇది హాస్యము చేయుటకు సమయము గాదు. విల్లంది భూరి పరాక్రమము చూపుట కిది యదను.

ఉత్త:—నామాటలు హాస్యోక్తులా. ఏమి బృహన్నలా! ఇంత మోసము చేసితివి? ముసిముసి నవ్వులతోనే నాకొంప ముంప నున్నావే. మాతండ్రికి గారాబు నూనుఁడ నయ్యా? ప్రాణదానము చేయుము. నీమేలు జన్మాంతరమునందుఁ గూడ మఱువను. నా తల్లి తోడు. నమ్ముము.

బృహ:—యువరాజా! భయపడినట్లు నటించి నా తెలివితేటలు పరీక్షించుచున్నారా యేమి? లేకున్నఁ బురమునఁ బల్కిన పలుకు లేమి? ఇపుడు చేయుచున్న కార్యమేమి? సంబంధము లేదే. ఏల భయపడియెదవు. ధైర్యమూని నిశాతవిశిఖపరంపరలు ప్రయోగించి ధార్తరాష్ట్రుల యాటోపంబు మాన్చి గోవులతో నగరంబునకుం బోయి జననీజనకసోదరీమణులకుఁ బ్రియంబు చేయుమా. బృహన్నల సారథియై జయము సమకూర్చ నన్న పేరు నిల్పుమా. భయపడకుము. భయపడకుము.

(నేపథ్యమున శంఖారావములు)

ఉత్త:—(అదరిపడి) సారథీ! ఆధ్వాను లెచ్చటివి? ప్రళయకాలపర్జన్యగర్జారవంబులం బోలి గుండె లవియించుచున్నవే. (అని వడఁకును)

బృహ:—(నవ్వుచు) విరాటప్రియనందనా. ఆధ్వానులు వైరివీరులశంఖకాహళాది ధ్వానములు. ఇంతమాత్రమునకే భీతిల్లిన శత్రులు చుట్టుముట్టినతఱి, నిశాతసాయకాసారము పైఁబడు సమయమున, శూలముసలపరశుపట్టిసాదినానావిధ భీకరాయుధముల పోటులు శరీరమునఁ నాటుకాలంబున నెట్లు ధీరుఁడవై నిలువఁగలవు?

ఉత్త:—సారథీ! నీకు వేయి కోట్ల నమస్కారము లర్పించెద. నిజము చెప్పెదవిను. గోమునఁ బెరిగిన వాఁడనే కాని బాణప్రయోగమున నొక్కపిట్టనైనను గొట్టినవాఁడను గాను. తెలియని వాఁడను. నన్నూరక యేల యేడిపించెదవు. నామాట విని యరదము వేవేగ మరలింపుము. ఊపిరియున్న నుప్పమ్ముకొని బ్రదుకవచ్చు. నాకోమలప్రాణముల నీభయంకరవైరి దుర్వారాస్త్రముల కర్పింపఁ జాల.

బృహ:—ఉత్తరకుమారా! ఊఱడిల్లు మూఱడిల్లుము. భయము వలదు. నేను నీనొగల నుండ భయమేమి? సురాసురులు నిన్నుఁ గన్నెత్తి చూడఁ గలరే. వినుము నామాట.

సీ. క్షత్రియకులమున • జనియించి భూపతి
తనయుండవై ప్రాయ • మునఁ జెలంగి
శస్త్రాస్త్రముఖబహు • సాధనముల నొప్పి
సంగ్రామ మొనరించు • చంద మెఱిఁగి
బాహుబలంబున • భాసిల్లి యుండఁగ
ముందఱఁ బౌరుష • ములు వచించి
వైరుల నని గెల్చి • వారి వస్త్రంబులు
తెచ్చి యిచ్చెద నని • నచ్చ బలికి
తే. యింత మాత్రంబె కాక న • న్నింతవాని
సారథిగ నొప్పుకొనఁ జేసి • యూరు దాఁటి
వచ్చి వైరులఁ గన్గొని • బెచ్చ వడుచు
మరలి పోయిన నవ్వరే • తరుణు లైన. 5

కావున రాజకుమారా! ఇంక లేనిపోని మాటలతోఁ గాలము బుచ్చక ధనుస్సును నవరించి నారి సారించి తీవ్రాస్త్రములం గూర్చి సమాహితుండ వగుము. (అని రథము గడపును).

ఉత్త:—బృహన్నలా! కొంగున నగ్గిని మూటఁ గట్టుకొన్నట్లు కొఱవితో నెత్తి గోకికొనునట్లు. నిన్నేల సారథిగాఁ దెచ్చుకొంటి నయ్యో! అయ్యో! క్షత్రియకులమఁట. రాజపుత్త్రుఁడ నఁట. పౌరుషమట. ప్రాణములం బోవుచున్నప్పు డాయీమాటలు. సారథీ! దానములలోఁ బ్రాణదాన మధికఫలప్రదము సుమీ. మున్నే పాప మొనరించితివో యీరూపము వచ్చినది. ఇపుడు నాయూపిరిఁ దీసితివా పైజన్మమున కింకేరూపము వచ్చునో.

బృహ:—ఈరూపము నాకెంత కాలముండునో ముందు నీకే తెలియఁగలదు. ఉత్తరకుమారా! ఏల నిందించుకొనియెదవు. నాకణుమాత్రము భయము గల్గునని తోఁచ లేదు. ధీరుండవు కమ్ము.

ఉత్త:—నీకేల భయము తోఁచును? నా ప్రాణములు పోఁగానే నిన్నెవ్వరేమనరు. పగవారికిఁ దొలికబళము నేనుగదా కావలయు. బృహన్నలా! ఒక్కమాట చెప్పెద. నీకేమైనఁ గావలసిన నిచ్చెద. నాయూపిరిని మాత్రము తీయు ప్రయత్నమును గావింపకుము.

బృహ:—నాకుఁ గావలసినది సంగ్రామరంగమున విజయము. వేఱొకటి వలదు వలదు.

(నేపథ్యమున భూరిధ్వని)

ఉత్త:—బృహన్నలా! అయ్యో! ధ్వనులు మాత్రమే కాక వీరభటులహుంకారములు వినఁబడుచున్నవే. సమీపమునకు రథము గడపితివే. ఇంకేమి గతి? అయ్యో తల్లీ! సుదేష్ణా! నీ కొడుకు ఇంక రాఁడని నిశ్చయించుకొమ్ము. బృహన్నల బలవంతముగఁ జంపించెనని యొక్కరేడు పేడ్చి యూరకుండుము. తండ్రీ! నిన్నుఁ జూచుప్రాప్తము నాకీజన్మమున లేదు. (సారథిం జూచి) బృహన్నలా! కడసారి చూపుగా నా ప్రియురాలి నొక్కసారి చూచివచ్చెద. అవల నీ కనీ తీరు నట్లు గొంతు కోయుమా. (అని యేడ్చును)

బృహ:—(గట్టిగా) ఏమి యుత్తరా! అసందర్భముగా మాటలాడుచున్నావు. ఇంటియొద్ద నేమని పల్కితివో స్మృతికిం దెచ్చుకొమ్ము. వినుమా నాయుపదేశము.

సీ. దుర్వారదోస్సార♦గర్వాంధులై విజ్జ
  వీఁగు వైరులఁజూచి♦వెగడు పడకు
క్రొక్కారుమెఱపుల♦నిక్కునుక్కడఁగించు
  శస్త్రాస్త్రరోచుల♦సరకుగొనకు
కొండలపిండు నా♦గండుమీఱిన దంతి
  బృంహితంబులకును♦భీతిఁగనకు
ప్రళయవాతోద్ధూత♦రజమునా రేఁగిన
  భటపదధూళికి♦భయముగనకు
రాజరత్నతనూభవ♦రమ్యతేజ
రాజవరు లెల్లఁ జౌకగ న♦రాతు లదర
ఘోరసంగ్రామ మొనరింపు♦వీరు లలరఁ
గాక యున్నను సత్కీర్తి♦గఁలుగు నెట్లు. 6

ఉత్త:—నీపౌరుషము నేలపాలు గాని కీర్తికాంత యేటఁబడి పోనీ: నన్నుఁ బ్రాణములతో విడువుమా. అంతచాలు నీయుపకారము. బృహన్నలా! ఇదె నమస్కరించుచున్నాఁడ. ఎవరేమే ననినిమ్ము. తలవంచుకొనియెద. వీర నామములలో నాపేరు లేక పోనిమ్ము. జనక నేమందును. సారథీ! ప్రాణములు తీపని మున్న చెప్పఁగా వినలేదా. నన్నుఁ బదికాలములు బ్రదుకనిమ్ము. అంత చాలును.

బృహ:—రాజకుమారా! ఏమి యీమాటలు? శూరుఁడు యుద్ధరంగమునఁ జెప్పవలసినదియా? శత్రువులు నిన్నుఁ జూచి సంగరమునకు సంసిద్ధులగుచుండ నీవిట్టి నీరసపుమాటలు పల్కుట న్యాయమా. తండ్రి తాతల గౌరవము నాలో

చింపుము. దేహమే స్థిరముగాదు. శాశ్వతకీర్తికి భంగము గలుగునట్లు జీవింప నేల? ఇఁక మాటలుచాలు. రణక్రియకుం బూనుము.

(నేపథ్యమున శంఖకాహళాదులధ్వని)

ఉత్త:—(మోము వెలవెలఁ బాఱి) బృహన్నలా! నాపాలిటికి నీవే యముఁడవు. ఇంకను యుద్ధము చేయుమన్నావే ప్రాణములు పోవుచున్నవని మొత్తుకొన్న నాల [illegible] అంపములతోఁ దల నొవ్వ [illegible] మాట. (అని కోదండమును బాఱవైచి రథము [illegible] దుమికి పరుగెత్తును.)

బృహ:—(నవ్వి) ఇంక నీవేఁడు [illegible] చేయఁజాలఁడు. సారథిగానైన నంగీకరించునట్లు చేసి కౌరవుల గర్వ మడంతు. (అని పగ్గములు నొగల నుంచి కశాభూషితహస్తుఁడై ఉత్తరుని వెంటఁ బరుగిడి సమీపించును.)

ఉత్త:—(తిరిగిచూచి నమస్కరించి) బృహన్నలా! నన్నుఁ బట్టుకొనకుమా. మాతల్లిదండ్రులను భార్యను జూచిన తర్వాత వాఁడికత్తితో గొంతు కోయుము.

౧౭ పాట.

బృహ:—(పరుషముగా) ఉత్తరకుమారకా! పగవారు నవ్వ నీవిట్లు పరుగెత్తిన నేనే మందును? నన్నేల సారథ్యమునకుం బిల్చితివి? ఇంతవఱకిసుమంతయు నవమానము నొందక యిపుడు నీవలన నవమాన మొందవలయునా? రారమ్ము. రథ మెక్కుము. నేను రథముపై నుండ నీకేమిభయము. కౌరవులు కారు. ముప్పదిమూఁడుకోట్ల దేవతలు వచ్చినను ఒక్కబాణమైనను నీమేను నంటనిత్తునా (అని పట్టుకొనును.)

ఉత్త:—బృహన్నలా! నామాట వినుము.

చ. శతములు హేమనిష్కములు♦చక్కని రత్నము లొక్కవేయి యు
న్నతహయరత్నముల్ శతము♦నాగము లొక్క సహస్ర మిచ్చి యూ
యతసుఖసంపదల్ వెలయు♦ నట్టిపురంబులు నాలుగిత్తు నే
వితమున నైన నింటికిని♦వేగమ పోవఁగ నిచ్చి నంతటన్.

ఇంతమాత్రమే కాదు. ఇల్లు చూడనిమ్ము. నీకేమేమి బహుమాన మిచ్చెదనో ఇపు డెందుల కామాటలు. (అని చెవిలో నేమో చెప్పును.)

బృహ:—(బలవంతముగ నుత్తరు నెత్తికొని వచ్చి రథముపై నిల్పి) రాజకుమారకా!

చ. అందము నెక్కవయ్య మదియందు భయంబును వీడవయ్య సం
గర మొనరింపఁ జాలనని క్రమ్మఱఁ దోఁచినఁ దేరుఁ దోలు మా
యరిబల మెల్ల బెండువడ నాకురురాజును సిగ్గునొంద ని
ర్జరులు బళీ యనంగ రణరంగమునం దొకయాట నాడెదన్. 8

క. అందులకో యిందులకో
సందియ మేమియును లేక సత్వరముగ నీ
డెందమున నెంచి యొడఁబడు
మందమతిం బాఱిపోవు మాట విడువుమీ. 9

ఉత్త:—(ఊరకుండును)

బృహ:—(నొగలపైఁ గూరుచుండఁ జేసి) ఉత్తరకుమారా! అల్లదె మఱ్ఱివృక్షంబు కానవచ్చెడిని. అచ్చటికి రథముం దోలుదును.

ఉత్త:—(విసుగుకొనుచు రథము గడపును)

బృహ:—రాజకుమారా! మఱ్ఱిచెట్టెక్కి యా కొమ్మకుం గట్టిపెట్టిన మూటను దెమ్ము.

ఉత్త:—(చూచి నిగుడించి) బృహన్నలా! నేనెంత పనికిమాలినవాఁడ నైనను నన్నింత నీచపుఁ గార్యమునకు నియోగించుట న్యాయమా! క్షత్రియుఁడను గదా శవమును ముట్టఁ దగునా?

బృహ:—యువరాజా! శవమే యైన నీకీపని చెప్పుదునా! ఇతరులు తాకకుండుటకై యీరూపముగఁ గట్టిన శస్త్రాస్త్రములు గాని శవము కాదు. సంశయ మొందకుము.

ఉత్త:—(చేయునది లేక చెట్టెక్కి నిలువఁబడును.)

బృహ:—వేవేగ ముడివిచ్చి గాండీవమను చాపంబు నాకందిమ్ము. అదికాని నాబాహువుల యాటోపంబున కాగదు.

ఉత్త.—బృహన్నలా! ఇందు గాండీవ మున్నదియా. (అని ముడివిచ్చి యదరిపడి) సారథీ! సారథీ! అయ్యో! గాండీవ మిందున్నదని మోసము చేసితివే. ఇందున్నది కొండచిలువలు సుమీ. వీనిచేఁ గఱపించుటకుం బూనితివా. దీనికన్న నందే గొంతు గోసియున్న మేలుగా నుండునే. నీకోరిక నెఱవేఱియుండును గదా.

బృహ:—భయపడకుము. అవి గాండీవము మొదలగు దివ్యకోదండములు. నిశ్చయము త్వరఁగ దేతెమ్ము.

ఉత్త:—సారథీ! ఇది యొక కొండచిలువవలెఁ జెలువారుచు సులలితరత్నఖచితమై

కనకకమలాలంకృతంబై యున్నయది. ఎవరి దీచాపము? తక్కిన వెవ్వరెవ్వరివి? నిరూపింపుమా.

బృహ:—తొలుదొలుత నీవడిగినది గాండీవము. అది యర్జునుని హస్తమునకే యలంకారము. దాననే యతం డనేకవీరులను గెల్చి దేవదానవులు మెచ్చం బ్రవర్తిల్లెను. నీలోత్పలమునలెం దేజరిల్లి కనకకింకిణీసుందితంబైన చాపంబు ధర్మరాజుది. తాళప్రమాణమునం దగి బంగారుశాఖలచే విలసిల్లు కోదండము భీమునిది. ప్రజ్వలజ్వలనాకృతిగ్రో కనకమత్స్యసమంచితశరాసనంబు నకులునిది. మనోహరంబై కాంచనమయూరాలంకృతంబగు ధనుస్సు సహదేవునిది. వృషభచర్మము చుట్టినదియే గాండీవము, దానినే తెమ్ము.

ఉత్త:—బృహన్నలా! ఈదివ్యాయుధంబుల నిందుం బెట్టి పాండవు లెందేగిరో వారి యుదంతంబు తెలిసియున్నం జెప్పుమా. వారికి నేమేనల్లుండను.

బృహ:—వారెల్ల మనవీట నజ్ఞాతవ్రతం బూనియున్నవారు.

ఉత్త:—బృహన్నలా! మనవీట నున్నారా, ఎవరు వారు?

బృహ:—యువరాజా! వినుము.

సీ. కంకభట్టను పేరు గాంచి మీతండ్రికి
దమిఁ గూర్చునాతండె ధర్మజుండు
వలలుఁడన్ పేరున వర్తించి కీచకు
లను జంపినాతండె యనిలసుతుండు
అశ్వశిక్షకుఁడయి యలరి దామగ్రంథి
నామంబు గలవాఁడె నకులుఁ డగును
ధేనురక్షకుఁడు తంత్రీపాలుఁ డన నొప్పు
పావనుండే సహదేవుఁ డగును
తే. మాలినీనామమున నొప్పు మహితశీల
ద్రౌపది యటంచు నెఱుఁగుము భూపతనయ
యింక దాఁపంగ నేనుగు నేనె యర్జు
నుండ వేగంబ తెమ్ము కోదండ మిటకు. 10

ఉత్త:—(ఆనందపరవశుండై బ్రాహ్మణుడిగ్గ నుతికి నమస్కరించి) మహాత్మా! నేటికి నాజన్మము పవిత్రమాయె. సఫలమనోరథుండనైతి. తెలియక నాచేసిన సకలాపరాధంబులు క్షమింపవలయు. గర్వంబుచేఁ గాని, కోపముచేఁగాని నాయాడిన మాటలు సహింపవలయు. (అని చేతులొగ్గి ప్రార్థించును.)

బృహ:—యువరాజా! మీయాశ్రయమున సుఖముగాఁ గాలము గడపితిమి. ఏకష్టములు లేక యుంటిమి. ఇట్టి మహోపకారులగు మీకు మేము కృతజ్ఞులము. సారథ్యము చేయునప్పుడు నేను నిన్నాడిన మాటలకు మనస్సున నేమియు ననుకొనవలదని నేనే వేడుకొనవలయును. నాయనా! చిన్నవాఁడవు. కాన నిన్ను మిక్కిలి ప్రార్థింపరాదు. నామనస్సునఁ గ్రోధ మేమాత్రము లేదు. నీవు నట్లే ప్రసన్నస్వాంతుఁడవుకమ్ము.

ఉత్త:—[1]కృతార్థుఁడ నైతిని. మహాత్మా! మీ చెలిమియు సమకూడె. రణరంగమున మీకు సారథి యగునంత భాగ్యము నాకుం గలిగెను. ఇంతకన్న నాకేమి కావలయు

బృహ:—ఉత్తరకుమారా! తక్కిన దివ్యాయుధముల నెప్పటియట్ల కట్టిపెట్టి రమ్ము. కురుబలములు మనలం జూచుచున్నవి. నాటిమార్గ్గని నిల్పుకున్న గోధనము మనకుం దక్కదు. కౌరవవీరుల నుక్కడంచెద. చేతులతీఁట పోవ వేటాడ వలదా.

ఉత్త:—అట్లే చేసితి. ఇంక రథ మెక్కుదము.

(ఇద్దఱు నిష్క్రమింతురు)

ఇది షష్ఠాంకము.

---

1 అద్భుతప్రాప్తిరూప మగుట నిది యుపగూహనము.

సప్తమాంకము.

(పిదప అతిరథ సుకేతనులను గంధర్వులు ప్రవేశించుచున్నారు)

అతిర:—సుకేతనా! ఇంద్రుని యానతి యెఱుంగుదువు కదా! వచ్చినపనిన్విమర్శించి తెలిసికొని త్వరగా నీవార్తల నింద్రునకుం దెల్పవలదా.

సుకే:—అతిరథా! నిశ్చయమే. నేను నాపని నిర్వహించి వచ్చితి. నీపని యెంత మాత్రమైనది?

అతిర:—నీవు విమర్శించివచ్చినపనియేదిఁ తెల్పుము.

సుకే:—దక్షిణగోగ్రహణము సుశర్మ జరపంగా విరాటుఁడు యుద్ధమునకుం బోవుచు ధర్మజభీమనకులసహదేవులను బిల్చుకొని పోయెను. విరాటునకు ప్రాణాంతము కలుగునంతటి విపత్తు సుశర్మ యొనంగూర్ప భీమాదులు ఆవిపత్తును దప్పించి సుశర్మను బంధించిరి. ధర్మరాజు కృపాయత్తమతి గావున నాతని విడిపించెను. సుఖముగా నందఱు పురము ప్రవేశించుచున్నారు.

అతిర:—సంతోషమే గాని విరాటునకుఁ దనకు సాయముచేసిన వారు పాండవులని తెలిసినదా.

సుకే:—లేదు లేదు. ఇంకను ఆతఁడు తెలిసికొనలేదు.

అతిర:—చాల సంతోషవార్త తెలిపితివి. పాండవుల గుట్టు ఇంకను దెలియకుండుట యుత్తమము.

సుకే:—ఇంక నీవరసిన వృత్తాంత మేది?

అతిర:—మిత్రుఁడా! విను. దుర్యోధనాదు లుత్తరమున గోవుల నరికట్టిరి. ఆవార్త తెలియంగనే యుత్తరుఁడు బృహన్నల సారథిగాఁ జేసికొని యుద్ధమునకు వచ్చి కౌరవులను జూచి భయము చెంది పరుగెత్తెను. బృహన్నల యాతనింబట్టి తెచ్చి సారథిగఁ జేసికొని శమీవృక్షమునఁ దమకట్టినయాయుధంబులదింపించి తమగుట్టు వానికిం దెలిపి కౌరవులపైఁ గవిసెను. బృహన్నల యర్జునుఁడే యయ్యెనేని మరల నడవులకుం బోవలని వచ్చునని దుర్యోధనుం డాక్షేపింప భీష్మద్రోణు లాశంక మాన్పిరి. అర్జునుఁడు ద్రోణాదివీరుల మార్గానఁ బోవుచున్నాఁడు. ఆవిషయమును జూచి పోయి యింద్రునకుం దెల్పుదము రా.

(అని నిష్క్రమింతురు.)

(దుర్యోధన కర్ణ శకుని భీష్మ ద్రోణ కృపాశ్వత్థామాదిమహారథికులు ప్రవేశింతురు.)

దుర్యో:— వీరులారా! అర్జునుఁడు వచ్చువాఁడని నిశ్చయమాయెఁగదా. పదుమూఁడు సంవత్సరములును నిండెననియుఁ గూడ నిర్ధారణము భీష్మద్రోణులచేఁ జేయఁబడెను. ఇంక యుద్ధమునకు సిద్ధపడి తగిన పద్ధతిని నడుపుఁడు.

ద్రోణా:— మహారాజా! మన కిది యుద్ధము చేయు తరుణము కాదు. దేవేంద్ర శంకరాదుల మెప్పించి సకలదివ్యాస్త్రములం బడసి తేజరిల్లుచున్నవాఁడు. యుద్ధము లేమిఁ దీఁటఁ బట్టిన చేతులతోఁ గలియనున్నవాఁడు. మన మెల్ల నాతనికిం దోలిముద్ద యగుదుము. అతని మార్గణమును నిల్ప మనకిప్పుడసాధ్యము. నేఁడాతని యుత్సాహముం జూడ సురాసురులు మార్గణమ్మును జయింపలేరని తోఁచుచున్నది. నామాటలం బాటించి గోవుల విడిచి మనము పురికరుగుట యుక్తము. ఇదియే నాభావము.

కర్ణు:— (పకపకనవ్వుచు) రాజకంఠీరవా! ముదుసళ్లను సంగరమునకుఁ బిల్చుకొని రావలదని నెత్తిన నోరుపెట్టుకొని మందలించితి. నామాటలం బాటింపక వీరిం గొనివచ్చితివి. చూచితివా ప్రతిక్షణము నశుభములు పల్కుచున్నవారే కాని మనకు శుభముత్సాహమును గల్గిన యొక్కమాటయైనను బల్కరు. అర్జునుఁడఁట. మనల జయించునఁట. దివ్యాస్త్రములఁ బడసినాఁడఁట. వీరిబోలి మనకేల? నేను కన్నాయితంబుగా నురమొనర్చెద. గాండీవము గీండీవము పాశుపతము గీశుపతము ఏమైన పోవునో చూతువుగదా.

అశ్వత్థామ:— కర్ణా! నిశ్చయము నీవంతవాఁడవే. ద్రౌపదీస్వయంవరము నందు నీకోడిగదా యింతకాల మర్జునుఁ డడవుల దాగియుండెను. సిగ్గులేక నేఁడు తల యెత్తుకొని మరల వచ్చినాఁడు. ఘోషయాత్రలో గంధర్వులు రాజును బంధింప నీవే కదా విడిపించితివి? సెబాసు! నీవే శూరశిఖామణివి. నీవే మేటి పరాక్రమధనుఁడవు. నిన్ను నమ్మి కదా రారాజు పాండవులతోఁ బగగొనుట. తులువా! సిగ్గులేక యింకను బ్రేలెదవా. పల్లూడఁ దన్నువారు లేరనికదా నీపిట్టకూయుట. ఆపని యింకఁ గొలఁది ముహూర్తములలో నర్జునుఁడే నిర్వహించును. పాలవంటి కౌరవకులమును నశింపఁజేయఁ బుట్టితివి. ఆనాఁడు సభలో ద్రౌపదీమానభంగసమయమునఁ గావించిన కార్యములన్నియు నిపుడగును. త్వరపడకుము. అర్జును నుక్కడంతువుగా. పలుగాకీ! నీవు కాదు, త్రిజగంబులొక్కటియై వచ్చిన ముహూర్తమాత్రము నిల్వఁగలుగునా. వారుని యుర

వడికిఁ బయిగిడక నిల్చి పెంచిన నాతని మాఱ్కొనిన వీరుఁడు నియోధుల నిల్వఁ జాలఁడు గా.

కృపుఁడు:—(మాటకడ్డమువచ్చి) కర్ణా! అశ్వత్థామ పిన్నవాఁడు. చక్కఁగా మాటలాడఁ జాలఁడు. మేము ముసల్లము. యుద్ధశూరులము గాము. నేఁడు శకునియు నీవును మార్కొని యర్జునునిల్పుము. పరమానందము నొందెదము. (పండ్లు పటపట గొఱికి) కులపాంసనా! నీవలనఁ గదా కౌరవులు నామావశిష్టు లయ్యెదరు. ఎన్నికుటుంబములో యుద్ధమునఁ గూలనున్నవి. నీ ప్రతాపము మాత్రమసమానమని త్రిలోకము లెఱుఁగును. మేము చెప్పిన నేమిలాభము ముదుసల్లమని మమ్మాక్షేపించితివి. నవవయస్స్ఫురితుండవగు నీవే యిపుడు యుద్ధమొనరింపుము. మేమూరక చూచుచుండెదము. అర్జునుని బాణములు నీయంగముల బ్రద్దలు చేయుచుండఁ గన్నులారఁ గాంచుచుండెదము. ఒక్కయర్జునుఁడే నేఁడు వచ్చుచున్నాఁడు. వీనిం జంపితివా మనరారాజునకు రాజ్యము దక్కును. అంతమాత్రము నేఁడు చేయుము.

కర్ణుఁడు:—రాజరాజా! నోటికి వచ్చినట్లు వీరిద్దఱు ప్రేలుచున్నారు. నీవును వింటివి గదా. ఇఁక నేనోర్వఁజాల. చండబాణములఁ బరఁగించి వీరిగుండియ లవియించెద. బ్రాహ్మణులని యింతదూర మోర్చుకొంటిని. వీరి కులంపుపల్కులు నాశాంతమును బోగొట్టుచున్నవి.

ద్రోణు:—వీరోత్తమా! కర్ణా! నీవన్నమాట నిశ్చయమే. నీవంతవాఁడవే. నిన్నుఁ బ్రాణబంధువుగా నమ్మియున్న రారాజు కృతకృత్యుఁ డగుసమయము వచ్చినది. మేము విప్రులము. భోజనప్రియులము. యుద్ధము మాట మాకుఁ దెలియదు. శస్త్రాస్త్రములం నీయొద్దనున్నయన్ని మాకడ లేవు. కాని మాశిష్యుఁడొక్కఁడే నేఁడు ఇదిగో వచ్చుచున్నాఁడు. నిల్చియా తొలఁగిచూచుచుండుము. (కోపములో) కండగర్వంబున మాగుండియ లవియింతు నటేనా. ఏది యిటు లరుగుము. శస్త్రాస్త్రపాటవంబే పాటిదో లక్ష్యశుద్ధ యెంతమాత్రమో కొంచెము చూచెద. అర్జునుఁడు వచ్చులోపల నిన్ను జక్కఁబెట్టెద.

అశ్వ:—తండ్రీ! మీ రూరకుండుఁడు. ఈతులువ నడంచుటకు మీరుపూనవలయునా? క్షణమాత్రమున నేన యొక్కఁడ డంచెద.

కర్ణు:—మహీపాలకా! ఇంక నేనోర్వఁజాల. ఇదిగో దివ్యాస్త్రములఁ జాపంబున గూర్చుచున్నాఁడ. వీరి యాశ నికింక లేదు.

భీష్ముఁడు:—(పక్కుననవ్వి) తులువా! పలుమాట లాడకు. నోరు మూసికొని యూరకుండుము. ద్రోణకృపాశ్వత్థామలముందఱ నీవెంతవాఁడవురా. వారన్నమాటలు

సత్యములు. నిన్ను నమ్మి రాజు చెడకున్నాఁడు. చెడును అర్జునమదగజము దుర్యోధనబలకమలాకరంబున విహరించి హాయిగా మరలిపోవఁగలదు. చావఁగా మిగిలిన వారు కరిపురంబున కేప్పు పెంగములతో నరుగఁగలరు.

కర్ణుఁడు:—(కోడుకలచి) రాజా! క్షణమాత్రము కూడ నోర్వను. ద్రోణద్రౌణి కృపాచార్యులారా! మీ శిరస్సులు తెగిన నయకొనుఁడు. (అని కోదండము లాగును.)

దుర్యో:—(అడ్డముసొచ్చి) కర్ణా! కొంచె మోర్చుకొనుము. ద్రోణాచార్యప్రముఖ శూరులారా! మీరిట్లు కలహించుట న్యాయమా. మనము వచ్చిన పనియేమి? నాపై దయయుంచి యంద ఱేకముఖముగా నొక వ్యూహము దీర్పుఁడు. నన్ను గెలిపింపుఁడు.

ద్రోణుఁడు:—రాజా! నిన్నుఁ జూచి యూరకుంటిమి. ఓపిన భంగి పోరాడుదము. చూడు మెవ్వరెవ్వరికి గెల్పో. ఇంక నందఱము ముందు పయనము సాగింపక వెనుక పెంగముగా నిల్చి యుద్ధసన్నద్ధులమై గావలయును.

(అని యుందఱు నిష్క్రమింతురు.)

(అర్జునుఁ డుత్తరుఁడు సారథిగా రథమునడుపఁ బ్రవేశించుచున్నాఁడు)

అర్జు:—ఉత్తరకుమారా అల్లవారె కురువీరులు. భీష్మద్రోణాదులం జూడుము. వీరుమహాత్ములు. నాకుం గురువులు. పూజ్యులు. వీరితోఁ దొలుత యుద్ధము సేయరాదు. నిక్కముగ వారలిగిరా జయము సంశయము. అల్లవాఁడె కురురాజు. అరద మచటికిం దోలుము. నీవేమాత్రము భయపడకుము.

ఉత్త:—భయము సాకా! మనపగవారికి. ఇఁక నీపూరకుండి చూచుచున్న నేనే సంగర మొనరించెద. నీసాయమున్న వీరు నాకింక లెక్కయా.

అర్జు:—(నవ్వి) యువరాజా! అంత కష్టము నీకేల? నేను యుద్ధ మొనర్చెద. రథ మతి వేగమున దుర్యోధనుని కడకుం దోలుము ద్రోణాదులకు నమస్కారబాణములు ప్రయోగించునంతదాఁక మెల్లగా నడుపుము.

ఉత్త:—(అట్లే రథమునడపును)

అర్జు:—(భీష్మద్రోణకృపాచార్యులపంకఁ దిరిగి) మహాత్ములారా!

చ. కాలము దుష్టమౌట మిముఁ గాంచెడు భాగ్యము లేక కానలో
నోలి వసించి యుండి యిటుపై త్రయోదశ వ్రతవత్సరంబు నుం
బాలనచేసి వచ్చితిని పార్థుఁడ శిష్యుఁడ న్యాయరీతి న
న్నేలుఁడు వందనంబు లివియే శరరూపము లందుకోఁ దగున్. 1

(అని బాణముల వైచును)

భీష్మ:—(ద్రోణాదు లానందబాష్పముల విడుతురు)

అర్జు:—(దుర్యోధను సమీపించి చిఱునవ్వుతో)

ఉ. పాడి తొలంగ కిట్లు పలు • బాముల కోర్చి ధర్మచిత్తుఁడై
యూడనలేని ధర్మసుతుఁ • డెట్లు వచించిన నట్లె చేయుచుం
గ్రీడయు బోలె సద్వ్రతము • రీతి బ్రతిజ్ఞను దీర్చి నిన్నిటం
జూడఁగ వచ్చినాఁడ నిదె • శూరుఁడవే రణభీతు మీఁదఁగన్. 2

అనాఁడు సత్యపాశబద్ధులమయి యూరకుంటిమి. నీ యిచ్చవచ్చినట్లు పరిహాసించితివి. ద్రౌపది ననరాని మాటలంటివి. చేయరాని యవమానమును జేసితివి. కపటద్యూతంబున నధర్మపద్ధతియే ప్రధానముగాఁగలమార్గంబున మమ్ము గెల్చి అడఁచితివి. పెట్టరాని కష్టములం బెట్టితివి. అన్నా! ఒక్కమాట వినుము.

సీ. శకుని చేసిన కను • సన్నలఁ బాచికల్
దొరలించి రాజ్యంబుఁ • దోచుకొనుట
దుశ్శాసనుఁడు చేయు • తులువకార్యంబులఁ
గన్నులారఁగ నీవు • గాంచుచుంట
కర్ణుఁడు మదిఁ బొంగు • కౌతుకంబుననాడు
కలుషంపుబల్కుల • నెలమి వినుట
పలుగాకులను నమ్మి • పాండవుల జయింతు
నని యాశ మనమున • నందుగనుట
తే. నేటితోఁ జెల్లె నీయాశ • లేటఁ బడెనొఁ
మీటిమగఁడవు దుర్మద • పాటవంబు
గల్గు రాజవు నిలువుమా • కయ్య మిప్పుడు
పోసఁగె నాతోడ నింకెందుఁ • బోవవచ్చు. 3

దుర్యో:—అర్జునా! చిరకాలమునుండి యుద్ధములేక పరితపించు నాకు నేఁడు పండుగు దినము. పౌరుషంబు లేల గాని సంగరమున నీవే తెలిసికొనఁగలవు. కయ్యమున కాయత్తుఁడవై నిలువుము.

అర్జు:—అన్నా! దుర్యోధనా! యుద్ధములేక యుంటివా. ఘోషయాత్రసమయమున గంధర్వులతో యుద్ధము పొసఁగినపుడు బాహుపరాక్రమము జూప సమయము లభింపలేదు కాఁబోలు. గంధర్వు లింతలోనే యోడి పరుగెత్తిరి కాఁబోలు. కర్ణశకునిదుశ్శాసనులు వారిని బాఱఁ దోలిరి కదా. సిగ్గులేక యింకను మాటలాడెదవా. ఇదె నాతీవ్రబాణవిషధరంబులు నీప్రాణవాయువులం గ్రోలఁ

గలవు. నీకిపుడు సాయమొనరింపఁగల వారలంబిల్చుకొమ్ము. కడసారి వారితో మాటలాడుము. ఇఁక మరల నీజన్మమున వారలఁ జూడఁజాలవు.

భీష్మద్రోణులు:—విజయా! మమ్ముఁ జులకన చూచి యెందుబోటికిఁ బోవఁదగునే. అది వీరధర్మమే. యుద్ధమునకు మేము పిల్చుచున్నవారము. మమ్ముఁ దిరస్కరించి పోవుట నీకు మేలుగాదు.

అర్జు:—ఉత్తరా! గురువులు రమ్మనుచున్నారు. మీఁదు మిక్కిలి దుర్యోధనున కడ్డముగా నిలువఁ బడనున్నారు. వారిం దిరస్కరించితి ననుచున్నారు.

దుర్యోధనుఁ గనఁబడకుండ రథములం దోలించుచున్నారు. రథము వారి కభిముఖముగం ద్రిప్పుము. ఇందె యుండి వారి నిల్వరించెద.

(అని నిష్క్రమించును.)

(అతిరథసుకేతను లంబరమున మరలఁ బ్రవేశించుచున్నారు.)

అతి:—మిత్రమా! మన మీసందడిలో నెందెందో చూచుచుంటిమి. అర్జునుఁ డిప్పుడే దుర్యోధనుఁ దలపడ భీష్మద్రోణద్రౌణికృపకర్ణు లెదురునడిచి మార్కొనఁగా వారి నక్రమంబున నోడించి దుర్యోధనుల నొప్పించి సమ్మోహనాస్త్రంబు ప్రయోగించి యందఱ మూర్ఛితులను జేసెను. చూడుమా. ఎల్లవారు నిద్రపోయినట్లు పడుకొని యున్నారు.

సుకే:—వారివస్త్రములఁ గత్తిరించుచున్నాడే, ఎవఁ డాతఁడు?

అతి:—ఎఱుఁగవా! అతఁడే కదా యుత్తరకుమారుఁడు.

సుకే:—అర్జునుఁ డేటికో వెనుకకు లాగుచున్నాఁడే.

అతి:—ఉత్తరుఁడు తెలియక భీష్మునిరథము చెంతకుఁ బోవఁ బ్రయత్నింప నా మహాత్మునకు సమ్మోహనాస్త్ర బాధలేదు కావున నచ్చటికిఁ బోవలదని నివారించి వెనుకకుఁ బిలుచుకొని పోవుచున్నాఁడు.

సుకే:—ఆహా! అప్పుడే యిందఱ నోడించి తలచీరలు కత్తిరించుకొని రథ మెక్కి దేవదత్తము పూరించుచు మరలి గోగణంబులం దోలించుకొని పోవుచున్నాఁడు. ఎంతటిసామర్థ్యము.

అతి:—మిత్రమా! మన మీవార్తల వేవేగ దేవేంద్రునకుఁ దెలియఁబఱుపవలయు. పోదము రమ్ము.

(అని నిష్క్రమింతురు.)

(విరాటుఁడు కంకభట్టును బ్రవేశించుచున్నారు.)

విరా:—కంకభట్టూ! విజయమును గాంచి వచ్చితిమి గాన మనము పాచికలాడుదమా.

కంక:—మహీపాలకా! ద్యూతమున నెక్కువ ప్రీతియుంచుట పాడికాదు. ధర్మ రాజు ద్యూతక్రీడవలననే రాజ్యము శత్రువులకిచ్చి యడవులపాలు కావలసిన వాఁడాయె.

విరా:—వినోదమునకై యాడినఁ దప్పుగాదు. అదిగో మన సైరంధ్రి వచ్చుచున్నది. పాచికలం దెమ్మనియెద.

(సైరంధ్రి ప్రవేశించుచున్నది.)

విరా:—సైరంధ్రీ పాచికలం దెచ్చియిమ్ము.

సైరం:—(పాచికలం దెచ్చి ముంగిడ చున్నది.)

విరా.—కంకభట్టూ! ఒకయాట యాడుదము.

ధర్మ:—కానిండు. మీయిష్టమును దీర్చుటకంటె శ్రేయస్సేది?

(గోపాలకులు ప్రవేశించుచున్నారు.)

గోపా:—జయము జయము మహారాజు గారికి.

విరా:—ఏమి వార్తలు?

గోపా:—కౌరవుల నోడించి యువరాజుగారు గోవుల మరలించుకొని బృహన్నలతో వచ్చుచున్నారు.

విరా:—(పరమానందముతో) మంత్రీ! ముందు వీరికి బహుమాన మిప్పింపుము.

మంత్రి:—చిత్తము (అని వస్త్రాభరణముల నిప్పించును)

విరా:—కంకభట్టూ! కురువీరుల నెల్ల నోడించి మనయుత్తర కుమారుఁడు గోవుల మరలించుకొని వచ్చుచున్నాఁడట. ఎవ్వరైన నిట్టి పరాక్రమంబు చూపినట్లు వింటిమా. కులోద్ధారకుఁ డిట్టివాఁడు కదా.

కంక:—భీష్మద్రోణద్రోణికృప కర్ణదుర్యోధనాదుల మన యుత్తరుఁడే జయించెనని దీనికంటె మహోత్సాహకృత్యము మఱిదియుండునుకి? వీరులలో నుత్తరుఁడే అగ్రేసరుఁడగుఁ గదా.

విరా:—(కటకటంబడి) ఇదేమి యిట్లనుచున్నావు కంకభట్టూ! ఈమాట వలన విజయము సందియమని కదా నీతాత్పర్యము! ఓర్చితిని. రెండవ పర్యాయ మి ట్లాడకుము.

కంక:—

క. కురుబలము మాట యేటికి
సురాసురులు కోట్ల కొలఁదిఁ జేరిత మెఱయం
బరువున రాఁగ బృహన్నల
యురదంబున నుండ గెల్చుట బ్రమె భూపా. 4

విరా:—(క్రోధముతో) నీవు చెప్పఁగా నిట్టి వింతలు వింటిమి. లోకమున సారథులను జూచితిమా రథికులను జూచితిమా. ఈనాఁటికి సారథుల సాయమునఁ జే రథికులు విజయ మందుట నీవు చెప్పఁగా విన్నారము. నాకుమారుని విజయమున కోర్వఁక యాడు నీమాటలు చాలు. ఇఁక నూరకుండుము.

కంక:—(నవ్వుచు) మహీపాలకా బృహన్నల యుద్ధముచేయ వాంఛఁ బూని యుత్తరకుమారుని సారథిగాఁ జేసికొని కౌరవుల నుక్కడించి పసుల మరలించెఁ గాఁబోలు. ఈ నామాట తప్పదు. కొంతసేపటికి నీకె తెలియఁగలదు. వేగంబ బృహన్నల కౌరవుల జయించెనని చాటింపుము.

విరా:—(క్రోధోద్రేకమున) కంకభట్టూ! వలదన్న మానకొనవా. నాకొడుకు మాట యన్న నీకుఁ దలనొప్పిగా నున్నట్లున్నది. అశుభములు పల్కుచున్నావా. కన్నులు కానరాలేదు కాఁబోలు (అని సారెతోఁ గొట్టును.)

సైరంధ్రి.—(పరుగెత్తివచ్చి పైఁటతో రక్తధారలు క్రిందఁబడకుండ నొత్తును)

విరా:—నీవేల చీరకొంగుతోఁ దుడుచుచున్నదానవు.

౧౭ పాట.

సైరంధ్రి:— విమలవంశంబునఁ బుట్టి; పుణ్యాసక్తుండై, మహత్తుఁ డనఁ బ్రఖ్యాతిగాంచు నీసత్యనిరతుని రక్తమెన్ని బిందువులు భూమిపైఁ బడునో యన్నివర్షము లనావృష్టి సంభవించును. అక్కటా! ఇట్టి మహాత్మున కొక యపకారము చేయుట విపత్కారణము.

(ఉత్తరకుమారుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

ఉత్త:—(తండ్రికి నమస్కరించును.)

విరా:—(ఆనందమునఁ గౌఁగిటం జేర్చి ముచ్చటలాడును)

ఉత్త:—(కంకభట్టు మోమునఁ జిమ్ము రక్తబిందువులఁ జూచి) తండ్రీ! అదేమి? ఈ మహనీయుని మోమున రక్తబిందువులు చిమ్ముచున్నవే? ఏల?

విరా:—కుమారా! నీజయము నోర్వఁక యీతఁడు బృహన్నలఁ బొగడె. దానఁ గోపించి సారెఁగొని వేసితి.

ఉత్త:—తండ్రీ! మహాపరాధము గావించితిరే. విప్రోత్తము లేమన్నను, వినవలయుచో గాని వారిని వారింపఁ దగునా. ఈ పవిత్రచరిత్రుని నీఁ ప్రార్థింపుఁడు. మనవంశము నిలుచును.

విరా:—(భయభక్తులతో నమస్కరించి) కంకభట్టూ! త్వరపడి తప్పుచేసితిని. మనమునఁ గోపమూనకుమా.

కంక:—మహీపాలకా! నాకు నీపైఁ గోపము గల్గునా. విధివశ మిది? భయపడకుము
(అని చిఱునవ్వు గనఁబఱచును.)

విరా:—కుమారా! యుద్ధవార్తలఁ దెల్పుము. ఎట్లుమార్కొంటివి? ఒక్కరుఁడవే యింతసాహస మెట్లు చేసితివి? విన వేడుకయ్యెడు.

ఉత్త:—తండ్రీ! వినుము.

సీ. కురువీరులను జెండఁ • గోరిక నేగితి
వారిఁ గాంచిన యంత • భయము నొంది
వడవడ వడఁకుచుఁ • బరుగెత్త సాగితి
నంతలో నొక్క మ • హాత్ముఁ డెలమి
నరుదెంచి నన్ను నా • యరదంబుపై నిల్పి
తారథికుండయి • వారిఁ దాఁకి
భీష్మాదిరథికుల • పెం పడగించెను
గోవుల మరలించెఁ • గూర్మి నన్నుఁ
గాచి విజయంబుఁ గల్గించెఁ • గౌరవేంద్రుఁ
డేడ్పు మొగమున నింటికి • నేగె; నేను
నమ్మహాధీరు కరుణ జ • యంబు నొంది
వచ్చితిని సత్యమియ్యది • వసుమతీంద్ర. 5

విరా:—(సంతోషముతో) ఆమహానియుఁ డెవ్వఁడో నేను జూడఁ గోరుచున్నాను.

ఉత్త:—నేఁడో రేపో మీకు నేత్రోత్సవము చేయఁగలఁడు.

విరా:—ఆమహానీయుని జూచినఁ గాని నామనస్సు తృప్తినొందదు. నాయనా! వీర కృత్య మ్మొనరించితివి. సత్కీర్తిఁ గాంచితివి. వేగంబ తల్లి మనస్సు నానందంబున మునుంగం జేసిరమ్ము.

ఉత్త:—చిత్తము. ఇదె పోయి వచ్చెద.

(అని అందఱు నిష్క్రమింతురు.)

(పిదప ధర్మరాజు విరటుని గద్దియపై నుండ భీమాదులు ప్రవేశించుచున్నారు)

ధర్మ:—సోదరులారా! మన వ్రతముసంపూర్ణమాయె. ఇఁక మనము విరాటునిమన్ననలం బడసి ముందటిప్రయత్నమును జరుపవలయును.

భీమాదులు.—నిశ్చయమే. మీచిత్తవృత్తి మెలఁగువారము. అదె విరాటభూజాని యుత్తరునితో వచ్చుచున్నట్లున్నది.

(ఉత్తరునితో విరాటుఁడు ప్రవేశించును.)

విరా:—(చూడ్కి నిగుడించి సింహాసనముపై నున్న ధర్మరాజుం గాంచి) కోపముతో) ఇదేమి కంకభట్టూ! నాసింహాసనముపైఁ గూర్చుండుట యే గాక నన్నుఁ జూచియైన దిగక యున్నావు? ఇంత యహంకారమేల ?

అర్జు:—(మందహాసము నభినయించి)

చ. వినుము విరాటభూమివర! విక్రమసంపదఁ బెంపు మీఱ శ
త్రునికరభీతిదుం డగుచుఁ దోఁచుచు సూనృతవాదియై సుధ
ర్మను నిజశక్తి నెక్కుడగు రాజులు ధర్మసుతుం డితండె సు
మ్మనుపమకీర్తిశాలి యితఁ డస్మదగ్రుఁడు గాఁడొకో దీని నెక్కఁగన్. 6

రాజసూయాధ్వర మొనరించిన మహాపవిత్రశరీరుఁడు, సకలరాజన్యకిరీటఖచితమణిగణ నీరాజితపదారవిందుఁడు (సకలయాచకజనకల్పవృక్షము, చండవైరిసముదయకాలుండు. యశశ్చంద్రచంద్రికాపవిత్రీకృతత్రిలోకుండు ఈతఁడే సుమా.

విరా.—(ముక్కుపై వ్రేలిడుకొని) ఈమహానీయుఁడు ధర్మనందనుండగునా. అట్లైన భీమార్జున నకుల సహదేవులును, ద్రౌపదియు నెందున్నవారు?

అర్జు:—బకదానవుం బొలియించి, కిమ్మీరాసురారిం గీటడంచి, ప్రచండదోర్దర్పభయంకరుండగు హిడింబు నామావశిష్టుంబు గావించి మల్లురనెల్లం జెండి పలలాభిధానంబున మీనగరంబున వంటలవాఁడయి దైవవశంబున నున్న నుదారవిక్రముం డరాతిలయకాలుండు భీముం డీతఁడే యని యెఱుంగుమా. విరాటభూమిపాలకా! ఈతఁ డశ్వాధ్యక్షుండై దామగ్రంథినామంబున నలరు సుగుణమండితుండు నకులుండు సుమీ. గోపాలకముఖ్యవృత్తిం గొని తంత్రీపాలుండను నామంబు దాల్చి రూపజితమన్మథుండైన యీతండె సహదేవుండు. మాలిని యను పేరం బరఁగి సైరంధ్రీవేషంబున సద్వృత్తిఁ జెలంగి సుధేష్ణాదేవికడ నున్న యీపావనశీల ద్రుపదమహీజాని కుమారిక యని తెలియుమా. ఈసాధ్వీతిలకమునకై కాదె మహాపరాధియగు కీచకుని నక్రమంబున రహస్యప్రకారంబున భీముండు పొలియించె.

భీముఁడు:—విరాటమహీరమణా! విధివశంబున షండరూపంబు నొంది కన్యకామణులకు నృత్తగీతవాద్య విశేషంబులఁ గఱపుచు బృహన్నల యను పేరఁ బ్రఖ్యాతిఁ గాంచిన యీతఁడే యర్జునుఁడని యెఱుంగుము. ఖాండవదహనంబు తఱి నాఖండలు నోడించి, కాలకేయాది దానవుల నింద్రుపనుపున రూపుమాపి, యామహేంద్రు నర్ధాసనంబునఁ గూర్చున్న యదృష్టశాలి యీఘనుండే యని తలంపుమా.

ఉత్త:— ఈమహామహుఁడే నన్ను సమగ్రామున రథంబుపైఁ గూర్చుండఁజేసి కౌరవులనెల్ల జయించిన మహాత్ముండు.

విరా:— (అర్జునుం గౌఁగిలించుకొని) మహానుభావా! నాకులంబునుద్ధరించితివి. నీఋణము నాబుఁ దీర్ప నేనెంతవాఁడ. (ధర్మరాజునకు నమస్కరించి) ధర్మనందనా.

కం. తెలిసియొ తెలియకయో నేఁ
బలికిన మాటలకు నెల్లఁ బాటింపక యి
మ్ములఁ గరుణం గాపాడుము
సులలిత సత్కీర్తి సాంద్ర! క్షోణీశేంద్రా! 7

భృత్యానుభృత్యుండను. నాచేసిన యపరాధము లన్నియు క్షమింపవలయు. దక్షిణగోగ్రహణంబున నన్నుద్ధరించితిరి. ఉత్తరగోగ్రహణంబున గౌరవుల బారిఁ బడకయుండ నాతనయునిం గాపాడితివి. ఇదంతయు నీరాజ్యంబు. మేమెల్ల నీపాదసేవకులము. ఈరాజ్యం బేలి మమ్ముఁ గాపాడుము.

ధర్మ:— మహీరమణా! దుస్తరంబగు నీయజ్ఞాతవాససంవత్సరంబు నీప్రాపు నిస్తరించితిమి. నీచేసిన తప్పులు లేవు. ఉన్నను అవి స్మృతికి వచ్చునవి కావని నమ్ముము.

ఉత్త:— జనకా! మనకు రాజ్యమెక్కడిది? నిన్న నేఁడు వీరుజయించి యిచ్చినది కదా యీరాజ్యము. కావున నుత్తరను గానికగా నీవలయు.

౧౯ పాట.

విరా:— సంతోషము సంతోషము (ఉత్తరను పిల్పించి) ధర్మనందనా! ఈముద్దియ నాకొమరిత. ఈకన్నియ నర్జున కొప్పింపుము. ఇదియ నాకోరిక.

ధర్మ:— (అర్జునుం జూచును)

అర్జు:— విరాటభూపా! ఈ కన్నియ నాకుఁ గోడలగుఁ గాక. అదియే యుచితము.

విరా:— (పరమానందముతో) అర్జునుని వియ్యమునునాతికంటె వేఱుభాగ్యము నాకుం గలదే. త్రిలోకాధిపత్య మబ్బినట్లే అట్లే పరిగ్రహింపుఁడు.

ఉత్త:— జనకా! చాలుఁ బాపి అభిమన్యుని శ్రీకృష్ణమూర్తిం బిల్వనంపుము. శుభముహూర్తము త్వరలో జరుపవలయు.

విరా.— మంచిది.

(అని యందఱు నిష్క్రమింతురు.)

(వివాహమండపము, పాండవులు శ్రీకృష్ణుఁడు విరాటప్రభృతులు ప్రవేశించుచున్నారు.)

విరా:— శ్రీకృష్ణా! నేఁటికి నాగృహము పవిత్రమాయె నాజన్మము ఫలించె. నీ మేనల్లునకు నాపుత్త్రిక నొసంగితి. మీతో బంధుత్వము గూడఁ గల్గినది.

శ్రీకృ:—విరాటమహీరమణా! పాండవులతో సంబంధము నీకుఁ గుదిరినది. కృతకృత్యుఁడవు.

విరా:—ఈవధూవరులను జక్కఁగ నాశీర్వదింపుఁడు.

శ్రీకృ:— పెద్ద లందఱితోఁ గలిసి నేను నాశీర్వదించెద. వివాహ కృత్యమును నడపుఁడు.

పురో:—(వివాహకృత్యము జరపుదురు)

శ్రీకృ:—ధర్మనందనా! మీకష్టములు గట్టెక్కినవి. సుదినసములు [1]రానున్నవి. విరాటునితో బంధుత్వము గలిగినది. ఇట్టి నీకింక నేమిలోపముండును?

ధర్మ:— శ్రీకృష్ణా! మీయాదరమును విరాటుని బంధుత్వము గల్గ మాకేకొదువలును లేవు. అన్నియుఁ ఫలించినవియే. అయిన నిట్లగుఁగాక.

తే. ధరణి బహుసస్యసంపదల్ ♦ పరఁగుఁ గాక
క్షితిపులకు న్యాయ్యబుద్ధియే ♦ చెలఁగుఁ గాక
[2]జనుల కారోగ్యభాగ్యముల్ ♦ పొసఁగుఁ గాక
ధర్మదేవతవృద్ధిచేఁ ♦ దనరుఁ గాక. 8

౨౦ పాట.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

([3]ఇది నిర్వహణసంధి)

ఇది శ్రీమత్త్రిపురసుందరీ కరుణావాప్త గీర్వాణాంధ్ర కవితాప్రాభవ, కాశ్యపాన్వయప్రభవ, శ్రీజనమంచి వంశాంబురాశి కుముదినీమిత్ర సుబ్రహ్మణ్య మనీషిపుత్ర, తాండవకృష్ణాపరాభిధేయ, శేషాద్రినామధేయ విరచితంబగు, పాండవాజ్ఞాతవాస నాటకమునందు సప్తమాంకము.

సర్వము సంపూర్ణము.

---

1 కావ్యార్థోపసంహార మగుట నిది సంహృతి.

2 శుభశంసన మగుట నిది ప్రశస్తి.

3 ఫలప్రాప్తి కార్యానుకూలంబుగ నిర్వహణసంధి మూఁడంకములయందును గలిపి సాంగంబుగ వర్ణితము.

పాండవాజ్ఞాతవాసము.

పాటలు.

౧ పాట. (సూత్రధారుఁడు)—

నాటరాగము. రూపకతాళము.

పరమేశ, జగదీశ, పాపావళీవినాశ॥
పరిపాలితదేవేశా, భక్తమనోనివేశ॥పర॥ ౧
నారదముఖమౌనివరా, రాధన సంతతమోదా।
శ్రీరమణీవామాంక, స్థితబుధసర్వాభీష్టద॥ పర॥ ౨
నిగమాంత, సంచారా, నిర్మలభక్తవిచారా।
జగదానందప్రచారా, శాశ్వతసుఖకర, భయహర॥ పర॥ 3

---

౨ పాట (ధర్మరాజు)—

ధనాసరిరాగము. రూపకతాళము.

తరుణీ, మణి, యీ, ద్రౌపది, తానెటుఁగదుకష్టమ్ముల॥ తరు॥
అనవరతముపతి సేవల, నాచరించు చుండుసాధ్వి॥ తరు॥ ౧
కలయందైనను నొరులను, దలఁపనిమానితశీల,
పలువుర సేవించుచునే పగిది మెలఁగఁగలదోయింక॥ త॥ ౨
హర్మ్యమ్ములలో నెప్పుడు, నమితసుఖములొందునింతి
యన్యులగృహములమెలఁగఁగ, నానాయన్నఁ జాలనింక॥తరు॥

---

3 పాట (ధర్మరాజు)—

కమాజ్ రాగము. ఆదితాళము.

ధర్మదేవతా, దయయుంచిప్రోవుమిపుడు॥ ధర్మ॥
మున్ను నీవు, కరుణఁగాదె, సన్నుతులగు సోదరులను
బన్నములను, బొందకుండఁ బాలించుకో, నంగఁగంటి॥ ధర్మ॥ ౧
నీవెతండ్రి, నీవెతల్లి, నీవెసోదరుఁడవు సఖుఁడవు
నీవెరక్షకుఁడవునాకు, నేఁడునాఁటివరములనిమ్మిక॥ ధర్మ॥ ౨

---

౪ పాట (ధర్మజభీముల సంవాదము)—

జోగిరాగము. ఆదితాళము.

ధర్మ—పడరానిబాముల, గుడిచితిమందఱ, నుడవిలోనొకచోఁ
బడితమ్ములారా॥ పడ॥
భీము—అదియాయదనున, మదిఁజేర్పఁగనేలా, తుదముట్టు మన
వగ, గదధర్మరాజా॥ అది॥
ధర్మ—ఒకరొకరేయిఁక, నొగులుచుఁగాలము, నొకవత్సరమును
నిఁకఁబుచ్చఁదగుఁజుమ్ము॥ పడ॥
భీము—ఆర్తియేటికి కృష్ణుఁడా ర్తరక్షకుఁడు మన, కీర్తినిలుపుటకుఁ
గర్తయైయుండఁగ॥ అది॥

---

౫ పాట. (ద్రౌపది)—

కానడరాగము. ఆదితాళము.

ఈశాంతమేమన, యిడుమకుమూలము, ధీశాలురెవ్వరు, దీనిని
మెచ్చరు॥ ఈశాం॥

కాలముగనిక్రోధ, మూనిశాంతమును, మానినఁ గార్యము,మానక
ఫలియించు॥ ఈశాం॥ ౧

కానికాలమున, మానులవలెసుమఁ, బూనినఁ జెడుఁగద, కార్య
ముల్॥ ఈశాం॥ ౨

మానసీయనీకు, నెఱుఁగరానిధ,ర్మముగలదేదైన, గానిదెల్పితిని॥
ఈశాం॥ ౩

---

౬ పాట. (దుర్యోధనశకునికర్ణదుశ్శాసనులకు సంవాదము.)—

ఇంగ్లీషునోటువలె ఏకతాళము.

దుర్యో.—మనముపంపిన చారులరిగి, జనపదములఁ గనివచ్చి
నారే॥

శకు.—పనిపితి, యుక్తుల బహుభంగులనే, ర్పితి వారింకనురారు
నృపా॥ పని॥

కర్ణ.—మనవైరులుధర నునియున్నారో, విగినశమ నమ్మృతిఁ, గని
నారో, తెలియకయోపని, నొనరింపందగదు. రా—జా॥

దుశ్శా.—వారలిధారణింబొసియోయుందుర, వ్వారికైయేల విచా
రముం బూనంగ॥

---

౭ పాట. (భీముఁడు)—

కమాచురాగము. ఆదితాళము.

వినుమా ద్రౌపది భీమునిపల్కులు వ్యర్థగావివి॥ విను॥
అన్నగారియానతిమీఱ । ననువుగాదునాకునో, వన్నెలాడి నీవెఱుం
గుదుగద లే, కున్ననాఁడేశత్రులఁజంపనే॥ విను॥ ౧
నీకవమానము నేకరణినైననో, నాకెఱిఁగింపుముబోకార్గును॥విను॥

---

౮ పాట. (కీచకుఁడు)—

బ్యాగురాగము. ఆదితాళము.

ఎవరీనారీ, యెఱిఁగింపువేగ॥ ఎవరీ॥
సువిమలాంగము, సొంపుగూర్చెడు, చొక్కపుం బంగారు బొమ్మ
యిది॥ ఎవరీ॥
పతియెవండో, యతివయిదిమన భవనము, ననుండ, గనేలొకో॥
ఎవరీ॥
వినఁగఁగోరెద దీనివిధమును వీనుల, లఁగఁగఁ, దెల్పుమిఁక॥ ఎవరీ॥ ౨

---

౯ పాట. (సుదేష్ణ)—

కమాస్రాగము. ఆదితాళము.

వినుమా సోదరా,వివరింతు,నాకుఁదోఁచి చినవార్తలెల్ల॥ విను॥
వనిత, యిదినా, మాన్యయని, మనము, నందల, పోయవలదు॥విను॥
కలదు, పతులే, వురుదనకని, గంధర్వులంచు మున్నుదెలిపె॥ విను॥
ఎవ్వ, రపకృతి, సేయుదు, రోవా, రివ్వసుధఁ, బ్రాణ, ములమన
రఁట ॥ విను॥

---

౧౦ పాట. (కీచకుఁడు)—

శంకరాభరణము. ఆదితాళము.

నినుమిం, చినకాం, తలఁ గనజాలా, యిదినిజము ॥ నిను॥
వనిత, వినుము, నాదు, మనవి, తనివి, చన, న్నినుఁ గాంచిన, వినుత, ముక్తి, యబ్బినటులె, యని తలఁచెద, నిజము సుమ్ము ॥ నినుమిం॥

---

౧౧ పాట. (సైరంధ్రి)—

బిలహరిరాగము. రూపకతాళము.

పరసతులఁగోరు టేగద పాపము । అది నరకకూపము॥
బలవంతు లెందఱో మును । పరనారులఁ గోరి చెడరె ॥ అనుపల్లవి.
మునువినవె రావణాదులు మోహంబున నేమొనరిచి । మూఢులగుచు మోసపోయి । ముక్తిదూరులగుచుఁ జెడిరి॥ పర॥
వరకులమున జనియించితి । భాగ్యంబున నలరారితి । వరయగొప్ప దనముఁ బోవఁ । బరునిపత్ని వాంఛింతువె॥ పర॥ ౨
కనుమా మును పెవ్వరైనఁ । గాని యట్టివాంఛఁ బూని । కడ తేరిన వారుగలరె । కామమ్మునఁ జెడెదవేల॥ పర॥

---

౧౨ పాట. (భీముఁడు)—

మోహనరాగము. రూపకతాళము.

వినుమా మోమాటమెల్ల । విడిచి నాదుమాట రమణి॥ విను॥
అనుమానమేల సింక । ననచెద నాయథము । శపథము॥ విను॥ ౧
రేపు కీచకుఁడు భీముఁడు । చూపట్టరు పృథివిలోన ।
నా పౌరుషంబుఁజూడుము । తాపము దీర్చెద నిజముగ॥ విను॥ ౨
త్రిజగము లొక్కటివచ్చిన । దేకువ నీవైరిఁజంపి ।
తీర్చెదనీ పెనుతాపము । ధీరవగుచుఁ బొమ్ము వేగ॥ విను॥ 3
చండగదా దండమిపుడు । సన్నిధిలేకున్న నేమి ।
భండనమున నాముష్టియె । పరునిఁ ద్రుంపఁగాఁజాలదె॥ విను॥ ౪
త్వరపడకుము సరియనకుము । బిఱుసుగ మాటలననకుము ।
తరుణీ సంకేతమునకుఁ । దాను వచ్చు విధమొనర్చు॥ విను॥ ౫

---

౧౩ పాట. (కీచకుఁడు)—

శహానరాగము, రూపకతాళము.

సరోజనేత్ర బ్రోవుమా, విరాళికోర్వనే,
బిరాన కోర్కిదీర్పవే, మరుండు క్రూరుఁడే॥ సరో॥ పల్లవి.
రుచిరాంగి నినువలచి, మిగుల వెతలఁజెందితిఁక,
వెతఁబాయు నధరమొసఁగవే, బ్రతిమాలుచుంటినే॥ సరో॥ ౧
సుకుమారి యభీష్టము, వికలము గను జేయకే,
సకలంబునైన రాజ్యమిత్తు, సౌఖ్య మొసఁగవే॥ సరో॥ ౨

---

౧౪ పాట. (ఉత్తర)—

కల్యాణిరాగము. రూపకము.

మనబృహన్నలా। సారథ్యము న। ఘనుఁడుగ, గ్రహింపుమ॥ మన॥
ఖాండవమును గాల్చునపుడు। కడుమైత్రిని। నర్జునునకు।
గాదిలి సారథియట। ఘనుఁడు। నితఁడు। సుగుణరతుఁడు॥మన॥ ౧
విద్యయందు। వినీతియందును। వినయమందు, సములు లే।
రాద్యుఁడీతఁడే ఘనులలోనే। విద్యనైన నెఱుఁగునుగద॥ మన॥ ౨

---

౧౫ పాట. (ఉత్తరుఁడు, బృహన్నల)—

ఇంగ్లీషునోటు. ఏకతాళము.

ఉత్త—వచ్చినారట। కౌరవు, లుమన, పౌరుషం, బును గాంచ॥
వచ్చి॥
బృహ—వింటినేనును। గోధనంబును। తఁంటరు। లుగొని। పోయి
ర, టంచును॥ వింటి॥ ౧
ఉత్త—నాకుసారథి, లేమి నెంచెద। నీకునాపనియందు। నేరుపు।
పాకరిపు। సారథికివలెనే। పారునంచును। వింటి బళిబళి॥
వింటి॥ ౨
బృహ—లేదునాకని। యేలపల్కఁగ। నీదుపూనిక్కిఁ దగినరీతిగా।
గాదు।గానియొనర్తు। గారవ। మేదినీపతీ। గర్వమార్పుదు॥
వింటి॥ ౩

౧౭ పాట. (ఉత్తరుఁడు)—

ఇంగ్లీషునోటు. ఏకతాళము.

వినుమా, రథముర్, గొని, వేగఁ, జనకయుండఁ, గడుదవ్వు,
వచ్చినార, మింక, నోయి, సారథీ, క్షణమిందు నిల్పుమా, బలు
సైన్య, ములునవే! వినుమా॥ ౧
మదిర్, విధం, బిదం, తయుర్, బృహన్నలా, నిజం, బుగా,
దలంచి, చూడనిమ్ము, వేగనిల్పుమా, రథమెంత, దూరమో, గొని
పోక, నిల్పుమా॥ వినుమా॥ ౨

---

౧౮ పాట. (బృహన్నల)—

మోహనరాగము. రూపకము.

పరుగిడఁదగునా, పగఱునగరే॥ పరు॥ పల్లవి.
పంతంబుఁ బూనుము, పార్థివ, తనయ, యిటుల॥పరు॥ అనుపల్లవి.
అరినికరముల, నురుశరములను, బర, పియు, ముని, పురినిగనగ,
నరుగఁజేతు॥ పరు॥ ౧
ధీరుఁడ, వైభయ, దూరుఁడ, నగు న, నుగని, భయము, గొనకు॥
పరు॥ ౨
నేనీకు, ప్రాపయి, చేరితి, మదని, దిగులు, వదల, కయిటు॥ పరు॥ 3

---

౧౯ పాట. (ద్రౌపది)—

బేగడరాగము - చాపుతాళము.

భూమిపాల, సద్గుణజాల। నీవెఱుఁగవె ధర్మ, నియతి సచ్ఛీల॥ భూ॥
పల్లవి.
దాంతియుక్తుఁడునయి, శాంతుఁడౌ యతిరక్ష, మెంత భువింబడు,
నంత యాపదగల్గు॥ భూ॥ ౧
నీతియుతుం డిల, డాతతసత్కర్మ, పూతుఁ డటంచు ను, ఖ్యాతినె
ఱుంగవే॥ భూ॥ ౨

---

౧౯ పాట. (విరటుఁడు)—

బిలహరిరాగము. రూపకతాళము.

మోదమయ్యె, మదినినెంతయుఁ, ఈదినంబున, నాదగు. కోరిక, లాదరం,
బొప్పగఁ, దీర్పుఁడు, వేగమే॥ మో॥ పల్లవి.

సన్నుతిఁ జేసెద, సద్భక్తి మీఱఁగ, చిన్నికూఁతుఁగాని, నన్ను మన్నిం
పుఁడు॥ మో॥ ౧

నామనవినివిని, నరునకుఁ గాన్కగా, నాకన్నను త్తరఁ, జేకొనఁగోరెదఁ॥
మోద॥ ౨

---

౨౦ పాట. మంగళము.—

శహాన. రూపకము.

శ్రీరమాపతే, వారణవర, భారశమిత, శ్రీరఘువంశాబ్ధిచంద్ర, తే, సుమఙ్గళమ్॥
భూరిభక్త, వారమానస, భరణా, వారిజాస, నాదిదివ్య, ధారితాంఘ్రి,
కమలయుగళ॥ శ్రీరమా॥ ౧

దశరథవర, తనయా, శ్రీశ, లోక, పాలకా, శశధర, ధరసువందిత, పా
వన, విశద, నృపాలకా, వరదా, కుజనహరణ, త్రిజగన్నుతాంగ,
శ్రీకర, లోకవిమోహక, సుఖదాయక॥ శ్రీరమా॥ ౨

ఈక్రిందిపాట 39 పుటలో 17 పంక్తిలోనిది.

(కీచకుఁడు)—

బ్యాగ్ రాగము. ఆదితాళము.

ఆహాహా, త్రిలోకసుందరిరా, వహావా, నాకెవితగురా. అహా॥ పల్లవి.

ఇది యున్ననదృష్టమురా, కుద,రనియెడ నదియే, దురదృష్టమురా, కడుఁ
గష్టమురా, సెబాసు॥ అహాహా॥ అనుపల్లవి.

కరములు హేమలతలురా, నిరుపమముఖ మరవిందమురా, గళముదరము, పరి,
మళముతనువురా, వరదంతములు సుమకుట్మలములౌరా॥ అహాహా॥

నడుము సింహమును నొంపఁ, నాభియు జలధిగభీరతముంపఁ, నఖములు
చంద్రునడంపఁ, నాతిపదంబులు, చిగురులఁద్రుంపఁ॥ అహాహా॥

ఈపాట 44 పుటలో 21 పంక్తిలోనిది.

(ద్రౌపది)—

ముఖారిరాగము. రూపకతాళము.

కటకటా పావనీ, యిటు లవమానముగల్గెఁగా॥ కట॥ పల్లవి.

పటుబలశాలినై, బవరంబులోనరి, బలములఁజెండతివిగదా॥ కట॥ ౧

పాండవపత్నినై, భంగమునొందునటు, పాడుదైవమిటువ్రాసెగా॥ కట॥ ౨

నీదసన్నిధినుండి, నే దీనురాలనై, యీదుష్టమతిచేత నవమానమొం
దితి॥ కట॥ ౩

చెన్నపురి : వావిళ్ళప్రెస్సున ముద్రితము.—1921.